ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు 5% రిజర్వేషన్లు రద్దు

దేశ సమాఖ్య విధానానికి నిర్మాణాత్మక పునఃస్థాపన అవసరం 05

భటిండాలో రైతుల ఆందోళన



సంపుటి 28, సంచిక: 237 | గురువారం | 19-02-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





## తెలంగాణలో 2 స్థానాలు ఖాళీ

**10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న పోలింగ్**

**న్యూఢిల్లీ :** త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు భారత ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. 2026 మార్చి 16న పోలింగ్ జరుగుతుందని పేర్కొంది. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రెస్ నోట్‌ను విడుదల చేసింది. 37 స్థానాలు ఏప్రిల్ 2, 9వ తేదీల్లో ఖాళీ కానున్నాయి. మహారాష్ట్రలో ఏడు, ఒడిశాలో తరువాయి 12లో

# 2034 నాటికి నెట్ జీరో హైదరాబాద్




**ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్‌టిసి బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నాం. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీలకు పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయ్. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరిఅర్బన్ జోన్లకు తరలిస్తున్నాం.**

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

- అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం
- గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం
- ముంబయి 'క్లైమెట్ వీక్ సదస్సు'లో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సాహిస్తున్నామని, తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్ సెట్లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సిఎం వివరించారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి చెప్పారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్ ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవనుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంబైలోని బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలనే తన సంకల్పాన్ని సిఎం వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని తరువాయి 2లో




# అందరికీ ఉచిత విద్య



- ఒకే విద్యావిధానం రూపొందించాలి
- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- భగత్‌సింగ్, చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలని పిలుపు
- నిజామాబాద్‌లో భారీ ప్రదర్శనతో ప్రారంభమైన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభలు



ప్రజాపక్షం/నిజామాబాద్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ,ప్రభుత్వాలు కార్పొరేట్ యాజమాన్యానికి వత్తాసు పలుకకుండా అందరికీ ఒకే ఉచి త విద్యావిధానాన్ని రూపొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భగత్‌సింగ్, చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం నిజామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో మొదటి రోజు మహాసభకు ముందు ర్యాలీని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శివలింగరాజన్ జెండా ఊపి ర్యాలీని తరువాయి 12లో



## నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

ప్రజాపక్షం/హైదరాబాద్/కరీంనగర్

తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు ఎపిలోని రాజమహేంద్రవరం కోర్టులకు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు సముదాయంలో బుధవారం బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. మధ్యాహ్నం 12.05 గంటలకు బాంబు పేలుతుందంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. కోర్టు ప్రాంగణంలో పేలుడు పదార్థాలు పెట్టినట్లు సమాచారం రావడంతో పోలీసులు అత్యవసర తరువాయి 12లో

## మోదీ సర్కార్.. దేశం పరువు తీసింది

- ఎఐ సమ్మిట్‌లో చైనా రోబోను మనదిగా ప్రదర్శించడంపై రాహుల్‌గాంధీ విమర్శ
- సదస్సును పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించిన ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో చైనాకు చెందిన రోబోలను భారతీయ ఆవిష్కరణలుగా ప్రదర్శించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సును ఆయన 'పబ్లిసిటీ స్టంట్'గా అభివర్ణించారు. భారతీయ ప్రతిభను, డేటాను వినియోగించుకోవాల్సింది పోయి, చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తూ, భారతీయ డేటాను అమ్మకానికి పెట్టారని ఆయన మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఎఐ సదస్సులో గల్గోటియాస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. గల్గోటియాస్ యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఒక రోబోటిక్ కుక్కను ప్రదర్శించింది. దానికి 'ఓరియన్' అని పేరు పెట్టింది. అయితే, టెక్ నిపుణులు, విమర్శకులు అది భారతీయ ఆవిష్కరణ కాదని పసిగట్టారు. అది చైనాకు చెందిన 'యూనిట్రీ గో2' రోబో అని, దానిపై ఉన్న లేబుల్ మార్చి సొంత ఆవిష్కరణగా చెప్పుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. చైనా తయారు చేసిన రోబోను, ఇండియాలో తయారు చేసినట్లు చూపించడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. వివాదం ముదరడంతో అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం తరువాయి 12లో

## భూ సమాచారం లభించకుండానే లాగిన్లు డిలీట్



- అత్యంత రహస్యంగా ఉండాల్సిన లాగిన్ వివరాలు లేవు
- ప్రాథమిక విచారణలో గుర్తించిన ధరణి ఉన్నత స్థాయి కమిటీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- తక్షణమే ధరణిపోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా ధరణి పోర్టల్‌ను రూపొందించారని , భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండానే లాగిన్లను డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండాల్సిన లాగిన్ వివరాలు లేవని 'ధరణి ఉన్నత స్థాయి కమిటీ' తమ ప్రాథమిక విచారణ గుర్తించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదనే, తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సచివాలయంలో మంత్రి పొంగులేటి బుధవారం 'ధరణి ఉన్నతస్థాయి కమిటీ'తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి లోపాలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసానూ వసూలు చేస్తామన్నారు. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకుని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీ విచారణలో దిగ్భ్రాంతి కరమైన తరువాయి 2లో



## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

ప్రజాపక్షం/రామకృష్ణాపూర్

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం క్యాతనపల్లిలోని సుమన్ నివాసాన్ని వందలాది మంది పోలీసులు చుట్టుముట్టి, అత్యంత నాటకీయ పరిణామాల మధ్య ఆయనను అరెస్ట్ చేశారు. అనంతరం మంచిర్యాల మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా బాల్కసుమన్ సహా నలుగురికి కోర్టు పద్నాలుగు రోజుల రిమాండ్ విధించింది. అనంతరం వారిని జైలుకు తరలించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కనుసన్నల్లో జిల్లా యంత్రాంగం, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సుమన్ ధ్వజమెత్తారు. ఈ అప్రజాస్వామిక అరెస్టును నిరసిస్తూ బిఆర్‌ఎస్ పార్టీ గురువారం మంచిర్యాల జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా చోటుచేసుకున్న రాజకీయ హైడ్రామా అంతా ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు కనిపిస్తోంది. బిఆర్‌ఎస్, సిపిఐ కూటమికి 14 మంది కౌన్సిలర్ల స్పష్టమైన మెజారిటీ తరువాయి 2లో

## వివాహిత దారుణ హత్య

- విడాకులు ఇచ్చిందన్న కోపంతో మాజీ భార్యను హతమార్చిన మాజీ భర్త
- వనస్థలిపురంలో దారుణ ఘటన

ప్రజాపక్షం /రంగారెడ్డి



హైదరాబాద్ వనస్థలిపురంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. విడాకులు ఇచ్చిందన్న కోపంతో ఓ మహిళను ఆమె మాజీ భర్త హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా బిఎన్‌రెడ్డి నగర్ పరిధి గ్రీన్‌సిటీ కాలనీలో సునీత నివాసం ఉంటోంది. 2023లో మహేశ్ సునీతల వివాహం జరిగింది. మహేశ్ కెనడాలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే పెళ్లైన కొన్నాళ్లకే తరువాయి 2లో



## నేటి నుండి రంజాన్ ఉపవాసాలు

**మస్కట్:** పవిత్రమైన రంజామన్ మాసం రమదాన్ ఉపవాస దినాలు గురువారం (ఫిబ్రవరి 19) నుండి ప్రారంభమవుతాయని ఒమన్ దేశ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు పవిత్ర ఉపవాసాలు,ప్రార్థనలకు సిద్ధమయ్యారు. నెలవంక కనిపించిన మరునాటి నుండి రమదాన్ దినాలు ప్రారంభం అవుతాయి. ఐతే నెలవంక కనిపించకపోవడంతో మతాధికారులు తగిన ధృవీకరణలతో ఈ అధికారిక ప్రకటన చేసినట్లు గల్ఫ్‌న్యూస్ బుధవారం ప్రకటించింది. అదేవిధంగా జపాన్‌లోని హిలాల్ విజన్ కమిటీ కూడా నెలవంక కనిపించకపోవడంతో ఈనెల 19వ తేదీ నుండి రమదాన్ పవిత్ర దినాలు తరువాయి 12లో

### ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు...

## తుది నిర్ణయం ఆర్‌ఒదే

- హైకోర్టు స్పష్టీకరణ
- బిఆర్‌ఎస్ కౌన్సిలర్ యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో తుదినిర్ణయం ఆర్‌వోదేనని హైకోర్టు స్పష్టం చేసింది. బిఆర్‌ఎస్ కౌన్సిలర్ యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని రంగారెడ్డి కలెక్టర్, పోలీసులను హైకోర్టు ఆదేశించింది. యాదగిరి స్వచ్ఛందంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ముగించింది. రంగారెడ్డి జి ల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై విధించిన స్టేను హైకోర్టు ఎత్తివేసింది. చైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం ఆర్వోదేనని స్పష్టం చేసింది. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ తన తండ్రి కనిపించడం లేదని 19వ వార్డు నుంచి గెలుపొందిన యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నికపై విచారణ చేపట్టిన హైకోర్టు స్టే విధించింది. బుధవారం విచారణకు యాదగిరిని కోర్టులో హాజరుపరచాలని మంగళవారం హైకోర్టు తరువాయి 2లో

### దుస్తులను లాగడమూ

## అత్యాచార యత్నమే..

**అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు ఆగ్రహం..**

**న్యూఢిల్లీ :** మహిళ వక్షోజాలను తాకడం, ఆమె పైజామా విప్పడానికి ప్రయత్నించడం అత్యాచార యత్నం కిందకు రాదంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పును రద్దు చేయాలని సుప్రీంకోర్టు తాజాగా నిర్ణయించింది. అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. లైంగిక నేరాల కేసుల్లో తీర్పు ఇవ్వడానికి చట్టపరమైన తరువాయి 12లో

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

- యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టండి
- దేశంలోనే మోడల్‌గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు
- రూ.లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో బుధవారం మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటి పారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, తరువాయి 2లో

## బంగ్లాదేశ్ విదేశాంగమంత్రిగా ఖలీలుర్ రెహ్మాన్

### భారతమంత్రి జైశంకర్ అభినందన
### మంత్రివర్గానికి శాఖల కేటాయింపు



ఢాకా: బంగ్లాదేశ్‌లో ఏర్పడిన కొత్త మంత్రివర్గ సభ్యులకు ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ శాఖలను కేటాయించారు. ప్రభుత్వ గెజిట్‌లో ఈ శాఖల వివరాలను బుధవారం ప్రకటించారు. ప్రధానమంత్రి రెహ్మాన్ రక్షణ, సాయుధబలగాల విభాగాలను, మంత్రుల బాధ్యతల పర్యవేక్షణ విభాగాలను తనవద్దనే ఉంచుకున్నారు. విదేశీ వ్యవహారాలమంత్రిగా డాక్టర్ ఖలీలుర్ రెహ్మాన్, ఆర్థిక, ప్రణాళికా శాఖల మంత్రిగా అమిర్ ఖుస్రు మహ్మద్ చౌధరి, హోంశాఖామంత్రిగా సలాహుద్దీన్ అహ్మద్, గ్రామీణాభివృద్ధి,స్థానిక ప్రభుత్వాలు,సహకారశాఖల మంత్రిగా మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలంగీర్, విద్యుత్, ఇంధన వనరులమంత్రిగా ఇగ్బాల్ హసన్ మహ్మద్‌సహా ఇతర శాఖలను మంత్రులకు కేటాయించారు. మొత్తం 25 మంది క్యాబినెట్ మంత్రులు, మరో 24 మంది సహాయమంత్రులు వివిధ శాఖలకు బాధ్యతలు తీసుకున్నారు. కాగా బంగ్లాదేశ్ విదేశీమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఖలీలుర్ రెహ్మాన్‌కు భారత విదేశీవ్యవహారాలమంత్రి డా.జైశంకర్ అభినందనలు తెలియజేశారు. రెండు దేశాలమధ్యా సన్నిహిత సంబంధాలను, పరస్పర మైత్రి, అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్ళేందుకు, అభిప్రాయాల మార్పిడి ద్వారా స్నేహాభివృద్ధికి తామెంతో ఉత్సుకతతో ఉన్నామని సోషల్ మీడియా వేదికగా జైశంకర్ పోస్టింగ్ పెట్టారు. కాగా బంగ్లాదేశ్ విదేశీమంత్రి ఖలీలుర్ రెహ్మాన్ ఆర్థికవేత్త,గతంలో ఐక్యరాజ్యసమితిలో పనిచేశారు. 1979లో ఆయన సివిల్ సర్వీస్‌లో పనిచేశారు. విదేశీ వ్యవహారాలశాఖలో పనిచేశారు. మొన్నటివరకూ ఆయన దేశ తాత్కాలిక నేత మహ్మద్ యూనుస్‌కు దౌత్యవేత్తగా పనిచేశారు.

**ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చండి**

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) ఎంపిలకు ఆ పార్టీ ఛైర్మన్–దేశ ప్రధానమంత్రి తారిఖ్‌రెహ్మాన్ పిలుపు ఇచ్చారు. ప్రజా సంక్షేమం, జాతీయ అభివృద్ధే ప్రధాన లక్ష్యాలుగా పని చేయాలని వివిధ శాఖల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానమంత్రిగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత బుధవారం ఉదయం ఆయన తొలిమంత్రివర్గ సమావేశం నిర్వహించారు. మంత్రివర్గ సహచరులతో కలిసి తన తల్లిదండ్రుల సమాధులవద్దకు వెళ్ళి నివాళులు అర్పించారు. వారి స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా బంగ్లాదేశ్ కోసం త్యాగం చేసిన అమరవీరులకు కూడా ఆయన మంత్రివర్గ సభ్యులు నివాళులు అర్పించారు.

చట్టబద్ధపరిపాలనకు, క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని, ప్రజలకు జవాబుదారీ వహించాలని ఆయన ఎంపీలకు ఆదేశించారు పార్టీ కార్యాలయంలో ఎంపీలతో సమావేశం నిర్వహించ వారి కర్తవ్యాలను గుర్తుచేశారు.

# జపాన్ దిగువసభలో ప్రధానిగా తకైచీ

### బడ్జెట్ ఆమోదం, ధరల తగ్గింపే ప్రధాన లక్ష్యం




**టోక్యో:** జపాన్ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి) నాయకురాలు సనే తకైచీ పార్లమెంటు దిగువసభ డైట్‌లో బుధవారం తిరిగి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో గెలిచినప్పటికీ దిగువసభ సభ్యులు తిరిగి ఆమెను ప్రధానమంత్రిగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దిగువసభ డైట్‌లో ఆమెకు మొత్తం 354 ఓట్లు లభించాయి. ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పారీట ఎన్నికల్లో ఘన విజయం సాధించినందువల్ల ఇంతకుముందు ఉన్న మంత్రులందరూ తిరిగి ఆవే శాఖల్లో కొనసాగే అవకాశం ఉంది. 465 స్థానాలున్న దిగువసభకు ఫిబ్రవరి 8వ తేదీన జరిగిన ఎన్నికల్లో అమె నాయకత్వంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ మెజారిటీ కంటే అత్యధికంగా 316 స్థానాలు సంపాదించింది. 1955లో ఎల్‌డిపి ఆవిర్భవించినప్పటి నుండి పార్టీ సాధించిన అత్యుత్తమ ఫలితం ఇదే. అమె కూటమిలోని ఇన్నోవేషన్ పార్టీ ఈసారి 36 స్థానాలు గెలుచుకుంది. దీంతో అధికార ఎల్‌డిపి దిగువసభలో మొత్తం 17స్థాయీ సంఘం కమిటీలకు అధ్యక్ష బాధ్యతలను చేపట్టనున్నది. ఐతే ఈ విషయంలో రాజీపడిన అధికారపార్టీ ఒక స్పెషల్ కమిటీకి అధ్యక్ష బాధ్యతలను ప్రతిపక్షానికి ఇవ్వజూపింది. వాస్తవానికి బడ్జెట్ ప్రక్రియ దిగువసభ డైట్‌లో ఈనెలాఖరునాటికి పూర్తిచేసుకుని ఎగువసభకు వెళ్ళాల్సి ఉంది. దిగువసభలో అపారమైన మెజారిటీ ఉన్నప్పటికీ కూడా బడ్జెట్ విషయంలో ప్రతిపక్షాలతో ఈ దశలో వివాదాలకు, తగవులకు దిగకూడదని అధికార లిబరల్‌పార్టీ నిర్ణయించుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

జపాన్‌కు కొత్త బడ్జెట్ రూపొందించడం, ఇంటిలిజన్స్ ఏజన్సీని ఏర్పాటు చేయడం, ఆహార వస్తువులపై వినియోగ పన్నును రద్దుచేయడం ఇప్పుడు ఆమెకున్న ప్రధాన ప్రాధాన్య తాంశాలు. ప్రధానమంత్రిగా తిరిగి గెలిచిన తర్వాత డైట్ సమావేశంలో తకైచీ మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ధరలను తగ్గించడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తానని ఆమె సభకు భరోసా ఇచ్చారు. దిగువసభకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ బ్రహ్మాండమైన మెజారిటీ సంపాదించింది. తకైచీ దేశ ప్రధానమంత్రిగా తిరుగులేని అధికారాలు చెలాయించడానికి రంగం సిద్ధమైంది. 2026వ సంవత్సరానికిగాను 122.3 ట్రిలియన్ యువాన్లు (783 బిలియన్ డాలర్లు) బడ్జెట్‌ను ఆమోదించడం ఇప్పుడు ఆమె ముందున్న తక్షణ కర్తవ్యం. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన దేశంలో మెరుపు ఎన్నికలు నిర్వహించడంతో బడ్జెట్ ఆమోదంపై చర్చలకు జాప్యం జరిగింది. మార్చి నాటికి బడ్జెట్ ఆమోదం పొందాల్సి ఉంది.

**తకైచీ అమెరికా, చైనా పర్యటనలు**

ఎన్నికల్లో సూపర్ మెజారిటీ సంపాదించిన ప్రధానమంత్రి తకైచీ వచ్చేనెలలో అమెరికాలో పర్యటించనున్నారు. ఏప్రిల్ నెలలో చైనాను ఆమె సందర్శించేందుకు సిద్ధం అవుతున్నారు. గెలిచిన తర్వాత చైనాతో చర్చలకు ఆమె ప్రతిపాదించారు. ఐతే చైనీయులు మాత్రం ఆమెను విశ్వసనీయమైన నేతగా పరిగణించడంలేదు. కాగా అమెరికాకు ఆమె ఎన్నికల ముందు నుండి దగ్గరయ్యారు. గడచిన అక్టోబరులో 550 బిలియన్ డాలర్ల మేరకు అమెరికాలో ప్రాజెక్టులకు పెట్టుబడులు పెడతామని ఆమె వాగ్దానం చేశారు. ఒహియోలో సహజ వనరుల ప్లాంట్ కింద 36 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టేందుకు తకైచీ కట్టుబడి ఉన్నారు. అదేవిధంగా దేశంలో రక్షణరంగ బడ్జెట్‌ను కూడా గణనీయంగా పెంచేందుకు ఆమె సిద్ధపడుతున్నారు. ఈ విషయంలో ఆమె తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తైవాన్‌పై సైనిక చర్యకు పాల్పడితే తాము కూడా సైనికంగా చర్య తీసుకోవాల్సి వస్తుందని గత ఏడాదిలో కొత్తగా అధికారం చేపట్టాక తకైచీ వ్యాఖ్యానించడం చైనాతో పెద్ద వివాదానికి దారితీసింది. దీంతో రెండు దేశాలమధ్యా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జపాన్ భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని ప్రజలకు ఆమె వాగ్దానం చేశారు. వలసలు, విదేశీయుల విషయంలో ఆమె కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. సంప్రదాయబద్ధమైన కుటుంబ విలువలను ప్రోత్సహిస్తానని ప్రకటించారు.

## అవినీతి నేరంపై పెరూలో పదవి కోల్పోయిన మరో అధ్యక్షుడు



**లిమా:** పెరూ దేశాధ్యక్షుడు జోస్ జెరీని ఆ దేశ పార్లమెంటు 'కాంగ్రెస్' అధికార పదవి నుండి తొలగించింది. కొత్త అధ్యక్షుణ్ణి ఎవరిని నియమించాలనే విషయంపై కాంగ్రెస్ చర్చిస్తోంది. దీంతో అతి తక్కువ సమయంలో పదవీచ్యుతుడైన దేశ మూడవ అధ్యక్షుడుగా జోస్ జెరీ రికార్డులకెక్కారు. గత ఏడాది అక్టోబరులో దేశాధ్యక్షురాలు బోలువార్టే కూడా పదవీచ్యుతరాలయ్యారు. ఆ తర్వాత జోస్ జెరీ అధ్యక్ష బాధ్యతలు తీసుకుని నాలుగు నెలల్లోనే పదవీచ్యుతుడయ్యారు. 2016 నుండీ పెరూలో ఈ విధంగా ఇప్పటివరకూ ఏడుగురు దేశాధ్యక్షులు పదవులు పోగొట్టుకున్నారు. దీంతో పెరూ పరిపాలనలో అస్థిరత ఏర్పడింది.

జోస్ జెరీ తాత్కాలిక అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలలకే ఈ పరిణామం సంభవించింది. చైనా వ్యాపారవేత్తతో ఆయన రహస్య సంబంధాలు కొనసాగించిన విషయాన్ని దేశ పార్లమెంటుకు చెప్పకపోవడం అవినీతికి పాల్పడం వంటి నేరారోపణలపై ఆయనను పార్లమెంటు ప్రధానమంత్రి పదవి నుండి తొలగించింది. వ్యాపారవేత్త ఝిహుయా యాంగ్‌తో ఆయన అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు వీడియోలు వెలుగుచూశాయి. ఐతే తొలుత అధ్యక్షుడు జెరీ చైనా వ్యాపారవేత్తతో సమావేశం జరిగిన మాట నిజమేనని, దేశ ప్రయోజనాలకోసమే ఈ సమావేశం జరిగిందని, తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని బొంకి తప్పుడు వివరణలు ఇచ్చారు. పార్లమెంటుకు చెప్పకుండా చైనా వ్యాపారవేత్తతో సమావేశమైనందుకు ఆయన సభ్యులకు తొలుత క్షమాపణలు కూడా తెలియజేశారు. కానీ తాజాగా అవన్నీ బూటకమని తేలింది.



## జెనీవా చర్చలపై పెదవి విరిచిన ఉక్రేన్-రష్యా

**జెనీవా:** ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య రెండో రోజు బుధవారంనాటి చర్చలు ఎలాంటి పురోగతి లేకుండా ముగిశాయి. ఈ త్రైపాక్షిక చర్చలపై అమెరికా తరపు ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ ఉక్రేన్–రష్యా దేశాల ప్రతినిధులు మాత్రం "చర్చలు కష్టంగా ఉన్నాయి( డిఫికల్ట్)"అని పెదవి విరిచాయి. ఒకవైపు చర్చలు జరుగుతన్న సమయంలోనే మరోవైపు యుద్ధ దాడులు, పరస్పర విమర్శలు కొనసాగాయి. జెనీవా ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌లో ప్రారంభమైన మొదటిరోజు మంగళవారం చర్చలు ఆరుగంటలపాటు జరిగాయి. మంచి ఫలితాలు కనిపించాయని అటు అమెరికా,ఇటు రష్యాకు చెందిన ప్రతినిధులుప్రకటించారు. రెండోరోజు బుధవారం చర్చలు ఆలస్యంగా మొదలయ్యాయి. చివరకు రెండు గంటల వ్యవధిలోనే ముగిశాయి. ఈ చర్చల్లో ఎలాంటి ఫలితాలు రాలేదు. ద్వైపాక్షిక, త్రైపాక్షిక పద్ధతులలో రెండు రకాలుగా మధ్యవర్తుల ద్వారా ఈ చర్చలు జరిగాయి.

కాగా చర్చలు చాలా కఠినంగా ఉన్నప్పటికీ అవన్నీ వ్యాపారపరంగా ఉన్నాయని చర్చల్లో పాల్గొన్న రష్యా తరపు ప్రధాన అధికార ప్రతినిధి, అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు వ్లాదిమిర్ మిడిన్స్కీ పాత్రికేయులతో జెనీవాలో చెప్పినట్లు ప్రావ్దా వార్తాసంస్థ ప్రకటించింది. ఐతే మరోసారి చర్చలు జరరిగే అవకాశాలు ఉన్నాయని కూడా ఆయన చెపారు. ఎప్పుడు.. అనే విషయం మాత్రం ఆయన చెప్పలేదు. ఈ చర్చల సారాంశాన్ని నేరుగా అధ్యక్షుడు పుతిన్‌కు తక్షణం తెలియజేసినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చెప్పారు. పుతిన్–జెలెన్స్కీ మధ్య ముఖాముఖీ జరిగే విషయంపై చర్చించారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు. మొదటిరోజు చర్చల ఫలితాలపై స్పందించేందుకు మంగళవారం సాయంత్రం మిడిన్స్కీ తిరస్కరించారు. ఈ ఏడాది జనవరి 23,24 తేదీలలో అబుధాబిలో మొదటి రౌండ్ చర్చలు, ఫిబ్రవరి 4,5 తేదీలలో రెండో రౌండ్ చర్చలు జరిగాయి. రెండో దశ చర్చలు ఫిబ్రవరి 17,18 తేదీలలో జెనీవాలో ముగిశాయి. రష్యా బృందానికి జనరల్ స్టాఫ్, ఇంటిలిజన్స్ డైరెక్టరేట్ అధిపతి ఇగోర్ కోస్త్యుకోవ్ నాయకత్వం వహించారు.

ఈనెల 24వ తేదీ నాటికి అంటే మరో ఆరురోజులకు ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ సమయానికి ప్రపంచానికి ఈ చర్చల ద్వారా పాక్షికంగానైనా ఒక శుభవార్త వెలువడుతుందని అందరూ ఆశగా ఎదురుచూశారు. కానీ ఈ చర్చల ఫలితాలపై మధ్యవర్తిదేశం అమెరికా తప్ప ప్రధాన వైరి దేశాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 2014 ఫిబ్రవరిలో క్రిమియా ఆక్రమణతో యుద్ధం ప్రారంభమైంది. తర్వాత 2022 ఫిబ్రవరి 24న స్పెషల్ ఆపరేషన్ పేరుతో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది.

# నెట్ జీరో స్టేట్

(మొదటి పేజీ తరువాయి)

క్లైమేట్ ఎమర్జెన్సీగా పేర్కొన్నారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సిఎం స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఈవిల స్వీకరణ పెరిగిందన్నారు. తెలంగాణలోనే ఈవి తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకు పైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్‌టిసి బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ లకు పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని సిఎం స్పష్టం చేశారు.

**అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకం**

స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టి కోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన అంశాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించినట్లు వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా ప్రకటించగా, ఓఆర్‌ఆర్, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా +1 ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారని, రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8 శాతం లేదా దాదాపు 25 శాతం గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని సిఎం వివరించారు. అదేవిధంగా 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయన్నారు. ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# తుది నిర్ణయం ఆర్‌ఒదే

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులను ఆదేశించింది. ఈక్రమంలో బుధవారం కోర్టులో విచారణకు కౌన్సిలర్ యాదగిరి హాజరయ్యారు.

**అపహరణపై కోర్టులో పిటిషన్ :**

మంగళవారం హైకోర్టు స్టే ఉత్వర్వులు అందే సమయానికి మున్సిపల్ చైర్మన్‌గా బిఆర్‌ఎస్ అభ్యర్థి ఎన్నికైనా కూడా న్యాయస్థానం స్టే కారణంగా ఎన్నికల అధికారి అతనికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని ఆయన కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం, అనూహ్యంగా కౌన్సిలర్ యాదగిరి బిఆర్‌ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు హాజరవటం వంటి పరిణామాల మధ్య హైకోర్టు ఎన్నికపై స్టే విధించింది. అంతకు ముందు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొంది. కౌన్సిల్ హాలులో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు పరస్పర దాడులు చేసుకున్నారు. రహస్య ఓటింగ్ చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేయగా నిబంధనల ప్రకారమే ఓటింగ్ నిర్వహించాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఎన్నికకు ఎక్స్ అఫీషియో సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి గైర్హాజరయ్యారు.

**బలవంతంగా బాపట్లకు :**

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బుధవాం బిఆర్‌ఎస్ కౌన్సిలర్ యాదగిరిని ఇబ్రహీంపట్నం ఉదయం పోలీసులు హైకోర్టులో హాజరుపర్చారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కుమారుడు బలవంతంగా బాపట్ల జిల్లా చీరాల తీసుకెళ్లినట్లు యాదగిరి కోర్టుకు తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీ బిసి అభ్యర్థిగా మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్నాననే బౌన్సర్లను పెట్టి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ఈనెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు కారులోనే తిప్పారని వాపోయారు. తనకు బిపి, షుగర్ ఉన్నా భోజనం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసిన కౌన్సిలర్ యాదగిరి తాను లేకపోతే కోరమ్ ఉండదని భావించే ఈ పని చేశారన్నారు. తాను కనిపించకపోవడంతో తన కుమారుడు పిటిషన్ వేశారని కోర్టులో తెలిపారు.

**తుది నిర్ణయం ఆర్‌వోదే :**

తన మొబైల్ ఫోన్ కూడా మాజీ ఎమ్మెల్యే కుమారుడు ప్రశాంత్‌రెడ్డి దగ్గరే ఉందని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని భద్రత కల్పించాలని కోరారు. అనారోగ్యం ఉన్నందున రెండు రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటానని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ ఎన్నిక విషయంలోనే యాదగిరి మాట మారుస్తున్నారని మాజీఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. బిఆర్‌ఎస్ చైర్మన్ అభ్యర్థికి ఇప్పటికే 15మంది అభ్యర్థుల మద్దతు ఉందని, చట్ట ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సకాలంలో జరగాలన్న మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఇబ్రహీంపట్నం మున్సిపల్‌చైర్మన్ ఎన్నిక నిర్ణయం ఆర్‌వోదేనని స్పష్టం చేసింది.

# లాగిన్లు డిలీట్

(మొదటి పేజీ తరువాయి)

అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించాల్సిన వ్యవస్థను గత ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపించారు. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్టుగా నివేదిక ఇచ్చారని మంత్రి పొంగులేటి వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లేకుండా చేశారని, ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లనే సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావు లేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్నేహపూర్వకమైన భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ , సిఎంఆర్‌ఓ మందా మకరంద్, స్టాంప్స్,రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్,రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బిఎస్‌పి సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్‌పి ఎ.సంపత్, హోంశాఖ సలహాదారు పి.శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా, కేవలం 8 మంది సభ్యులున్న కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠం కోసం హడావిడికి తెరలేపింది. మంత్రి వివేక్ వెంకటస్వామి తన అనుచరులు, రౌడీ మూకలతో గొడవలు సృష్టించి, పోలీసులను పావులుగా వాడుకుంటున్నారని సుమన్ ఆరోపించారు. ప్రమాణ స్వీకారం వేళ కాంగ్రెస్ శ్రేణులు రాళ్ల దాడులకు పాల్పడితే, వారిని వదిలేసి బాధితులైన బిఆర్‌ఎస్ నాయకులపైనే కేసులు పెట్టడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

సుమన్ అరెస్ట్ **అప్రజాస్వామికం..**
**సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్**

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, పోలీసులు మంత్రి ఆదేశాల మేరకు లాఠీ ఛార్జి చేయడం దుర్మార్గమన్నారు. 21వ వార్డు సభ్యురాలు బబ్బెర స్వర్ణలత అత్తను కిడ్నాప్ చేశారనే తప్పుడు ఆరోపణలతో కూటమి కౌన్సిలర్లను ప్రమాణ స్వీకారానికి వెళ్లకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా గొడవలు ప్రేరేపించారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఎంఆర్‌ఓ, పోలీసులు నిబంధనలు తుంగలో తొక్కి అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని, న్యాయం అడిగితే అరెస్టులతో గొంతు నొక్కుతారా అని సుమన్ నిప్పులు చెరిగారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందని, ప్రజా తీర్పును గౌరవించని కాంగ్రెస్‌ను ప్రజల మధ్య దోషులుగా నిరూపిస్తాం అని తెలిపారు.

# అత్యధిక ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

సినిమాటోగ్రఫీ శాఖల ప్రీబడ్జెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ పాల్గొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబంలా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, భోదనా సిబ్బందికి బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని, వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు.

**నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు**

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆన్‌ఆలైన్‌లో పాఠాలు బోధిస్తారని, ఇది దేశంలోనే ఒక మోడల్‌గా మారనుందని డిప్యూటీ సిఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్‌సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ భవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, హాస్టల్లో మోడల్ కిచెన్ల ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని ఈ ప్రక్రియను దశలవారీగా ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

**హాస్టల్ బిల్డింగ్‌ల మరమ్మతు బిల్లులు వెంటనే క్లియర్ చేస్తాం**

హాస్టల్ బిల్డింగ్‌ల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్‌ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీతో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ చార్జీల లేకుండా చేసుకోవడమే కాకుండా సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని ఆయన తెలిపారు. జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని, వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించామని, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు వివిధ జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్దెలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు.

**పంట మార్పిడి అవకాశాలను పరిశీలించాలి**

వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్‌ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యతులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి డిప్యూటీ సిఎం సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోర్ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు.

రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశంలో సంతకం చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంలో సంవత్సరం పొడుగునా కల్చరల్ యాక్టివిటీ కొనసాగేలా సినిమాటోగ్రఫీ శాఖలో ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో సునీత మహేశ్‌ను కాదని వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మహేశ్ పక్కా ప్రణాళికతో ఆమెను హత్య చేసేందుకు సిద్ధమయ్యాడు. అందులో భాగంగానే మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సునీత రెండో భర్త ఇంట్లోకి బ్యాక్ ప్యాక్‌లో పెట్రోల్ డబ్బా, మరో లగేజ్ బ్యాగ్‌లో సా మెషిన్, వుడ్ కటింగ్ మిషన్, రెండు కత్తులను మహేశ్ తీసుకువచ్చాడు. గదిలోకి ఎవరైనా వస్తే పెట్రోల్ పోసి నిప్పంటిస్తానంటూ హెచ్చరించాడు. కత్తులతో సునీత తలపై దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన సమయంలో సునీత అత్త, మరిది ఇంట్లోనే ఉన్నారు. అయినా సునీత గదిలోకి వెళ్లి గొళ్లెం పెట్టి నిందితుడు హత్య చేశాడు. తర్వాత అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నిందితుడు మహేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనా స్థలాన్ని ఎల్బీ నగర్ జోన్ డీసీపీ అనురాధ సందర్శించారు. దర్యాప్తు గురించి ఆరాతీశారు. మరోవైపు నిందితుడు ఇలా పట్టపగలే ఇంట్లోకి వచ్చి హత్య చేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. మహేశ్ మెంటాలిటీ సరిగా లేనందువల్లే సునీత విడాకులు తీసుకుందని, అతనికి దూరంగా ఉన్నా ఇలా చేస్తాడని ఊహించలేకపోయామని మృతురాలి బంధువులు వాపోయారు. నిందితుడిని తమకు అప్పగించాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామని పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ కోసం తరలించిన పోలీసులు నిందితుడిని ప్రశ్నించే పనిలో ఉన్నారు. విచారణలో పూర్తి వివరాలు వెలుగు చూసే అవకాశముంది

## పురపాలక ఫలితాలు

# బిసిల చైతన్యానికి నిదర్శనం

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలలో బిసిలకు కేటాయించినా రిజర్వేషన్‌తో పాటు జనరల్ స్థానాలలో కూడా బిసిలు పెద్ద ఎత్తున గెలవడం బిసి వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనమని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. రాష్ట్రంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బిసిలు మొత్తంగా 61శాతానికి పైగా గెలవడం పట్ల బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తోపాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు హర్షం వ్యక్తం చేశారు. ఈ మధ్య జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బిసి అభ్యర్థులు 52.75 శాతం గెలిచిన విషయం విదితమే అని, రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి, జిహెచ్‌ఎంసి, కార్పొరేషన్ల ఎన్నికల్లో కూడా బిసిలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బిసిల సంఖ్య 56.33 శాతం అని తేలగా, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటం, కొందరు కోర్టుల వరకు వెళ్లి ఈ రిజర్వేషన్ అమలుకాకుండా చేయడం సముచితం కాదన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో, ఇప్పుడు జరిగిన పురపాలక ఎన్నికల్లో బిసిలు గెలిచిన స్థానాలను దృష్టిలో పెట్టుకొని, కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతించడంతో పాటు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అదేవిధంగా కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహరించి చట్టబద్ధంగా బిసిల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బిసి కమిషన్ కోరుకుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఎస్‌సి, ఎస్‌టి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ డైరీని ఉప ముఖ్యమంత్రి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి రాజేశ్వర్, అసోసియేషన్ ఫౌండర్ సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్, వర్కింగ్ సెక్రెటరీ సిఎం రాజు, జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్ హక్కుల వల్ల ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రయోజనం చేకూరుతోందని, ఆయా వర్గాల హక్కులను కాపాడడం కోసం భవిష్యత్‌లో సంఘాలకు, ఉద్యోగస్తులకు ఎక్కడ ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు వచ్చినా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చిత్తశుద్ధిగా కృషి చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని డిప్యూటీ సిఎం చెప్పారు. ఉద్యోగులు, సంఘాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు తమ అభిప్రాయాలను రుద్దలేదని, ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకుని ప్రజాస్వామ్యయుతంగా వాటి పరిష్కారం కోసం పనిచేస్తున్నామన్నారు.



# ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యం

### వేసవి నాటికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి

### రాష్ట్రనీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు) :** ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మేళ్ళచెరువు మైహోమ్ గెస్ట్‌హౌస్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కృష్ణా నదిపై నిర్మాణం చేస్తున్న పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. రాజీవ్ గాంధీ లిఫ్టు ఇరిగేషన్, దొండపాడు, రెడ్లకుంట, నక్కగూడెం, ముత్యాల బ్రాంచ్, జాన్‌పహాడ్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులన్ని వచ్చే వేసవి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే 24 గంటల పాటు పనులు చేయాలన్నారు. ప్రాజెక్టుకు, సైడ్ కాల్వలకు కావల్సిన భూసేకరణ వేగవంతం చేయాలని చెప్పారు. ప్రాజెక్టులపై ఎక్కడైతే విద్యుత్ సబ్‌స్టేషన్‌లు కట్టాలో అక్కడ వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి ఫేజ్2 కింద ఉన్న ఆయకట్టు ఎస్‌ఎస్‌పి కింద ఉన్న పొలాలకు వారాబంధి ప్రకారం నీటి సరఫరా చేయాలన్నారు. ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే నాగార్జునసాగర్ ఈ వర్షాకాలం మూడుసార్లు నిండిందని దీంతో రాష్ట్రంలో అత్యధికంగా వరిసాగు జరిగి దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహ, ఇరిగేషన్ శాఖ అధికారులు, హుజూర్‌నగర్ ఆర్‌డిఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ (ఎల్1) కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (ఎల్2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ + 5, 10వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు. పెండింగ్‌లో ఉన్న 2 బిహెచ్‌కె ఇల్లు పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2 బిహెచ్‌కె లబ్ధిదారులకు అందించామని, ఇంకా పెండింగ్ పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్‌డిఒలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
భూసేకరణ అధికారి మరియు సబ్ కలెక్టర్,
కల్లూరు వారి ప్రాథమిక ప్రకటన
ఫారం - 6
భూ సేకరణ పునరుపాది కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం) - 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) మరియు సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ (19) అనుసరించి

జిల్లా గెజిట్ నెం. A3/21/2026 తేది: 16.02.2026
కలెక్టర్ ఫైల్ నెం. జి1/75654/2024 తేది: 16.02.2026
ఉప కలెక్టర్ /యల్ ఏ ఓ కల్లూరు
ఫైల్ నెంబర్. ఎ/1436/2025 తేది: 11.02.2026

తెలంగాణా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలములోని గోకవరం గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.13.21 3/4 గుం. నిమిత్తం అనగా SRLIP (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

RFCTLA & R&R (తెలంగాణ సవరణ), 2016 (చట్టం నెం 21 2017) లో III.A లోని సెక్షన్ 10A(b) ద్వారా అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, తెలంగాణ ప్రభుత్వం G.O.Ms.No.38 నీటిపారుదల & CAD (LA.R&R/A2), తేది : 30.06.2017, భూసేకరణ, పునరావాసం మరియు పునరుపాది చట్టం, 2013 లో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు యొక్క అధ్యాయం II మరియు III యొక్క నిబంధనల ధరఖాస్తు నుండి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మినహాయింపు ఇవ్వబడింది.

కావున ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలములోని గోకవరం గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ. 13.21 3/4 గుం. గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూలు
గ్రామం : గోకవరం మండలం : కల్లూరు జిల్లా :ఖమ్మం

| క్ర.సం. | సర్వే నెంబరు SDR | సేకరించవలసిన విస్తీర్ణము ఎ.గుం. | భూమి స్వభావం | భూమి రకం | అనుభవదారు / పట్టేదారు యొక్క పేరు మరియు చిరునామా | హద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 64/2 | 00-05 1/2 | ప్ర.భూ. | మెట్ట | శీలం నాగిరెడ్డి S/o జగన్నా రెడ్డి | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | పామ్ చెట్లు - 4, బోరు - 1 |
| 2 | 64/2 | 00-05 1/2 | ప్ర.భూ. | మెట్ట | రోడ్ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 3 | 64/2 | 01-07 | ప్ర.భూ. | మెట్ట | మేడ హేమ సంధ్య W/o సీతారాములు | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | కొబ్బరి చెట్లు - 70, ఫెన్సింగ్ రాళ్లు -35, గ్రౌండ్ లెవల్ పైపులు - 50, షెడ్ (సిమెంట్ రేకులు 30) |
| 4 | 64/2 | 01-00 | ప్ర.భూ. | మెట్ట | లక్కినేని జగదీష్ చంద్రరావు S/O నరసయ్య & లక్కినేని కరుణ్ చంద్ S/oనరసయ్య | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | బోరు - 1, గ్రౌండ్ లెవల్ పైపులు -40, తాటి చెట్లు - 2, వేప చెట్లు - 2, ఫినిషింగ్ రాళ్లు - 25 |
| 5 | 64/2 | 00-27 1/2 | ప్ర.భూ. | మెట్ట | గుగులోత్ సైదా S/o చిట్టి | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | వేప చెట్లు - 1 |
| 6 | 64/2 | 00-04 | ప్ర.భూ. | మెట్ట | గుగులోత్ శ్రీను S/o చిట్టి | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 7 | 64/2 | 00-32 1/2 | ప్ర.భూ. | మెట్ట | దోసపాటి భాస్కర్ రావు S/o పురుషోత్తం | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 8 | 64/2 | | ప్ర.భూ. | మెట్ట | దోసపాటి కృష్ణార్జున రావు S/o పురుషోత్తం | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 9 | 64/2 | 00-00 1/2 | ప్ర.భూ. | మెట్ట | లకావత్ కృష్ణ S/o రాములు | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 10 | 64/2 | 00-17 | ప్ర.భూ. | మెట్ట | లకావత్ రవీందర్ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | విద్యుత్ టవర్ |
| 11 | 64/2 | 00-02 1/2 | ప్ర.భూ. | మెట్ట | కలసాని ఉపేందర్ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 12 | 64/2 | | ప్ర.భూ. | మెట్ట | కలసాని హర్షవర్ధన్ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | దైటమ్మ చెట్టు - 1, టేకు చెట్టు - 1, బోరు - 1 |
| | | 4-22 | | | | | | | | |
| 13 | 64/3 | 00-23 | ప్ర.భూ. | మెట్ట | మోరిసెట్టి అనిత W/o హరి ప్రసాద్ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | మామిడి చెట్లు - 15 |
| 14 | 64/3 | 00-02 | ప్ర.భూ. | మెట్ట | కలంగి కోటేశ్వరరావు S/o రంగయ్య | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 15 | 64/3 | 00-11 | ప్ర.భూ. | మెట్ట | కొర్ర బాలాజీ S/o రావుజ | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | మామిడి చెట్లు - 7, చింత చెట్లు - 2 |
| 16 | 64/3 | 00-10 1/2 | ప్ర.భూ. | మెట్ట | కొర్ర సీతారాం | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| 17 | 64/3 | 00-01 1/2 | ప్ర.భూ. | మెట్ట | డొంక | 65/1 | కల్లూరు గ్రామ సరిహద్దు | 64/1 | 64/1 | |
| | | 1-08 | | | | | | | | |
| 18 | 65/2 | 00-32 | పట్టా | మెట్ట | కలసాని ఉపేందర్ | 64/1 | | 64/1 | 64/1 | |
| 19 | 65/2 | 1/4 | పట్టా | మెట్ట | కలసాని హర్షవర్ధన్ | 64/1 | | 64/1 | 64/1 | |
| | | 00-32 1/4 | | | | | | | | |
| 20 | 69/2 | 00-16 1/4 | పట్టా | మెట్ట | చరుగొండ్ల అచ్యుతరావు | 71/1 | 68 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 70 | పామ్ చెట్లు - 1, మామిడి -17, వేప -1, చింత - 1, టేకు-5 |
| | | 00-16 1/4 | | | | | | | | |
| 21 | 71/2 | 00-01 | పట్టా | మెట్ట | డొంక | 75 | 69/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 73/1 | |
| 22 | 71/2 | 01-09 | పట్టా | మెట్ట | చరుగొండ్ల అచ్యుతరావు | 75 | 69/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 73/1 | పామ్ చెట్లు - 1, మామిడి -17, వేప-1, చింత - 1, టేకు- 5 |
| 23 | 71/2 | 00-29 | పట్టా | మెట్ట | చరుగొండ్ల అచ్యుతరావు | 75 | 69/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 73/1 | పామ్ చెట్లు - 1, మామిడి -17, వేప -1, చింత - 1, టేకు-5 |
| 24 | 71/2 | 00-01 1/2 | పట్టా | మెట్ట | డొంక | 75 | 69/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 73/1 | |
| 25 | 71/2 | 00-22 1/2 | పట్టా | మెట్ట | ఓలేటి చైతన్య సాయి ఆశ్రిత్ | 75 | 69/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 73/1 | పామ్ చెట్లు - 1, మామిడి - 14 రావి చెట్లు-1 ఫెన్సింగ్ రాళ్ళు - 26 |
| | | 2-07 1/2 | | | | | | | | |
| 26 | 73/2 | 00-02 1/2 | పట్టా | మెట్ట | కమండ్రు వెంకటరమణ రాజు | 78 | 72 | 71/1 | 83/1 | మామిడి -20, టేకు- 8, వేప - 8, ఫెన్సింగ్ రాళ్లు - 18 |
| 27 | 73/2 | 00-01 | పట్టా | మెట్ట | లిఫ్ట్ కెనాల్ | 78 | 72 | 71/1 | 83/1 | |
| 28 | 73/2 | 00-26 1/2 | పట్టా | మెట్ట | వేమిరెడ్డి కమలాకర్ రెడ్డి | 78 | 72 | 71/1 | 83/1 | మామిడి - 8, టేకు -4, ఫెన్సింగ్ రాళ్లు -20 |
| | | 0.30 | | | | | | | | |
| 29 | 75/2 | 00-22 1/2 | పట్టా | మెట్ట | ఓలేటి చైతన్య సాయి ఆశ్రిత్ | 76/1 | 71/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| 30 | 75/2 | 00-07 | పట్టా | మెట్ట | పాల సత్యనారాయణ రెడ్డి | 76/1 | 71/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| 31 | 75/2 | 1/2 | పట్టా | మెట్ట | చల్లా సునీత | 76/1 | 71/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| | | 0.30 | | | | | | | | |
| 32 | 76/2 | 00-15 | పట్టా | మెట్ట | పాల సత్యనారాయణ రెడ్డి | 87/1 | 75/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| 33 | 76/2 | 1/2 | పట్టా | మెట్ట | చల్లా సునీత | 87/1 | 75/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| 34 | 76/2 | 00-19 1/2 | పట్టా | మెట్ట | కొప్పుల నాగిరెడ్డి | 87/1 | 75/1 | బతులపల్లి గ్రామ సరిహద్దు | 74 | |
| | | 00-34 1/2 | | | | | | | | |
| 35 | 83/2 | 00-01 | పట్టా | మెట్ట | ఆళ్ళ రాంబాబు S/o వెంకయ్య | 82 | 57 | 71/1 | 84 | మామిడి చెట్లు - 4 |
| 36 | 83/2 | 00-08 | పట్టా | మెట్ట | ఆళ్ళ సతీష్ S/o వెంకయ్య | 82 | 57 | 71/1 | 84 | మామిడి చెట్లు - 12, ఫెన్సింగ్ రాళ్లు - 7 |
| 37 | 83/2 | 00-09 1/4 | పట్టా | మెట్ట | కమండు వెంకట రమణ రాజు | 82 | 57 | 71/1 | 84 | |
| | | 00-18 1/4 | | | | | | | | |
| 38 | 87/2 | 00-25 1/4 | ప్ర.భూ. | మెట్ట | కొప్పుల నాగిరెడ్డి | తల్లాపెంట గ్రామ సరిహద్దు | 77 & 76 | 87/3 | 87/1 | ఆయిల్ పామ్ చెట్లు - 69, ఫెన్సింగ్ రాళ్లు - 20, బోర్లు - 2, పైప్ లైన్లు (400 మీటర్లు) - 40 |
| 39 | 87/2 | 00-29 | ప్ర.భూ. | మెట్ట | పాల సత్య నారాయణ రెడ్డి | తల్లాపెంట గ్రామ సరిహద్దు | 77 & 76 | 87/3 | 87/1 | |
| 40 | 87/2 | 3/4 | ప్ర.భూ. | మెట్ట | చల్లా సునీత | తల్లాపెంట గ్రామ సరిహద్దు | 77 & 76 | 87/3 | 87/1 | |
| 41 | 87/2 | 00-07 | ప్ర.భూ. | మెట్ట | ఓబిరెడ్డి రవీందర్ రెడ్డి | తల్లాపెంట గ్రామ సరిహద్దు | 77 & 76 | 87/3 | 87/1 | యూకలిప్టస్ చెట్లు -300, ఫెన్సింగ్ రాళ్లు- 50 |
| 42 | 87/2 | 00-01 | ప్ర.భూ. | మెట్ట | కోడుమూరు మధు S/o వెంకటేశ్వర రావు | తల్లాపెంట గ్రామ సరిహద్దు | 77 & 76 | 87/3 | 87/1 | మామిడి - 8, టేకు -12, గ్రౌండ్ లెవల్ పైపులు - 40 |
| | | 1-23 | | | | | | | | |
| మొత్తం: 13.21 3/4 | | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూ సేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 చట్టం నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013), సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, ఖమ్మం మరియు భూసేకరణ అధికారి మరియు ఉపకలెక్టర్, కల్లూరు వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, ఖమ్మం వారు, భూసేకరణ అధికారి మరియు ఉప కలెక్టరు, కల్లూరు వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ -12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, ఖమ్మం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు / తాకట్లకు మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ - (15) ప్రకారం, జిల్లా కలెక్టర్, ఖమ్మం/ భూసేకరణ అధికారి మరియు ఉప కలెక్టర్, కల్లూరు గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవాల్సి యున్నది.

సం/- సబ్ కలెక్టర్ కల్లూరు
సం/- అదనపు కలెక్టరు ఖమ్మం జిల్లా
సం/- కలెక్టరు ఖమ్మం జిల్లా
DIPR RO NO. 1198/LA/PP/Advt/Pub/2025-26

# వ్యవసాయం, రైతు సంక్షేమం చాలా ముఖ్యం



### తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎమ్. కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయం, రైతు సంక్షేమం చాలా ముఖ్యమైనవని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి అన్నారు. భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం భూమివున్న అందరికీ ఉపయోగపడుతుందని తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో బుధవారం 'భూహక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ అంశం'పై ఒక్క రోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ రైతాంగానికి అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని అధిగమించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047 దిశగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. భూ హక్కులు, రికార్డుల ప్రక్షాళనలో భాగంగా భూ భారతి పథకం ద్వారా రైతుల భూములను గుర్తించి వారికి సమాన హక్కులు, పత్రాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భూ ఆధారిత అంశాలన్నీ ప్రజల్లోకి అవగాహన కల్పించడానికి ఇదొక చిరు ప్రయత్నమన్నారు. ఈ శిక్షణా తరగతులలో భూ చట్టాలు, భూ సమస్యల పరిష్కారం అనే అంశంపై రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్ అవగాహన కలిగించి సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయం అనుబంధ రంగాలలో ప్రభుత్వ స్కీమ్‌లు, బ్యాంకు రుణాలు అనే అంశంపై నాబార్డు మాజీ సిజిఎమ్.మోహనయ్య వివరించారు. పర్యావరణ భద్రత, చెరువులను కాపాడుకోవడం అనే అంశంపై పర్యావరణ శాస్త్రవేత్త బి.వి. సుబ్బారావు బోధించారు. జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా చట్టాలు అనే అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అవగాహన కలిగించారు. డిజిటల్ రిపోర్టింగ్, వ్యవసాయం, రైతు సమస్యలు అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ కలమండ శరత్ ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలు, రెవెన్యూ అంశాలపై సీనియర్ జర్నలిస్ట్ రాందాస్ ప్రవీణ్ జర్నలిస్టులకు అవగాహన కల్పించడంతోపాటు రిపోర్టింగ్‌లో పర్యావరణ, సాంకేతిక అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. శిక్షణలో పాల్గొన్న జర్నలిస్టులందరికీ తెలంగాణ మీడియా అకాడమీ తరుపున సర్టిఫికెట్లను, పుస్తకాలను అందించడం జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు సమన్వయకర్తగా కరుణాకర్ దేశాయి వ్యవహరించారు. ఈ వర్క్‌షాప్‌లో బోధించిన అంశాలు తమకు అవగాహన పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడ్డాయని పాల్గొన్న విలేకరులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి

# రూ.20వేల కోట్లు కేటాయించాల్సిందే



### పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు బిసి జెఎసి చైర్మన్ జాజుల వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చే ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బిసిల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించడంతో పాటు చట్టబద్ధమైన బిసి సబ్ ప్లాన్ తీసుకురావాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. హైదరాబాద్‌లో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌తో బుధవారం జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బిసి జెఎసి నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిసి బడ్జెట్‌పై మహేష్ కుమార్ గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో తాము అధికారంలోకి రాగానే ప్రతి ఆర్థిక సంవత్సరానికి బిసిల బడ్జెట్‌ను రూ.20వేల కోట్లు పెంచుతామని, మహాత్మ జ్యోతిబా పూలే పేరుతో చట్టబద్ధమైన బిసి సబ్‌ప్లాన్ తీసుకొస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బిసి కులవృత్తుల ఉపాధి కోసం బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించిందని, కానీ అధికారంలోకి వచ్చి రెండు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన హామీని అమలు చేయడం లేదని ఆయన మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.

అంతేకాకుండా 2024–25 బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ.9,200కోట్లు, 2025–26 బడ్జెట్‌లో రూ.11,405కోట్లు కేటాయించారని, ఇందులో కేవలం ప్రతి ఆర్థిక సంవత్సరం మూడు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, 60 శాతం జనాభా ఉన్న బిసిలకు మూడు శాతం కేటాయించి, కేటాయించిన నిధులలో కూడా ఒక్క శాతం బిసిల అభివృద్ధికి ఖర్చు చేస్తే బిసిలు ఎలా అభివృద్ధి చెందుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, గొడుగు మహేష్ యాదవ్, ఎం.బాగయ్య, బి.మణి మంజరి, దీటి మల్లయ్య, కాటేపల్లి వీరస్వామి, తారకేశ్వరి, ఉదయ నేత, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# 'కోవర్టు'ల భరతం పడతాం

### 2033 వరకు రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ రాజ్యమే

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సొంత పార్టీలోనే ఉంటూ గొంతు కోసే 'కోవర్టు'ల ఆట కట్టిస్తామని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలోని చేర్యాల, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో పార్టీ ఓటమికి అక్కడ నాయకులకు, కార్యకర్తలకు మధ్య సమన్వయ లోపం లేకపోవడమే అని, కొందరు నాయకులు కోవర్టులుగా మారి పార్టీకి తీరని నష్టం చేశారని ఆయన ఆరోపించారు. ఈ ఓటమిపై పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో కలిసి త్వరలోనే క్షేత్రస్థాయిలో 'పోస్ట్ మార్టం' నిర్వహిస్తామని, నివేదిక ఆధారంగా పార్టీకి నష్టం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తూ, ఆయన తనను తాను కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి గొప్ప కవులతో పోల్చుకుంటున్నారని, కానీ ప్రజల కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కృష్ణశాస్త్రి తన వ్యక్తిగత బాధనే లోకపు బాధగా భావించినట్లు, కెసిఆర్ కూడా తన ఇష్టాఇష్టాలనే ప్రజల ఆకాంక్షలుగా భ్రమిస్తున్నారని, అందుకే ప్రజలు ఆయనను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని చురకలంటించారు. 2023 ఎన్నికల నుండి ఇప్పటివరకు కెసిఆర్ వరుసగా ఆరుసార్లు ఘోర పరాజయాన్ని చవిచూశారని, ఆయన లక్కీ నంబర్ '6' ఇప్పుడు ఓటముల సంఖ్యగా మారిందని చమత్కరించారు. తెలంగాణలో ప్రజలు ఏ నాయకుడికైనా పదేళ్లపాటు అవకాశం ఇస్తారని, ఆ క్రమంలో 2023 నుండి 2033 వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తంచేశారు. ఇక బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విసిరే 'బస్తీ మే సవాల్' కేవలం సోషల్ మీడియా, ట్విట్టర్ కే పరిమితమని, వారి విష ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు కాబట్టే కార్పొరేషన్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఖాతా కూడా తెరవలేకపోయిందని కిరణ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# ప్రజల అవసరాలు తీర్చడంలో రాజుగా, మంత్రిగా విఫలం

### సిఎంపై బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద ధ్వజం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తనే రాజు, తనే మంత్రి అని చెప్పుకుంటున్న సిఎం రేవంత్ రెడ్డి, ప్రజల అవసరాలు తీర్చడంలో రాజుగా, ఒక మంత్రిగా వైఫల్యం చెందారని బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద ఆరోపించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఒక్క పని కూడా చేయలేదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంగు ఆర్భాటాలు తప్ప హైదరాబాద్ నగరానికి చేసింది ఏమీ లేదన్నారు. రెండవ దశ మెట్రో విస్తరణలో ఒక్క అడుగు ముందుకు పడలేదని, మూసీ సుందరీకరణ పేరుతో హడావుడి చేసి, ప్రస్తుతం ఏమీ మాట్లాడడం లేదని చెప్పారు. హైదరాబాద్ నగరంపైన అవగాహన ఉన్న వ్యక్తి మంత్రివర్గంలో లేరని ఎద్దేవా చేశారు. పార్కులకు ఫెన్సింగ్ వేసి అదే గొప్ప పనిగా హైడ్రా ప్రచారం చేసుకుంటుందని, హైడ్రా అంటే ఒక డ్రామాగా మారిందని అన్నారు. జిహెచ్‌ఎంసిని విస్తరించిన అశాస్త్రీయ పద్ధతిలో మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. క్యాతనపల్లిలో తమకు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా అని వివేకానంద ప్రశ్నించారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్: మహబూబ్‌నగర్
ఇ-టెండర్ & షార్ట్ టెండర్ నోటీసు నెం. 03/2025-26
మహబూబ్‌నగర్‌లోని ఆపరేషన్ సర్కిల్‌లో వివిధ విద్యుత్ పనులు మరియు సామగ్రి సరఫరా కోసం అర్హతగల కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది. సర్కిల్ కార్యాలయం ఫోన్ నంబర్: 8712472127. షార్ట్ టెండర్ల జారీకి చివరి తేదీ: 26.02.2026 నుండి 4:00 గంటల వరకు, సమర్పణ చివరి తేదీ: 27.02.2026 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు, ఇ-టెండర్ వివరాలు: - SE/Op/Mahabubnagar సర్కిల్ యొక్క T-12/25-26 నుండి T-18/25-26 వరకు స్పెసిఫికేషన్ నంబర్ కోసం ఈ క్రింది విధంగా ఉన్నాయి:- బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 20.02.2026 మధ్యాహ్నం 2:00 గంటల నుండి. ఆన్‌లైన్‌లో బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం: 11.03.2026 నుండి 2:00 గంటల వరకు. బిడ్ సమర్పణ చివరి తేదీ & సమయం: 11.03.2026 నుండి 2:30 గంటల వరకు. DDలు/BGలతో పాటు హార్డ్ కాపీలకు చివరి తేదీ & సమయం: 12.03.2026 మధ్యాహ్నం 2:00 గంటలకు. సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ & సమయం : 12.03.2026 మధ్యాహ్నం 3:00 గంటలకు. ధర బిడ్ ప్రారంభ తేదీ & సమయం : 12.03.2026 మధ్యాహ్నం 3:00 గంటలకు. గమనిక: మరిన్ని ఇ-టెండర్ పనుల వివరాల కోసం దయచేసి www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org ని సందర్శించండి మరియు మహబూబ్‌నగర్ సర్కిల్ ఆఫీస్ నుండి మెటీరియల్స్ యొక్క షార్ట్ టెండర్ సరఫరా, కొనుగోలు షెడ్యూళ్ళ కోసం ఫోన్ నెం.8712472127.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, TGSPDCL, మహబూబ్‌నగర్-509001, తెలంగాణ.
DIPR R.O. No. : 15530-PP/CL/ADVT/1/2025-26, Date: 18-02-2026

GHMC ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం-II, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.
Short NIT No. 02/EE-II/CIRCLE-39/KHAIRATABAD ZONE/GHMC/2025-26, తేదీ: 17.02.2026.
NIT No. 02/EE-II/CIRCLE-39/KHAIRATABAD ZONE/GHMC/2025-26, పని పేరు: సివిల్ పనులు (07 నెంబర్లు), అంచనా విలువ / ఇసివి: రూ.44.72 లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం: క్ర.సం.: 01 నుండి07 వరకు పనుల కొరకు 18.02.2026న మ.12.00గం.ల నుండి 21.02.2026న మ.12.00గం.ల వరకు మాత్రమే. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec39.ameerpet@gmail.com, మొబైల్ నెం. 9063836121.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15560-PP/CL/ADVT/1/2025-26, Date: 18-02-2026





## డేటా సెంటర్లకు పూర్తి స్థాయి ఏర్పాట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో డేటా సెంటర్లను ఏర్పాటుకు చేసేందుకు ముందుకొచ్చే సంస్థలకు పూర్తి స్థాయిలో తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనల అంశంపైన హైదరాబాద్ లోని సచివాలయంలో రామకృష్ణ బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ శశాంక, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణరావు మాట్లాడుతూ డేటా కేంద్రాల ఏర్పాటు అంశంలో మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపైన చర్చించారు. డాటా సెంటర్ల ఏర్పాటుకు 100 శాతం గ్రీన్ ఎనర్జీ సోర్స్ సౌకర్యం, అందుకు కావాల్సిన విద్యుత్ ను బహిరంగ సేకరణ ద్వారా పొందడం, డెడికేటెడ్ పవర్ సప్లై నెట్వర్క్ ఎస్.జి.ఎస్.టి రీఇంబర్సుమెంట్ అభ్యర్థనలు, డేటా సెంటర్ల ఇన్వెస్టర్లు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఈ డేటా సెంటర్ల ఏర్పాటుతో రాష్ట్రం లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలతో పాటు అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

## ఖర్గే, రాహుల్‌తో మంత్రి వాకిటి భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 87 మునిసిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో విజయఢంకా మోగించిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ టీమ్‌ను అభినందించారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల గల విశ్వాసాన్ని, నమ్మకాన్ని శ్రీహరి, వారికి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని, రాబోయే రోజుల్లో పార్టీ మరింతగా ప్రజల్లోకి వెళ్ళడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయని తెలిపారు. ప్రజా మద్దతుతో కాంగ్రెస్‌లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న తీరును మంత్రి వాకిటి శ్రీహరి కూలంకుశంగా వారికి వివరించారు. పార్టీ పటిష్టత కోసం నాయకులందరూ కలసి కట్టుగా పనిచేయాలని అధిష్టానం వెల్లడించిందని తెలిపారు. మునిసిపల్ ఎన్నికల్లో విజయానికి అధిష్టానం అభినందించిందని శ్రీహరి తెలిపారు.

## వేసవి తాపానికి ఆర్‌టిసి చల్లని కబురు



### ఓఆర్ఆర్ పరిధిలో నడిచే ఏసి బస్సుల్లో 30 శాతం డిస్కౌంట్ : టిజిఎస్ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల సౌకర్యార్థం వేసవి తాపానికి ఆర్‌టిసి చల్లని కబురు తెలిపింది. మార్చి 1వ తేదీ నుంచి మే 31 వరకు ఓఆర్ఆర్ పరిధిలో నడిచే ఏసి బస్సుల్లో 30 శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు టిజిఎస్ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులతో సమానంగా ఏసి బస్ చార్జీలు ఉంటాయని స్పష్టం చేశారు. వేసవిలో బస్ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డి ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు గ్రేటర్ పరిధిలో తిరిగే సిటీ బస్సుల్లో లగేజ్ ర్యాక్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కోసం మొదటి విడతగా ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు చేశామని, జిల్లా సర్వీసుల్లో ఉండేంత విశాలంగా కాకుండా, తక్కువ ఎత్తుతో ఉండేలా వాటిని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ఒక్కో బస్సును రూ. 15 వేల ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే ర్యాక్‌లు ప్రయాణికులకు ఉపయోగకరమైన విధంగా ఉన్నాయా, సిటీ బస్సుల రద్దీ నేపథ్యంలో ప్రయాణికులు వాటిని వినియోగించుకుంటారా? అనేది స్టడీ చేసిన అనంతరం హైదరాబాద్ పరిధిలో తిరిగే మిగతా సిటీ బస్సుల్లో వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని నాగిరెడ్డి తెలిపారు.

### మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో

# కీలకంగా లైఫ్ సైన్సెస్

దేశ జిడిపిలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం

బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047 బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్, ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్‌కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్(బీ2బీ) సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.


## జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో పనిచేయాలి

టియుడబ్ల్యుజె రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ ఆవిష్కరణ సభలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రంగారెడ్డి యూనిట్ పాత్ర ప్రశంసనీయమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో టియుడబ్ల్యుజె రంగారెడ్డి జిల్లా మీడియా డైరీని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు రూ.5 లక్షల ప్రమాద భీమా కల్పించటంతో పాటు, నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం గొప్ప విషయం అన్నారు. ఇటీవల చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి అండగా యూనియన్ నిలబడటం మంచి పరిణామం అని గుర్తు చేశారు. జిల్లాలో చనిపోయిన జర్నలిస్టుల జాబితా ఇవ్వాలని, వారి కుటుంబాలకు అకాడమీ ద్వారా సహాయం అందిస్తామని చెప్పారు. అదేవిదంగా ఇప్పటి వరకు మృతి చెందిన జర్నలిస్ట్ ల భార్యలకు 5 సంవత్సరాల వరకు రూ.3 వేల చొప్పున పెన్షన్‌తో పాటు, 10వ తరగతి లోపు చదివే పిల్లలకు ప్రతి నెల ఒక వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వటం జరుగుతుందని వివరించారు. జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించిన రంగారెడ్డి జిల్లా శాఖను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.
అనంతరం టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రం లోనే కాకుండా దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ టియుడబ్ల్యుజె ఐజెయు మాత్రమే అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య పరంగా యూనియన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. నూతన డైరీ ఆవిష్కరణ సందర్భంగా జిల్లా జర్నలిస్ట్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తరువాత టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల షాబాద్ మండలంలో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి రూ.8 లక్షల సహాయం అందించటం జరిగిందన్నారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లా సమగ్ర సమాచారంతో రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ 2026ను రూపొందించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి లను శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్, ప్రజాపక్షం రంగారెడ్డి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సిహెచ్ జంగయ్య గౌడ్, జిల్లా నాయకులు భీమయ్య, ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్, శశిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి,రాజేంద్ర నగర్ నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్, దామోదర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు దర్శనం జంగయ్య, ఇలియాజ్, సీనియర్ రిపోర్టర్లు సుభాష్, శేఖర్, తిరుపతి రెడ్డి, శంకర్, రత్నం, యాసీన్, బస్వారాజ్, ఫరీద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎం.రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆధ్యాత్మికతకు, నియమనిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర నెలలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు వ్యక్తిగత శుద్ధికి మాత్రమే కాకుండా సమాజంలో క్రమశిక్షణ, సౌహార్దతను పెంపొందిస్తాయని తెలిపారు.లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని ఆనందంగా జరుపుకొని అల్లాహ్ దీవెనలు పొందాలని ఆకాంక్షించారు.

**శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

పిసిసిఅధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఉపవాసాలు, ప్రార్థనలు, దానం ధర్మాలతో ఆధ్యాత్మిక పరిపూర్ణత సాధించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. ఈ నెలలో జకాత్, ఫిత్రా రూపంలో అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం, దాతృత్వం పెంపొందుతాయని తెలిపారు.

## నేటి నుంచి రెండో విడత సిఎం కప్ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి

5,00,276 మంది క్రీడాకారులు..

21,500 రాష్ట్ర స్థాయి ఫైనలిస్టులు

తెలంగాణలో అతిపెద్ద క్రీడా ఉత్సవంగా మారిన ముఖ్యమంత్రి కప్- 2025




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర క్రీడా చరిత్రలోనే అతిపెద్ద క్రీడా ఉద్యమంగా ముఖ్యమంత్రి కప్–2025 నిలిచింది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించిన ఈ పోటీలకు రికార్డు స్థాయిలో 5,00,276 మంది క్రీడాకారులు నమోదు చేసుకోగా, అందులో 21,500 మంది 44 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గ్రామాల నుంచి హైదరాబాద్‌లోని ప్రముఖ క్రీడా వేదికల వరకు రాష్ట్రం అంతా క్రీడా జోష్ తో కళకళలాడుతోంది. గచ్చిబౌలి స్టేడియంలో గురువారం ఈ పోటీలను ప్రారంభిస్తారు. ఆ తరువాత అన్ని జిల్లాలలో పోటీసులు కొనసాగనున్నాయి. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ గ్రామ, మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిల్లో పోటీలు పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు చేరుకుంది. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడం ప్రధాన లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం, ఎల్‌బిస్టేడియం, సారూర్‌నగర్ స్టేడియం, హుస్సేన్ సాగర్ జలక్రీడా వేదికలతో పాటు రాష్ట్రంలోని పది జిల్లాల్లో జరుగుతున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో 17 క్రీడావిభాగాలు, ఎల్‌బి స్టేడియంలో 7విభాగాలు నిర్వహిస్తుండగా, మిగతా పోటీలు ఇతర వేదికలలో జరుగుతున్నాయి. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, జూడో, బేస్‌బాల్ తదితర విభాగాల్లో క్రీ డాకారులు ఉత్కంఠ భరిత పోటీలతో ప్రేక్షకులను అలరించారు. కోచ్‌లు, అధికారులు, క్రీడాభిమానుల హర్షధ్వనులతో వేదికలు మార్మోగుతున్నాయి. ఈ సందర్భంగా క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్‌పర్సన్,మేనేజింగ్ డైరెక్టర్ డా.ఏ.సోనిబాలా దేవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కప్–2025 కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదు ఇది తెలంగాణ యువత శక్తిని, గ్రామీణ ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే ఉద్యమం. 5లక్షలకు పైగా పాల్గొనడం, 21,500 మంది రాష్ట్ర స్థాయి ఫైనలిస్టులు ఎంపిక కావడం రాష్ట్ర క్రీడా చరిత్రలో ఒక మైలురాయి. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దే బలమైన వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతి వేగంగా పెరుగుతున్నదానికి ఈ భారీ స్పందనే నిదర్శనమని అధికారులు తెలిపారు. ము ఖ్యమంత్రి కప్ కేవలం పోటీ వేదికగానే కాకుండా, దీర్ఘకాలిక క్రీడా అభివృద్ధి దిశగా కీలక అడుగుగా మారిందన్నారు. రాబోయే రోజుల్లో ఫైనల్ పోటీలు, బహుమతి ప్రదానోత్సవాలు నిర్వహించనున్నారు. రికార్డు స్థాయి పాల్గొని ముఖ్యమంత్రి కప్–2025 తెలంగాణను క్రీడా శక్తిగా నిలబెట్టే దిశగా మరో ముందడుగుగా నిలుస్తోందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.



## రాష్ట్రంలో రూ.లక్ష కోట్లకు పైగా నిధులతో రహదారుల నిర్మాణం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో లక్ష కోట్లకు పైగా నిధులతో రహదారుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో ప్రీబడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఎఎం ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ విజయవాడ మార్గం, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం పొందేందుకు ప్రీబడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి కీలక నిర్ణయమని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల బలోపేతం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ కేంద్రంగా సంవత్సరం పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించేలా సినిమాటోగ్రఫీ శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు.

### టిజిఎఫ్ఎస్ఎల్ రాత పరీక్షల తేదీలను ప్రకటించిన

# రిక్రూట్‌మెంట్ బోర్డ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (టిజిఎఫ్ఎస్ఎల్)లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షల షెడ్యూలును తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిఎస్ఎల్‌పిఆర్‌బి) చైర్మన్ వివి శ్రీనివాసరావు బుధవారం ప్రకటించారు. గత నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో మొత్తం 4,664 మంది అభ్యర్థులకు గాను 3,760 మంది హాజరై తమ ధృవపత్రాలను పరిశీలించుకున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన కటాఫ్ మార్కులు, ఎంపికైన వారి వివరాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. షెడ్యూలు ప్రకారం ఈ రాత పరీక్షలు మార్చి 5, 6, 7 తేదీలలో హైదరాబాద్‌లోని మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జరగనున్నాయనీ ,ప్రతి టెక్నికల్ పేపర్ పరీక్షా సమయం ఒక గంట మాత్రమే ఉంటుందని, మధ్యలో అభ్యర్థులను బయటకు అనుమతించబోమని బోర్డు చైర్మన్ స్పష్టం చేశారు. మార్చి 5న మూడు సెషన్లలో సైంటిఫిక్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్ (ఫిజికల్/జనరల్ మరియు కంప్యూటర్స్), ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తామనీ, మార్చి 6న కెమికల్ విభాగానికి చెందిన సైంటిఫిక్ ఆఫీసర్, అసిస్టెంట్, టెక్నీషియన్ పోస్టులకు, మార్చి 7న బయాలజీ,సెరోలజీ విభాగాలకు చెందిన వివిధ పోస్టులకు పరీక్షలు జరగనున్నాయన్నారు.
కాగా, రాత పరీక్షకు ఎంపిక కాని అభ్యర్థులకు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పించామని తెలియజేశారు. అర్హత విషయంలో ఏవైనా వివరణలు కోరదలిస్తే, ఫిబ్రవరి 18వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 8 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ లాగిన్ ద్వారా ఒక్కో పోస్టుకు రూ. 500 చొప్పున ఫీజు చెల్లించి వివరణ కోరాల్సి ఉంటుంది. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తదితర వివరాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో వెల్లడిస్తామని బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## హామీలను అమలు చేసేలా 'మీ సిఎంకు' హితబోధ చేయండి

కాంగ్రెస్ అగ్ర నాయకులకు హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హితబోధ చేయాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనాయకులను కోరారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కర్నాటక ముఖ్యమంత్రి సిద్దారామయ్యలకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామినిచ్చారని, కానీ బిల్లు 'నిల్లయిందని, తద్వారా ప్రజల విశ్వాసం 'కిల్లయిందని ఆలేఖలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సోనియాగాంధీ స్వయంగా హామీనిస్తూ బాండ్ పేపర్లపై సంతకాలు చేశారని, సిఎం రేవంత్ రెడ్డి నిర్వాకం వల్ల ఆ బాండ్లకు విలువ లేకుండా పోయిందన్నారు. రైతులందరికీ రూ 2 లక్షల రుణ మాఫీ చేస్తామని, కౌలు రైతులకు కూడా రైతు భరోసా లబ్ది చేకూర్చుతామని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ 12వేలు ఇస్తామని, అన్ని రకాల పంటలకూ మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లిస్తామని, పంట బీమా కల్పిస్తామని నమ్మబలికారని హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగ భృతి రూ 4వేలు ఇస్తామని, 18 ఏళ్లు పై బడిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదని,ఎస్‌సి రిజర్వేషన్లను 18శాతానికి పెంచుతామని, అలాగే 420 హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదని తెలిపారు. పూటకో కుంభకోణంతో ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారని, క్రోనీ కాపిటలిజంకు తెలంగాణను కాపిటల్ గా మార్చిందని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగే సమావేశంలో 'రెండున్నరేండ్ల రేవంతు పాలన వైఫల్యాలుఅమలు కాని హామీల'పై ప్రధానంగా చర్చ జరపాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీలో తెలంగాణ మంత్రివర్గంతో సమావేశాన్ని నిర్వహిచండం అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్నది ఒక స్వతంత్ర ప్రభుత్వాన్నా? లేదా ఢిల్లీకి గులాంగిరి చేసే సామంత ప్రభుత్వాన్నా? అని ఆయన ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ప్రత్యామ్నాయమే లేదు

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ప్రత్యామ్నాయమే లేదని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని స్థానిక సంస్థల ఎన్నికలు నిరూపించాయన్నారు. గాంధీభవన్‌లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ 87.5 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చిందని, 67 శాతం బిసి వార్డు మెంబర్లు గెలిచారని తెలిపారు. మొత్తం 94 మున్సిపాలిటీలను గెలిచామంటే అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు సానుకూలతకు నిదర్శనమన్నారు. నిజామాబాద్‌లో 5 సీట్లలో ఎంఐఎం అభ్యర్థులపై గెలిచామన్నారు. ఢిల్లీలో ఎఐసిసి నాయకులతో జరిగే సమావేశం అన్ని రాష్ట్రాలపై ఎఐసిసి సమీక్ష సమావేశమని, ఇప్పటికే 11 రాష్ట్రాలపై సమీక్ష అయిపోయిందన్నారు. పార్టీ నిర్మాణం, సంక్షేమంపై చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి అర్థం చేసుకోవాల్సింది సీట్లు సర్వేల ఆధారంగా మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్ల ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మంత్రి వర్గంపై టిపిసిసి జోక్యం ఉండదన్నారు.

## మూడు కూనలకు జన్మనిచ్చిన దక్షిణాఫ్రికా చీటా గామిని



**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో 'గామిని' అనే దక్షిణాఫ్రికా చీటా మూడు కూనలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఎక్స్ వేదికగా తెలిపారు. 2022లో దక్షిణాఫ్రికా నుంచి ఈ గామినిని భారత్‌కు తీసుకొచ్చినట్లు యాదవ్ తెలిపారు. తాజా కూనలతో కలిపి దేశంలో చీటాల సంఖ్య 38కి చేరిందని కేంద్ర మంత్రి చెప్పారు. ప్రతి కూన జననం 'ప్రాజెక్ట్ చీటా'ను బలపరుస్తుందని తెలిపారు. చీటాలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించి వాటి వృద్ధికి కృషి చేస్తున్న ఫీల్ సిబ్బంది, వైద్యులను ఆయన అభినందించారు. గామిని మూడు కూనలకు జన్మనివ్వడంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా హర్షం వ్యక్తంచేశారు. కాగా, నమీబియా నుంచి తీసుకొచ్చిన చిరుత ఆశా ఇదే పార్కులో ఈ నెల ప్రారంభంలో ఐదు కూ నలకు జన్మనిచ్చింది. భారత్‌లో చీటాల సంతతిని పునరుద్ధరించడమే లక్ష్యంగా కేంద్ర ప్ర భుత్వం 'ప్రాజెక్ట్ చీటా'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా 2022లో నమీబియా నుంచి, 2023లో దక్షిణాఫ్రికా నుంచి చీటాలను భారత్‌కు తీసుకొచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత చీటాలు పలు కూనలకు జన్మనిచ్చాయి.

## అదానీ బినామీ నిధులకు

# ఓసిసిఆర్‌పి నివేదిక సాక్ష్యం

### దర్యాప్తునకు మోదీ అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూపు కంపెనీలలో ఆయన సన్నిహితులకు చెందిన రెండు సంస్థలు భారీ ఎత్తున వాటాలు కూడగట్టుకునేందుకు బినామీ నిధులను పోగుజేశాయని ఓసిసిఆర్‌పి నివేదికలో తాజా సాక్ష్యాలు బయటపడ్డాయి. దీంతో ప్రధాన మంత్రి మోదీపై కాంగ్రెస్‌పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. ఈ అక్రమ నిధులపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) దర్యాప్తు చేయాలంటూ తాము చేసిన డిమాండ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గోడకట్టినట్టుగా అడ్డుగా నిలబడి చాలా గట్టిగా వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. అదానీ గ్రూపునకు చాలా సన్నిహితమైన రెండు సంస్థలు ఈ గ్రూపులో భారీ ఎత్తున వాటాలు కలిగి ఉన్నాయని, ఈ వాటాలు సేకరించేందుకు ఈ రెండు సంస్థలూ బినామీ నిధులు సేకరించాయని ఇందుకు ఓసిసిఆర్‌పి(ఆర్గనైజ్‌డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు) నివేదికే ప్రత్యక్ష సాక్ష్యమని కాంగ్రెస్‌పార్టీ ఉదాహరణగా ముందుకు తెచ్చింది. ఐతే గతంలో కాంగ్రెస్‌పార్టీ చేసిన అనేక ఆరోపణలను అదానీ గ్రూపు తిరస్కరిస్తూ వస్తోంది. తమ గ్రూపులో బినామీ నిధులు లేవని చెబుతూ వస్తోంది. కాంగ్రెస్ ఇప్పుడు తాజాగా ఈ విషయంలో ఒక సాక్ష్యంగా ఓసిసిఆర్‌పి నివేదికను ముందుకు తీసుకువచ్చింది. దీనిపై



అదానీ గ్రూపు ఇంతవరకూ అధికారికంగా ఎలాంటి స్పందనా ఇవ్వలేదు. అదానీ గ్రూపులో బినామీ నిధులు ఉన్నాయని ఓసిసిఆర్‌పి తన నివేదికగా తాజా ఆరోపణలు చేసింది. జార్జ్ సోర్స్, రాక్‌ఫెల్లర్ బ్రదర్స్ ఫండ్ వంటివారు అదానీ గ్రూపులో బినామీ నిధులు పెట్టుబడిగా పెట్టారని తాజా నివేదిక వెల్లడించింది. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టింగ్ పెట్టారు. చాలా నిజాయతీగా, నిబద్ధతతో న్యాయబద్ధమైన నిధులను పరిశ్రమల్లో పెట్టుబడులుగా సమకూరిస్తే కాంగ్రెస్‌పార్టీ ఎంతో సంతోషంగా దానిని ఆహ్వానిస్తుందని, కానీ అదానీ గ్రూపులో పెట్టుబడులు బినామీ పద్ధతుల్లో సేకరించారని విమర్శించారు. న్యాయబద్ధమైన నిధులు పెట్టుబడులుగా సమకూరిస్తే కాంగ్రెస్‌పార్టీ మద్దతు తెలియజేస్తుందని, కానీ అదానీ మిత్రులు తప్పుడు మార్గాల్లో నిధులను తెచ్చి పెట్టుబడులుగా సమకూర్చారని, దానికి నరేంద్రమోదీ వత్తాసుగా నిలబడ్డారని, దీనిపై జెపిసి దర్యాప్తు జరపాలని కోరుతుంటే ఆయన పెద్ద అడ్డుగోడలా నిలబడి తిరస్కరిస్తున్నారన్నారు. 'అదానీ గ్రూపులో బినామీ నిధులుండటంపై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి, అదానీకి అత్యంత సన్నిహితులైన ఛాంగ్ చంగ్–లింగ్ అండ్ నస్సెర్ అలీ షాబన్ అహ్లి అదానీ గ్రూపులో బినామీ నిధులను పెట్టుబడుగా పోగుజేసిపెట్టారు'' అని ఎక్స్ వేదికగా జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఓసిసిఆర్‌పి వద్ద అదానీ గ్రూపు అక్రమాలకు సంబంధించిన సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో ఛాంగ్, అహ్లి ఇద్దరికీ స్విస్ బ్యాంకులో ఖాతాలు ఉన్న విషయాన్ని వారు అంగీకరించారని తెలిపింది. అదానీ కంపెనీల్లో ఈ ఇద్దరికీ భారీ ఎత్తున బినామీ నిధులున్నాయని అన్నారు. దాదాపు 3 బిలియన్ డాలర్ల మేరకు అదానీ స్టాక్‌లో విదేశాలకు చెందిన నిధులున్నాయని వార్తలు వెలువడ్డాయని రమేశ్ గుర్తు చేశారు. ఇదిలా ఉండగా సెబీ కూడా ఈ నిధుల అక్రమాలు ఉల్లంఘనలపై 13 సందేహాస్పద ట్రాన్‌శాక్షన్స్‌పై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ దర్యాప్తునకు సంబంధించి దర్యాప్తును మూడు నెలల్లో పూర్తిచేయాలని 2023 మార్చి రెండో తేదీన సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందనీ, ఇప్పటికి మూడు సంవత్సరాలు గడచినప్పటికీ దర్యాప్తు పూర్తికాలేదని జైరామ్ రమేశ్ విమర్శించారు.

## విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు 5% రిజర్వేషన్లు రద్దు

### మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**ముంబయి:** మహారాష్ట్రలో ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మంగళవారం నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు ఉత్తర్వులు జారీచేసింది. ముస్లిం రిజర్వేషన్లకు సంబంధించి 2104లో జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసింది. మరోవైపు రిజర్వేషన్లను రద్దు చేయడంతో మహారాష్ట్రలో రాజకీయ దూమారం రేగింది. 2014 జులైలో అప్పటి ప్రభుత్వం ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ద్వారా ముస్లింలను ప్రత్యేక వెనకబడిన వర్గం (ఎస్‌బిసిఎ) కింద చేర్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల ప్రవేశాల్లో 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ఆర్డినెన్స్‌పై బాంబే హైకోర్టులో సవాల్ చేయగా, 2014 నవంబర్ 14న స్టే విధించింది. 2014 డిసెంబర్ 23 గడువు అసెంబ్లీలో ఈ ఆర్డినెన్స్ ఆమోదం పొందకపోవడంతో రద్దు అయ్యింది. తర్వాత బాంబే హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ఈ నిబంధన చెల్లదు అని పేర్కొంది. దీంతో ఆ రిజర్వేషన్ చట్టపరంగా అమలులో లేకుండా పోయింది. అయితే ఈ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ఈ బిల్లును రద్దు చేయలేదు. దాదాపు పదేళ్ల తర్వాత ఇప్పుడు ప్రభుత్వం కొత్త ఉత్తర్వుతో ఆర్డినెన్స్‌ను రద్దు చేసింది. దీని ప్రకారం, 5శాతం ముస్లిం రిజర్వేషన్ కింద ఇకపై ఎలాంటి అడ్మిషన్లు ఉండవు. ఆ కేటగిరీలో కొత్త కుల లేదా చెల్లుబాటు అయ్యే సర్టిఫికెట్లు జారీ చేయరు.

**మైనారిటీలకు అన్యాయం**
**కాంగ్రెస్ నేత ఆరోపణ**

సామాజిక, విద్యా పరంగా వెనుకబడిన ముస్లిం వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్‌ను రద్దు చేయడం తీవ్ర అన్యాయమని కాంగ్రెస్ మాజీ వర్కింగ్ కమిటీ సభ్యుడు నసీమ్ ఖాన్ అన్నారు. 2014లో కాంగ్రెస్–ఎన్‌సిపి ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఈ కోటాను ప్రవేశపెట్టిందని, తర్వాతి ప్రభుత్వాలు దాన్ని కొనసాగించలేదని అన్నారు. బాంబే హైకోర్టు తాత్కాలిక అనుమతి ఇచ్చినా, 5 శాతం విద్యా రిజర్వేషన్ అమలు సరిగా జరగలేదని పేర్కొన్నారు. 2014–15 విద్యా సంవత్సరంలో మాత్రమే అమలై, తర్వాత ఆపివేసినట్లు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు మైనారిటీ సంక్షేమ పథకాలను నిలిపేశారని, విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ నిధులు తగ్గించారని నసీం ఖాన్ ఆరోపించారు. వార్షికంగా అవసరమైన రూ.90 కోట్లకు బదులుగా కేవలం రూ.20 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. 70 నుంచి 75 పాఠశాలలకు మైనారిటీ హోదా సర్టిఫికెట్లు ఇచ్చారని, వాటి మంజూరులో అక్రమాలు జరిగి ఉండొచ్చని ఆరోపించారు. కొన్ని సంస్థలకు సర్టిఫికెట్ ఇవ్వడానికి భారీ మొత్తాలు వసూలు చేశారని కూడా ఆరోపణలు చేశారు.

## ఇండియా–ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం...

# భారత్, యూరప్ సంబంధాలలో స్వర్ణయుగం

- స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రోసాంచెజ్, ఫిన్‌లాండ్ ప్రధాని పెట్టెరి ఓర్పోలతో మోదీ వేర్వేరు సమావేశాలు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పెయిన్ ప్రెసిడెంట్ పెడ్రో సాంచెజ్, ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి పెట్టెరి ఓర్పోలతో బుధవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ భారతదేశంయురోపియన్ యూనియన్ (ఇయు) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతదేశం యూరప్ సంబంధాలలో స్వర్ణయుగానికి నాంది పలికిందని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్‌తో తాను ఉత్పాదక సమావేశం నిర్వహించానని ఆయన తెలిపారు. భారతదేశం స్పెయిన్ స్నేహాన్ని పెంపొందించే మార్గాలను ముఖ్యంగా రక్షణ, భద్రత, సాంకేతికత వంటి రంగాలపై చర్చించానని మోదీ వివరించారు. మన దేశాలు 2026 సంవత్సరాన్ని ఇండోస్పెయిన్ సాంస్కృతిక, పర్యాటక, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గుర్తించుకుంటున్నాయని, ఇది ప్రజల నుండి ప్రజల సంబంధాలను మరింతగా పెంచేందుకు దోహదపడతాయన్నారు. విశ్వవిద్యాలయాలకు చెందిన ఒక పెద్ద ప్రతినిధి బృందం భారతదేశానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది కూడా మన ప్రజలను అనుసంధానించడంలో చాలా దోహదపడుతుందన్నారు. 'ఇయుతో చారిత్రక ఎఫ్‌టిఎ స్పెయిన్‌తో ఆర్థిక భాగస్వామ్యంపై చాలా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మన దేశాల ప్రజలకు కొత్త అవకాశాలను కూడా అంది




స్తున్నది' అని ప్రధానమంత్రి తన 'ఎక్స్' పోస్ట్‌లో చెప్పారు. జనవరి 27న భారతదేశంయురోపియన్ యూనియన్ 2 బిలియన్ల ప్రజల మార్కెట్‌ను సృష్టించడానికి 'అన్ని ఒప్పందాలకు ఒక తల్లి'గా పిలువబడే మైలురాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. స్పెయిన్‌భారతదేశం మధ్య సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని, ఈ ఒప్పందాన్ని ఇరువురు నేతలూ బలోపేతం చేసుకుంటున్నారని, దీనిని ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు తాను కూడా గుర్తించానని స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ అన్నారు. 'కృత్రిమ మేధస్సుపై సమ్మిట్ నిర్వహణకు నేను అతడిని అభినందించాను. ప్రజలను కేంద్రంగా చేసే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వైపు చర్యలు తీసుకోవడాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని మేం పంచుకుంటాం అని స్పెయిన్ ప్రెసిడెంట్ పెడ్రో సాంచెజ్ స్పానిష్‌లో తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి పెట్టెరి ఓర్పోలతో తన 'విస్తృత చర్చల' సందర్భంగా భారతదేశంయూరప్ సంబంధాలలో స్వర్ణయుగానికి నాంది పలికే భారతదేశం ఇయుఎఫ్‌టిఏకు వ్యక్తిగత మద్దతు ఇచ్చినందుకు మోదీ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ద్వైపాక్షిక సాంకేతికత, ఆవిష్కరణ, వ్యాపారం, ప్రజల నుంచి ప్రజల సంబంధాలను మరింత ప్రోత్సహించడంలో ఇరు దేశాల మధ్య ఏర్పడిన దౌత్య సంబంధాల 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది జరుపుకున్న భారతదేశంస్పెయిన్ ద్వంద్వ సంస్కృతి పర్యాటక, కృత్రిమ మేధస్సు సంవత్సరంపు అధిక సామర్థ్యాన్ని మోదీ, సాంచెజ్ నొక్కి చెప్పారని ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) విడుదల చేసిన ఒక ప్రకనట తెలిపింది. ముఖ్యంగా భారతదేశం నూతన విద్యా విధానం నేపథ్యంలో ఇరుదేశాల విద్యలో సహకార సామర్థ్యం గురించి కూడా వారు లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 19, 20 తేదీలలో న్యూఢిల్లీలో జరుగనున్న భారతీయ విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్స్‌లర్లు, స్పానిష్ యూనివర్సిటీల రెక్టార్ల సమావేశాన్ని వారు స్వాగతించారని పిఎంఒ ప్రకటన వెల్లడించింది. 'ఇండియా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇంపాక్ట్ ఎక్స్‌పో2026'కు 'హాజరయ్యేందుకు సాంచెజ్, ఆర్పోలు భారతదేశానికి వచ్చారు.

## దేశ సమాఖ్య విధానానికి నిర్మాణాత్మక పునఃస్థాపన అవసరం

- అందుకు రాజ్యాంగ సవరణను ప్రతిపాదించిన తమిళనాడు సిఎం స్టాలిన్

**చెన్నై :** భారత రాజ్యాంగాన్ని సవరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కల్పించేలా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణను అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నిర్మాణాత్మక పునర్నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని ఆరోపించారు. కేంద్ర,రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ నివేదిక మొదటి భాగాన్ని తమిళనాడు అసెంబ్లీలో ప్రవేశపెడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టప్రకారం రావాల్సిన నిధులను దక్కించుకునేందుకు కేంద్రంతో పోరాటం చేయాల్సిన పరిస్థితిలోకి తమిళనాడును నెట్టివేశారని విమర్శించారు. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటిందని స్టాలిన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలపై ఎలాంటి గౌరవం లేకుండా కేంద్రమే అన్ని అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. రాష్ట్రాలను గౌరవించకుండా కేంద్రమే అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని విమర్శించారు. 'ఒక రాష్ట్రంగా మా ప్రజల కలలను నిజం చేసేందుకు మాకు అధికారాలు కూడా లేవు. సామాజిక న్యాయం, విద్య, వైద్యం, ఆర్థికం, మౌలిక సదుపాయల కల్పనలో చాలా అభివృద్ధి సాధించాం. కానీ



నిధులు సహా కొన్ని హక్కుల కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను దక్కించుకునేందుకు ప్రతీసారి పోరాడాల్సిన పరిస్థితిల్లో మనం ఉన్నాం. ఇంకా ఎన్ని రోజులు వారు ఇస్తుంటే మనం తీసుకునే స్థితిలో ఉందాం? మేము ప్రతీసారి తలవంచి అడుక్కునే వ్యక్తులం కాదు. మా రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కావాలి. కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ ఉంటేనే ప్రజలకు సుపరిపాలనను అందించగలం. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటింది. రాష్ట్రం కేంద్రం మధ్య సంబంధాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ అందించిన నివేదికను అసెంబ్లీలో పెడుతున్నాం. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని అందించేందుకు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని సవరించాలి. ఇప్పటికీ మనకు వచ్చే రాజ్యాంగ హక్కులు, నిధులు, అధికారాల కోసం పోరాడాల్సిన స్థితిలో ఉన్నాం. అందుకే భారతదేశ సమాఖ్య వ్యసస్థకు నిర్మాణాత్మక పునర్ నిర్మాణం అవసరం. మనం కోరుకుంటే, మళ్లీ రాజ్యాంగాన్ని సవరించవచ్చు. సమాఖ్యవాదం అంటే నియంత్రణ కాదు, నమ్మకం, స్వయంప్రతిపత్తి' అని స్టాలిన్ పేర్కొన్నారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి కేంద్రం బలంగా ఉండాలని 1967లోనే టిఎంకె వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి సిఎన్ అన్నాదురై అన్నారని సిఎం స్టాలిన్ గుర్తు చేశారు. ఆయన వారసుడు దివంగత ఎం కరుణానిధి కూడా 'రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి – కేంద్రంలో సమాఖ్య వాదం' అనే సూత్రం ద్వారా దీనికి మద్దతు తెలిపారని చెప్పారు. 1969లో జస్టిస్ పివి రాజమన్నార్ ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర సంబంధాలపై మొదటి స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1983లో జస్టిస్ సర్కారియా నేతృత్వంలో కేంద్రం మరో కమిటీని ఏర్పాటు చేసింది. అనంతరం 2000లో వెంకటాచలయ్య కమిషన్‌ను నియమించారు. కాగా, రాష్ట్రాల హ క్కులపై గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో తీ వ్రంగా పోరాడుతున్న తమిళనాడు ముఖ్యమ ంత్రి ఎంకె స్టాలిన్ రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, విశ్రాంత ఐఎఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, తమిళనాడు ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ నాగనాథ న్ ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఇందులో ని మొదటి భాగాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

## భటిండాలో రైతుల ఆందోళన

### గత ఏడాది అరెస్టు చేసిన ఇద్దరు రైతులను విడుదల చేయాలని డిమాండ్

### అడ్డుకున్న పోలీసులు, రైతులపై భాష్పవాయువు ప్రయోగం

**భటిండా/పాటియాల:** గత సంవత్సరం అరెస్టు చేసిన ఇద్దరు రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్‌లోని భటిండాలో రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. అయితే నిరసన కార్యక్రమంలో పోలీసు సిబ్బందిపై రాళ్లు రువ్విన ఆరోపణలు రావడంతో రైతుల బృందాన్ని అదుపు చేయడానికి పోలీసులు భాష్పవాయువు షెల్స్ ప్రయోగించారని అధికారులు తెలిపారు. నిరసన తెలుపుతున్న అనేక మంది రైతులను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. బదింతా జిల్లా పరిపాలనా సముదాయం వెలుపల నిరసన నిర్వహించడానికి భారతి కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహన్) బ్యానర్ కింద జియోండ్ గ్రామంలో రైతులు సమావేశమయ్యారు. నిరసనకు ముందు, భటిండా జిల్లా పరిపాలనా సముదాయం వైపు నిరసనకారులు ముందుకు సాగకుండా నిరోధించడానికి భటిండా, పొరుగు జిల్లాల్లో భారీ పోలీసులను మోహరించారు. భటిండా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) జ్యోతి యాదవ్ బయిన్స్ మాట్లాడుతూ 'మూక' పోలీసులపై పైకప్పుల నుండి రాళ్లు రువ్విందని అన్నారు. ఆ గుంపు దూకుడుగా ప్రవర్తించిందని, కానీ తాము అదుపు చేశామని, పరిస్థితి అదుపులో ఉందని బయిన్స్ అన్నారు. అయితే, నిరసన తెలుపుతున్న ఒక రైతు పోలీసు సిబ్బంది భాష్పవాయువు షెల్స్ ప్రయో




గించారని, ఎటువంటి రెచ్చగొట్టకుండా వారిపై రాళ్లు రువ్వారని పేర్కొన్నారు. నిరసన చేపట్టడం ప్రజాస్వామ్య హక్కు అని ఆయన అన్నారు. నిరసన పిలుపు నేపథ్యంలో పోలీసులు రైతు నాయకుల ఇళ్లపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారని కూడా ఆయన ఆరోపించారు. అరెస్టు చేసి ఏప్రిల్ నుండి భటిండా జైలులో ఉన్న రైతులు షగన్‌దీప్ సింగ్ జి యోండ్, బల్దేవ్ సింగ్ చౌకేలను విడుదల చేయాలని కోరుతూ బుధవారం బికెయు (ఏక్తా ఉగ్రహా న్) నిరసనకు పిలుపునిచ్చింది. పాటియాలాలోని సమనాలో, బదిందా వైపు వెళ్తున్న అనేక మంది రైతులను సమానా–భవానీగఢ్ రోడ్డులోని గజేవాస్ గ్రామం సమీపంలో మట్టితో నిండిన టిప్పర్ ట్రక్కులు అడ్డంగా నిలిపి ఉంచి పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులు ముందుకు సాగకుండా ఆపిన తర్వాత, సమనాలోని ఒక గురుద్వారా సమీపంలో కొంతమంది రైతులు పోలీసు సిబ్బందితో గొడవ పడ్డారు.

## హర్యానా ప్రభుత్వ హౌసింగ్ సొసైటీ కేటాయించిన...

# రెండు ఫ్లాట్లను రద్దు చేసిన 'సుప్రీం'

### బంధుప్రీతి, స్వీయ-అభిమానం 'ప్రజాస్వామ్య వ్యవస్థకు అసహ్యకరమైనవని' కీలక వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** బంధుప్రీతి, స్వీయఅభిమానం 'ప్రజాస్వామ్య వ్యవస్థకు అసహ్యకరమైనవని' గమనించిన అత్యున్నత న్యాయస్థానం హర్యానా ప్రభుత్వ హౌసింగ్ సొసైటీ పాలకమండలి సభ్యుడికి, ఆయన సబార్డినేట్‌కు కేటాయించిన రెండు ఫ్లాట్ల కేటాయింపును రద్దు చేసింది. కేటాయింపు ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పాలకమండలి సభ్యుడికి, అతడి సబార్డినేట్‌కు చేసిన కేటాయింపులు ఏకపక్షంగా, పక్షపాతంగా ఉన్నాయని సొసైటీ సొంత అర్హత ప్రమాణాలను ఉల్లంఘించిందని ధర్మాసనం తెలిపింది. 'బంధుప్రీతి, స్వీయ అభిమానం ప్రజాస్వామ్యానికి అసహ్యకరమైనవి.




ముఖ్యంగా గవర్నమెంట్ సర్వీస్‌లోని సభ్యులతో కూడిన సమాజంలో ఇది జరిగినప్పుడు, పారదర్శక కేటాయింపుల ద్వారా దాని సభ్యులకు గృహ సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది' అని బెంచ్ పేర్కొంది. రెండు హైఎండ్ సూపర్ డీలక్స్ ఫ్లాట్ల కేటాయింపును సవాల్ చేస్తూ హుడా అర్బన్ ఎస్టేట్ అండ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (హెచ్ఇడబ్ల్యుఒ) సభ్యుడు దినేష్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. 'హుడా సేవలో ఆరునెలల డిప్యుటేషన్ వ్యవధిని సైతం సంతృప్తిపర్చని పాలకమండలి సభ్యుడికి ప్రాధాన్యత కేటాయింపు ఇవ్వబడలేదు. మూడవ ప్రతివాదికి చేసిన కేటాయింపును సమర్థించడానికి మాకు ఎటువంటి కారణం కనిపించడం లేదు. ఇది స్పష్టమైన పక్షపాతచర్య. స్వార్థపూరిత గొప్పతనాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది' అని ధర్మాసనం పేర్కొంది. అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణించి సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును పక్కనపెట్టింది. హుడాపై రూ.లక్ష ఖర్చులు, మూడవ ప్రతివాది బిబి.గుప్తాపై అదనపు ఖర్చుల కింద రూ.50,000 విధించింది. నాలుగవ ప్రతివాది పురణ్ చంద్‌పై రూ.25,000 మొత్తాన్ని విధించింది. రెండవ ప్రతివాది అయిన హుడా అప్పీలెంట్ లిటిగేషన్ ఖర్చుల నిమిత్తం తప్పనిసరిగా రూ. 50,000 మొత్తాన్ని సుప్రీంకోర్టు లీగల్ కమిటీకి జమ చేయాల్సి ఉంటుందని ఆదేశించింది. మూడవ, నాలుగవ ప్రతివాదికి అయిన ఖర్చుల మొత్తాన్ని రెండు వారాలలోపు చెల్లించాలని బెంచ్ ఆదేశించింది. మూడవ, నాలుగవ ప్రతివాదులు జమ చేసిన మొత్తం మొత్తాలను ఒక నెల వ్యవధిలోపు వారికి ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించాలని , వాపసు ఇచ్చిన ఒక నెల తర్వాత వారు ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

## రూ.640 కోట్ల సైబర్ మోసం

# ఛార్టర్డ్ అకౌంటెంట్‌కు ముందస్తు బెయిల్ నిరాకరించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** రూ.640 కోట్ల సైబర్ మోసం కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ దర్యాప్తు కేసుతో సంబంధం ఉన్న ఓ ఛార్టర్డ్ అకౌంటెంట్‌కు ముందస్తు బెయిల్ (యాంటిసిపేటరీ బెయిల్) మంజూరు చేసేందుకు బుధవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. భాస్కర్ యాదవ్ ముందస్తు అరెస్ట్ బెయిల్‌ను నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.సుంద్రేశ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. అతడిని 10 రోజుల్లోగా లొంగిపోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఫిబ్రవరి 2న హైకోర్టు భాస్కర్ యాదవ్, అశోక్ కుమార్ శర్మల ముందస్తు బెయిల్ దరఖాస్తులను తోసిపుచ్చింది. తన 22 పేజీల తీర్పులో హైకోర్టు 'మనీలాండరింగ్ యొక్క క్లిష్టమైన మెష్' ఉందని తెలిపింది. 'కస్టడీలో ఉన్న ఇద్దరు నిందితులను విచారించాల్సిన ఆవశ్యకతను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వ్యక్తం చేయడం అసమంజసమైనది' అని వ్యాఖ్యానించింది. మనీ లాండరింగ్ ఆరోపణలను వెలికితీయడానికి డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డిఒఇ) తరపు న్యాయవాది సమర్పించిన వాదనలో కస్టోడియల్ విచారణ చాలా అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. 'ఇది కేవలం ఇక్రిప్టో కరెన్సీలతో లావాదేవీలు జరిపిన కేసు కాదు. ఈ దేశంలో ఇది నేరం కాదు. నిందితుల బాధ్యత క్రిప్టో లావాదేవీలపై పన్ను చెల్లించడానికి పరిమితం చేయబడింది. ప్రస్తుత కేసులు డబ్బు తరలింపునకు సంబంధించిన విస్తారమైన, సంక్లిష్టమైన మెష్‌ను ప్రదర్శిస్తాయి. మోసపూరిత పెట్టుబడిదారుల జేబులో మోసపూరితంగా దొంగిలించబడతాయి. వారు ప్రధానంగా మధ్య తరగతికి చెందిన వారుగా కనిపిస్తారు' అని అది జోడించింది. దర్యాప్తు అధికారులపై దాడి చేశారని, సైబర్ మోసం ఫిర్యాదులను పరిష్కరించడానికి స్థానిక పోలీసులకు లంచం ఇచ్చినట్లు, ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేసినట్లు నిందితులు ఆరోపించినట్లు కొత్త ఫిర్యాదులు వచ్చాయని అది గుర్తించింది. ఢిల్లీ పోలీస్ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ (ఇఒడబ్ల్యు) దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లపై మనీ లాండరింగ్ దర్యాప్తు జరిగింది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్, పార్ట్ టైమ్ జాబ్స్, ఫిషింగ్ మోసాలతో రూ.640 కోట్ల సైబర్ మోసం సృష్టించడానికి దారి తీసిందన్న దర్యాప్తు అభియోగాలతో కేసులను రిజిస్టర్ చేశారు. 5,000 మిలియన్లకు పైగా మ్యూల్ ఇండియన్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా మోసపోయిన నిధులను పొరలు పొరలుగా విభజించడం ద్వారా మోసపూరిత వ్యక్తుల డబ్బును రహస్యంగా దోచుకున్నారని, అనంతరం యుఎఇకి చెందిన పేమెంట్ ప్లాట్‌ఫారం ద్వారా పివైపై పిఎల్ లో అప్‌లోడ్ చేశారని దర్యాప్తు సంస్థ తెలిపింది. సైబర్ మోసం ద్వారా వచ్చిన డబ్బులో కొంతభాగాన్ని వివిధ భారతీయ బ్యాంకులు జారీచేసిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా దుబాయ్‌లో నగదు ఉపసంహరించుకున్నారని దర్యాప్తు సంస్థ ఇంతకుముందు విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది.




## ఇండియా కూటమి నాయకత్వ సమస్యను పరిష్కరించాలి

### 'సామ్నా' సంపాదకీయ సూచన

**ముంబయి :** ప్రతిపక్ష ఇండియా కూటమిలో నాయకత్వ మార్పు ప్రశ్న మళ్ళీ తలెత్తిందని, దానిని విస్మరించలేమని శివసేన (యుబిటి) బుధవారం పేర్కొంది. కాంగ్రెస్‌ను విమర్శిస్తూ, కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారో చూడాల్సి ఉందని పేర్కొంది. అసంతృప్తి చెందిన కాంగ్రెస్ సభ్యులు, యుపిఎ పాలనతో సంబంధం ఉన్న వారి గొంతులను ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీ ప్రస్తావించింది. ఇండియా కూటమి నాయకత్వాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లేదా తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్‌కు ఇవ్వాలని సూచించింది. మమతా, స్టాలిన్ లేదా మరెవరికైనా ఇవ్వడానికి నిర్ణయం తీసుకోవాలని సేన (యుబిటి) అధికార వార్తా పత్రిక 'సామ్నా' సంపాదకీయం పేర్కొంది. ఎన్నికలు ప్రకటించినప్పుడు మేల్కొని ప్రతిపక్ష కూటమి గురించి మాట్లాడే బదులు, భాగస్వాముల మధ్య చర్చలు జరిపి స్పృహతో నిర్ణయాలు తీసుకోవడం అవసరమని అభిప్రాయపడింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పాలక బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌ను ఎదుర్కోవడానికి ప్రతిపక్ష పార్టీల కూటమి అయిన ఇండియా కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తోంది. 'భారత కూటమి నాయకత్వంలో మార్పు అనే అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారత కూటమికి ఏమైంది? ఈ ప్రశ్న చాలా మంది ముందు ఉంది. కానీ ఈ ప్రశ్న కాంగ్రెస్ మనసులోకి వచ్చిందా?' అని సామ్నా సంపాదకీయం ప్రశ్నించింది. పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతోంది. కేరళలో కాంగ్రెస్ వామపక్షాలకు మధ్య పోరు జరుగుతోంది. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన పుర పాలక ఎన్నికల్లో కాంగ్రెస్ స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇది బిజెపికి ప్రయోజనం చేకూర్చింది అని సామ్నా గుర్తు చేసింది. 'ఈ ప్రశ్న రాజకీయ చర్చకు సంబంధించినది అయినట్లే, దేశానికి సంబంధించినది. ఎన్నికలు ప్రకటించినప్పుడల్లా, ఇండియా కూటమి కచ్చితంగా మేల్కొని చర్చలు జరపవచ్చు. కానీ కలిసి కూర్చొని చేతన నిర్ణయం తీసుకోవడం తెలివైన పని అని సూచించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తనను పార్లమెంట్ నుండి బయటకు పంపినా లేదా ప్రభుత్వం తనపై కేసులు మోపినా తాను బాధపడనని మంచి వైఖరిని తీసుకున్నారని, ఇది అతని పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ప్రశంసించింది. కానీ కార్మికులు అధికారానికి దూరంగా ఉండి అధికారంలోకి రావాలనే కోరికను కోల్పోతే నీరసించిపోతారని సంపాదకీయం పేర్కొంది.



బిజెపికి మెజారిటీ రాకపోయినా (2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ), కేంద్రంలో ఆ ప్రభుత్వం క్రచెస్‌పై మనుగడ సాగించినా, దాని అహంకారం అంతం కాలేదని సేన (యుబిటి) పేర్కొంది. అయితే కాంగ్రెస్ పట్ల శివసేన (యుబిటి) నిరాశ వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇండియా బ్లాక్ ఉందా లేదా అనే దానిపై గత నెలలో పిటిఐ అడిగిన ఒక ఇంటర్వ్యూలో థాక్రే మాట్లాడుతూ ఇండియా బ్లాక్ ఉందా లేదా అని తనిఖీ చేయండని పేర్కొంది.

# 'సర్' నిర్వహణలో ఇ.సి. ద్వంద్వ ప్రమాణాలు

2024లో లోక్‌సభ ఎన్నికల తదుపరి మూడో రౌండ్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. మే, జూన్ మాసాల్లో వేర్వేరు తేదీల్లో పదవీకాలం ముగుస్తున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, యుటి పుదుచ్చేరి అసెంబ్లీలకు మే మాసంలో ఎన్నికల నిర్వహణకు భారత్ ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించింది. లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్రమోదీ ప్రధానిగా మూడవ పర్యాయం బిజెపి(ఎన్‌డిఎ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ లోక్‌సభలో బిజెపి సొంత సంఖ్యాబలం 240కి పడిపోయింది. ఎన్‌డిఎలోని చిన్న ఏకక పార్టీలకు తోడు జెడి(యు), తెలుగుదేశం మద్దతుతో అది అందలం అధిష్టించింది. అయితే మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకుసాగుతోంది – దేశమంతటా ఏక పక్ష ఎజెండాకు ప్రాకులాడుతోంది. ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుంటోందని ఆరోపణలకు గురవుతున్నది. ఎవరేమనుకుంటే మాకేమి, అధికారం ముఖ్యంకదా అనే ధోరణిలో ధిక్కారం ప్రదర్శిస్తోంది. మోదీ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హర్యానా, ఆ తదుపరి ఢిల్లీ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌దే అధికారం అనుకున్న హర్యానాలో ఫలితం తిరగబడి మళ్లీ బిజెపికే అధికారం దక్కింది. ఇది కుమ్మక్కుతో ఓటర్ల జాబితాల్లో అక్రమ చేర్పులు–మార్పుల ఆరోపణలకు గురైంది. ఆ తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయపార్టీలను పదవుల ఆశతో చీల్చి, ఓటర్ల జాబితాల్లో అక్రమాలతో బిజెపి అధికారం సొంతం చేసుకుంది.

ఆ తదుపరి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంకోసం బిజెపి ఎన్నికల కమిషన్‌ను ప్రయోగించింది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఓటర్ల జాబితాల ప్రక్షాళన(ఎస్‌ఐఆర్)ను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పదుల లక్షల సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు జరిగింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో కలిసి కోటిమంది మహిళలకు తలా రూ.10వేల చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో వేసి పెద్ద ఎన్నికల అవినీతికి పాల్పడింది. ఏమైతేనేం, అధికారం దక్కించుకుంది. అయితే ముఖ్యమంత్రిగా నితీశ్‌కుమార్‌ను కొనసాగించక తప్పలేదు.

ఏప్రిల్–మే నెల్లలో జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికలు పై ఎన్నికలకు భిన్నమైనవి. అస్సాం, పుదుచ్చేరి మినహా పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు ప్రతిపక్ష పార్టీల పాలనా క్షేత్రాలు. వాటిని సొంతం చేసుకోవటానికి బిజెపి ఇన్ని దశాబ్దాలుగా చేసిన ప్రయత్నాలు నిష్ఫలమైనాయి. ఈ పర్యాయం మరింత పట్టుదలకు పోయి, బీహార్ ప్రక్రియను రిపీట్ చేసేందుకు ఎన్నికల కమిషన్ పై ఒత్తిడి తెచ్చింది. 'సర్' ఉత్తర్వు జారీ అయింది. మళ్లీ అదే తంతు. మరణాలు, ఒకటికన్నా ఎక్కువ చోట ఓట్లు, అడ్రసులు మార్పు, పూర్వపు జాబితాతో స్వల్ప వ్యత్యాసాలపేరుతో (లాజికల్ ఇన్‌కన్సిస్టెన్సీస్) లక్షలాది పేర్లు తొలగింపు – నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ఇ.సి.కి – రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద పోరాటమే జరుగుతోంది. కర్ర ఉన్నవాడిదే బర్రె అన్నట్లు అధికారం ఎన్నికల కమిషన్ చేతిలో ఉంది. ఆయా రాష్ట్రాల తుది ఓటర్ల జాబితాలు ప్రకటించబడుతున్నాయి.

అయితే, ఎన్‌డిఎ తన అధికారాన్ని తప్పక నిలుపుకోగలిగిన అస్సాంలో బిజెపి బరితెగించిన మత విభజన రాజకీయాలకు తోడు, ఓటర్ల జాబితాల ప్రక్షాళన నుండి విచిత్రంగా మినహాయింపు పొందింది. ఎందుకీ ద్వంద్వ ప్రమాణాలు? చొరబాటుదారులను (బంగ్లాదేశ్ ముస్లింలని అర్థం) ఓటర్ల జాబితాలనుంచి ఏరివేయటమే 'సర్' ఉద్దేశమని, చొరబాటుదారులను ఏరి వేస్తామని సర్ అమలు చేస్తున్న ఇతర రాష్ట్రాల్లో గంభీర ప్రకటనలు చేస్తున్న హోంమంత్రి అమిత్ షా అస్సాంకు ఎందుకు మినహాయింపు అమలు జరుపుతున్నారు? తమ ఎన్నికల విజయానికి ఏది అనుకూలంగా ఉంటే దాన్ని అమలు చేసేటట్లు ఎన్నికల కమిషన్‌పై కేంద్రప్రభుత్వ ఒత్తిడికి ఇది నిదర్శనం కాదా?

బంగ్లాదేశ్ సరిహద్దు రాష్ట్రమైన అస్సాంకు బంగ్లా చొరబాటుదారుల సమస్య ఏనాటినుంచో ఉంది. విదేశీయుల గుర్తింపుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రిబ్యునళ్లు దాదాపు 19 లక్షలమందిని పౌరసత్వం నుంచి నిలుపుదలలో ఉంచాయి. బిజెపికి వచ్చిన సమస్య ఏమంటే, తాము భారత పౌరులమని రుజువు పత్రాలు సమర్పించలేని హిందువులు కూడా అస్సాంలో 10 లక్షలమంది దాకా ఉన్నారు. వారంతా బిజెపి ఓటర్లు. 'సర్' నిర్వహిస్తే బిజెపిని బలపరిచే హిందువులు సహా భారత పౌరులు కాని అందరూ ఓటర్ల జాబితా నుంచి తొలగించబడతారు.

కాబట్టి ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాల్లో సర్ అమలు చేస్తున్న ఎన్నికల కమిషన్ కేంద్రం ఒత్తిడికి తలొగ్గి అస్సాంను మినహాయించిందనే ఆరోపణ ఎంతో సమంజసంగా ఉంది. పౌరసత్వ చట్టం నిబంధనలు, సుప్రీంకోర్టు ప్రత్యేక పర్యవేక్షణ దృష్ట్యా అస్సాంకు వేరుగా సర్ ఉత్తర్వు జారీ చేస్తామని ఇసి చెబుతోంది. అస్సాంలో సర్ చేబట్టకపోవటం బిజెపికి లాభం, ఇతర రాష్ట్రాల్లో సర్ నిర్వహించటం బిజెపికి లాభం. ఈ వాస్తవాన్ని ఓటర్లు గమనించకపోరు. బిజెపికి తగిన బుద్ధి చెప్పకపోరు!



## ఇండియా బ్లాక్ భేటీ అవ్వాలి

**లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే ఇండియా బ్లాక్ పని మొదలవుతుంది.. అప్పటి వరకు, ఎవరి మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ ఉండదు. ఇండియా బ్లాక్‌లో వాళ్ళు ఏమి చేస్తున్నారో ఎవరికీ తెలియదు. దేశంలో చాలా సమస్యలు ఉన్నాయి.. ట్రంప్‌కు మోదీ గులాంగా మారారు. సరెండర్ అయ్యారు. కానీ ఇండియా బ్లాక్ పార్లమెంటులో గొంతు పెంచడానికే సరిపోదు. రాహుల్ గాంధీని పార్లమెంటులో మాట్లాడనివ్వరు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాదు, అంతకు ముందు కూడా ఇండియా బ్లాక్ చురుకుగా ఉండాలని మేము కోరుకుంటున్నాము. అభిప్రాయాలు చెప్పుకునేందుకు ఇండియా బ్లాక్ సమావేశం జరగాలి**

- శివసేన(యుబిటి) ఎంపి సంజయ్ రౌత్

# ఆర్‌ఎస్‌ఎస్ విద్వేష చరిత్రకు వందేళ్ళు !



ప్రొ॥ దేవరాజు మహారాజు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్ళ (1925 – 2025) ఉత్సవాల్ని ప్రారంభిస్తూ ఈ దేశ ప్రధాని దేశ ప్రజలకు ఒక గొప్ప సందేశమిచ్చారు. "స్వాతంత్ర్య పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ వీరోచితంగా పోరాడిందనీ, ఎంతోమంది బలిదానాలు చేశారని" ఢంకా బజాయించారు. పదకొండేళ్ళుగా ఆయన అలా బజాయిస్తున్నందువల్లనే ఈ దేశ ప్రజలు ప్రేమగా అబద్ధాల విశ్వగురువుగా కీర్తిస్తున్నారు. ఒకప్పుడు మాటిమాటికీ బ్రిటీష్ ప్రభుత్వపు – ఆ తర్వాత నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాల కాళ్ళా వేళ్ళా పడి క్షమాపణ కోరుతూ వారి దయాదాక్షిణ్యాల మీద బతికిన ఆర్‌ఎస్‌ఎస్ వారు ఇప్పుడు చరిత్రను వక్రీకరించాలనుకుంటున్నారన్నమాట! ఆ సందర్భంలోనే కావాలనే ప్రధాని అలా మాట్లాడారన్నమాట!! ఆ సందర్భంలోనే ఆయన విడుదల చేసిన వందరూపాయల నాణాన్ని జాగ్రత్తగా గమనించండి. నాణెం మీద భారతమాత జాతీయ జెండాకు బదులు ఆర్‌ఎస్‌ఎస్ జెండా పట్టుకుని ఉంది. కింద ఇంగ్లీషు స్పెల్లింగ్ గమనించండి. రాష్ట్రీయ స్వం–సేవక్ అని ఉంది. అందులో వై, ఎ– అక్షరాలు తప్పిపోయాయి. అందుకే స్వయం కాలేకపోయింది. అంటే దాన్ని ఎవరో ఎంటైర్ పొలిటికల్ సైన్స్‌లో యం.ఎ. డిగ్రీ సృష్టించుకున్న వాడే ఇంగ్లీషు రానివాడే రాసి ఉంటాడు.

ఇకపోతే, గత ఎన్నికలలో ఓట్ల (చోరీ) – దొంగతనం భారీఎత్తున జరిగిందనీ, సి.సి.ఫుటేజ్ బయటపెట్టాలని రాహుల్‌గాంధీ, ఇంకా ఇతర ప్రతిపక్షాలూ డిమాండ్ చేశాయి. దాంతో ఈ ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి–ఎన్‌డిఎ కూటమి అక్రమంగా ఎలా అధికారంలోకి వచ్చిందో ప్రపంచానికి తేటతెల్లమయింది. బీహార్, ముజఫర్‌పూర్, భగవాన్‌పూర్‌లో ఒకే ఇంటి నెంబరుకు 250 మంది ఓటర్ల పేర్లు నమోదుకావడంపై జర్నలిస్ట్ అజిత్ అంజుమ్‌తో చాలామంది ప్రశ్నలు లేవనెత్తారు. ఇది ఎలా సాధ్యమో ఈ.సి. వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ కులాల ఓటర్లు, వందలాది పిల్లలు ఒకే ఇంట్లో ఉంటున్నట్టు రికార్డులు చూపుతున్నాయంటే అసలు ఇది ఇల్లేనా? లేక ఊరా? అని ప్రశ్నించిన దానికి సమాధానం లేకపోగా ఈ.సి. ఒక పనికిరాని వివరణ ఇచ్చింది. "మహిళల ప్రయివసీ కారణంగా సి.సి.ఫుటేజ్ ఇవ్వలేమని" ఈ.సి. ప్రకటించింది. పోలింగ్ బూత్‌లు ఏమైనా డ్రెస్‌లు మార్చుకునే గదులా? దేశ ప్రజలకు ఏమాత్రం ఆసక్తిలేదు. పైగా స్కూలు పిల్లలు పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలు మార్చి, రాబోయే తరాల్ని తమలాగే అంధ భక్తులుగా, అజ్ఞానులుగా తయారు చేయాలన్నది ప్రస్తుత పాలకుల ఎడ్యుకేషన్ పాలసీ. ఇలాంటి విషయాలను దేశ పౌరులు తీవ్రంగా అడ్డుకోవాల్సి ఉంది. తమను తామే కాదు, రాబోయే తరాల్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరం వచ్చింది. సందర్భం వచ్చింది గనక, ఆరెస్సెస్ ఆవిర్భావం స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర గురించి ఈ దేశ ప్రజలు తప్పక వాస్తవాలు మాట్లాడుకోవాలి, ఆ అవసరాన్ని ప్రధానే కల్పించారు మరి!! ఒక్కసారి చరిత్ర పుటలు వెనక్కి తిప్పి ఈ దేశానికి ఆర్‌ఎస్సెస్ చేసిందేమిటో బేరీజు వేసుకుందాం!

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్‌సింగ్, సచ్చీంద్రనాథ్ సన్యాల్, చంద్రశేఖర ఆజాద్, సుఖ్‌దేవ్ థాపర్‌లు. వీరంతా కలిసి నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి 1928లో న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లలో ఒక విప్లవ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్‌ఎస్‌ఆర్‌ఎ) దీన్నే హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ – అని కూడా వ్యవహరించేవారు. నాటి యువకులంతా ఎక్కువ సంఖ్యలో ఆకర్షింపబడి, ఇందులో భాగస్వాములయ్యేవారు. అలా సభ్యుడయినవాడే కేశవ్ బలిరామ్ హెడ్గేవర్. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే మనస్తత్వమున్న హెడ్గేవర్ త్వరలోనే తన బుద్ధి బయటపెట్టుకున్నాడు. తను ఉన్న హెచ్‌ఎస్‌ఆర్‌ఎ వివరాలన్నీ రహస్యంగా బ్రిటీష్ అధికారులకు చేరవేయడం ప్రారంభించాడు. ఆరకంగా బ్రిటీష్ గూఢచారిగా మారిపోయాడు. నాటి బ్రిటీష్ వారి ప్రోద్బలంతో 27 సెప్టెంబర్ 1925న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) స్థాపించాడు. ఇది నాటి బ్రిటీష్ పాలకులకు అనుకూలంగా పనిచేయడానికి ఏర్పడిన సంఘం. హిందుత్వను బలపరచడం దాని ధ్యేయం. హెచ్.ఎస్.ఆర్.ఎ.కు పూర్తి వ్యతిరేకం!

బ్రిటీష్‌కు వ్యతిరేకంగా ఎవరూ ఏవిధమైన ఉద్యమాలు చేయకుండా అరికట్టడం ఆనాటి ఆర్‌ఎస్‌ఎస్ విధి! అందువల్ల నాటి స్వాతంత్ర్యోద్యమాన్ని దొంగదెబ్బ తీసినవాడు కేశవ్ బలరామ్ హెడ్గేవర్. దొంగే దొంగా.. దొంగా అని గగ్గోలుపెట్టినట్టు ఆనాటి నుంచి, ఈనాటి వరకు ఇలాంటి దేశద్రోహులే తమని తాము 'దేశభక్తులు'గా ప్రకటించుకుంటున్నారు. పైగా మిగతా వారెవరూ దేశభక్తులు కారని, అది తమకు మాత్రమే చెందిన పేటెంట్ హక్కు అయినట్టు వ్యవహరిస్తున్నారు.9 ఆగస్టు 1925న జరిగిన 'కకోరి రైలు దోపిడీ'కి సంబంధించిన విచారణలో హెడ్గేవర్ బ్రిటీష్‌వారికి పూర్తి సహకారం అందించాడు. రాంప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అశ్ఫఖుల్లా ఖాన్‌లకు 19 డిసెంబర్ 1927న మరణ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. మరో 16 మందికి దీర్ఘకాలిక జైలు శిక్షలు, మరో నలభైమందికి వివిధ శిక్షలు పడడానికి కారణమయ్యాడు. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఈ ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తులు నేడు దేశభక్తి మీద భాషణలిస్తున్నారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ప్రకటించిన మ్యానిఫెస్టో "ద రెవల్యూషనరీ" కకోరి కుట్ర కేసులో బ్రిటీష్‌వారికి ఒక సాక్ష్యమైంది. మరణ శిక్షను అనుభవించిన బిస్మిల్, అశ్ఫఖుల్లాలు విప్లవకవులు. వీరి రచనల్ని భగత్‌సింగ్ అభిమానించేవాడు.

స్వాతంత్ర్య సమరంలోకి దూకి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధపడ్డ భారతీయ యువకుల్ని అదుపు చేయడానికి వారి ధ్యేయాన్ని, గమ్యాన్ని మార్చడానికి హెడ్గేవర్ అనే "దేశ భక్తుడు" చాలా శ్రమించాడు. అహింసా సిద్ధాంతంతో బ్రిటీష్ తుపాకి తూటాలకు సైతం భయపడక ఎదురొడ్డి నిలబడ్డ దేశ ప్రజల మనోధైర్యం ముందు హెడ్గేవర్ – ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు పనిచేయలేదు. స్వాతంత్ర్యం ప్రకటించబడింది!! మూడు రంగుల జెండాను జాతీయ పతాకగా స్వీకరించడం జరిగింది. విధిలేక మొదటి సంవత్సరం జాతీయ జెండాను ఎగరేసిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ హెడ్గేవర్ మరుసటి సంవత్సరం నుండి దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం ప్రారంభించాడు. ఆర్‌ఎస్‌ఎస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 14 ఆగస్టు 1947 సంచికలో ఈ విధంగా ప్రకటించారుః

'ఏదో అదృష్టం కలిసొచ్చి స్వాతంత్ర్యం సాధించుకున్న వీరికి మరో ముఖ్యమైన విషయమేదీ కనబడలేదు. ఓ మూడు రంగుల జెండాను జాతీయ జెండాగా ఆమోదించుకున్నారు. ఆ జెండాను హిందువులు ఎన్నటికీ గౌరవించరు. మూడు అనే సంఖ్య చాలా అశుభమైంది. జాతీయ పతాకం మీద ఉన్న మూడు రంగులు దేశ ప్రజల మానసిక స్థితి మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపగలవు. ఫలితంగా దేశ భవిష్యత్తు దుర్భరంగా ఉంటుంది–'' అని!

ఇన్నేళ్ళ స్వతంత్ర భారతదేశంలో త్రివర్ణ పతాకంతో దేశం ఎప్పుడూ ఎక్కడా కష్టాలు ఎదుర్కోలేదు. స్వతంత్రంగా గర్వంగానే నిలబడింది. ఇక కష్టాలంటే అవి ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపిల అనాలోచిత నిర్ణయాల వల్ల వచ్చినవే – వస్తున్నవే! జాతీయ జెండాపై వారి అభిప్రాయం అలా ఉంది. కాబట్టే, ప్రధాని మోడి ఒక యోగా డే సందర్భంగా జాతీయ జెండాతో చెమట తుడుచుకుని దేశాన్ని, దేశ ప్రజల మనోభావాల్ని అవమానపరిచారు. ఎంతైనా ఆయన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తే కదా? హెడ్గేవర్ వారసత్వం ఎక్కడికిపోతుందీ? కేశవ్ బలరామ్ హెడ్గేవర్ తర్వాత మాధవ్ సదాశివ్ (ఎమ్మెస్) గోల్వాల్కర్ సంఘ్ చాలక్ బాధ్యతలు (1940) తీసుకున్నాడు. ఈయన హెడ్గేవర్ కన్నా మరో అడుగు ముందుకేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తడంతో పాటు, దేశప్రజల మనసుల్లో విషబీజాలు నాటాడు. దేశంలో అత్యధికులు హిందువులు కాబట్టి, వారిని ఏకం చేయడం కోసం అల్పసంఖ్యాకుల పట్ల ద్వేషభావం వ్యాప్తిచేశాడు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశభక్తి కాదని, హిందూ మతాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవడమే దేశభక్తి అని నూరిపోశాడు.

దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే .. అందులో పాల్గొనగూడదని తన సంఘ్‌పరివార్ సభ్యులకు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంతవరకు పనిచేసింది. ఫలితంగా "1942లో బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటును అణచివేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది"– అని నాటి బ్రిటీష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఒక ప్రశంసా పత్రం అందించింది. ఇవి చరిత్రలోని వాస్తవాలు!, పుస్తకాలు చదివినా, ఇంటర్నెట్‌లో వెతికినా ఈ వివరాలన్నీ దొరుకుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ఆ మూలసూత్రాలతోనే పనిచేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రను గ్రంథస్థం చేసిన సి.పి.బిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. హిట్లర్, ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడే వారని తెలియజేసింది ఈయనే!, గాంధీజీ హత్య నేపథ్యంలో 4 ఫిబ్రవరి 1948న ఆర్‌ఎస్‌ఎస్ రెండోసారి ఈ దేశంలో నిషేధానికి గురయ్యింది. అప్పుడు "భారత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామని, జాతీయపతాకాన్ని గౌరవిస్తామని" ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 11 ఏప్రిల్ 1949న నిషేధాన్ని ఎత్తివేయాల్సిందిగా అభ్యర్థిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధేయపడింది. మూడు నెలల తర్వాత నెహ్రూ ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసింది. అయినా కూడా, తన ప్రతిజ్ఞకి తానే విలువలేకుండా చేసుకున్న సంఘ్‌పరివార్, ఈ రోజుకు కూడా జాతీయ జెండాను గౌరవించదు. రాజ్యాంగానికి విరుద్ధంగా తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉంది. దేశాన్ని ముక్కలు చేయడంలో ఆనాడు ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యభూమికను పోషించింది. విభజన తర్వాత కూడా దేశంలో అశాంతి నెలకొల్పుతూనే ఉంది. స్వాతంత్ర్యోద్యమంలో కలిసి పోరాడిన హిందూ, ముస్లింల మధ్య ద్వేషాన్ని రగిలించి, మతకలహాలు సృష్టించింది. ప్రస్తుతం కూడా ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. స్వాతంత్ర్యం సాధించుకుని 77 ఏళ్లు పూర్తయినా ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం అభివృద్ధి నిరోధక శక్తిగా నిలిచే ఉంది.

భారత రాజ్యాంగంపట్ల ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి అభిప్రాయముందో చూద్దాం! వారి అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 30 నవంబర్ 1949 నాటి సంచికలో ఇలా ప్రకటించుకుంది. " భారత దేశానికి కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరమే లేదు. పురాతన కాలంలో మనువు రాసిన గొప్ప గొప్ప సూత్రాలు మనకు ఉండనే ఉన్నాయి. నేటి రాజ్యాంగంలో వాటి ప్రస్తావన లేకపోవడం విచారించదగ్గ విషయం. ప్రపంచానికి దారిచూపగల 'మనుధర్మ శాస్త్రం'– ఈ రాజ్యాంగ నిపుణులకు కనీసం గుర్తుకురాకపోవడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం! అన్న ఆర్‌ఎస్‌ఎస్, అంతటితో ఆగలేదు. 6 ఫిబ్రవరి 1950 నాటి సంచికలో " ఈ హృదయాలను పరిపాలించే మనువు" శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించింది. అందులో ఇలా ఉంది–" ఈ దేశంలో మనువుకు రోజులు చెల్లిపోయాయి అని డా.బి.ఆర్.అంబేద్కర్ బొంబాయిలో అన్నట్టు తెలిసింది. కానీ, అది జరగని పని! దాన్ని జరగనివ్వకుండా!! ప్రతి హిందువు మనసులో మనువు ఎల్లప్పుడూ ఉంటాడు. మనువు సూత్రాలు జన జీవితంలో కొనసాగుతాయి. శూద్రులు కూడా మనువును పూజిస్తారు. సమానత్వం గనక ఆచరణలోకి వస్తే, దేశం బలహీనపడుతుంది. వ్యక్తులు దుర్భలులవుతారు."

26 జనవరి 1950న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో బాబా సాహెబ్ అంబేద్కర్ " మన రాజ్యాంగం దేశంలో సమానత్వాన్ని సాధిస్తుంది" అని అన్నందుకు ఆర్‌ఎస్‌ఎస్ పైవిధంగా స్పందించింది. రాజ్యాంగ వ్యతిరేకతను బాహాటంగా ప్రకటించింది. తమకు మనుధర్మ శాస్త్రమే అనుసరణీయమని చెప్పుకుంది. అందుకే చూడండి, బలహీనవర్గాలు ఆర్‌ఎస్‌ఎస్ కోసం ఎన్ని త్యాగాలు చేసినా, దాని అధినేతలుగా కేవలం బ్రాహ్మణులే కొనసాగుతూ ఉండడం ఇప్పటికీ మనం చూస్తున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా పాల్గొనేవారిని అడ్డగించి, ఎంతోమంది దేశభక్తుల మరణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన ఆర్‌ఎస్‌ఎస్‌వారు, తమకు తాము దేశభక్తులమని ప్రకటించుకోవడాన్ని ఈ దేశప్రజలు అంగీకరిస్తారా? గాంధీజీ హంతకుడికి తమ సంస్థకు ఎలాంటి సంబంధమూ లేదని ఆనాడు ప్రకటించుకుని, తర్వాత కాలంలో మరి ఎందుకు నాథూరామ్ గాడ్సేను ఆరాధిస్తున్నారు? ఇవన్నీ చూస్తే, దేశంలో హిందుత్వ ఉగ్రవాదం పెచ్చరిల్లిపోవడానికి, దేశ ఆర్థిక ప్రగతి దిగజారుతూ పోవడానికి, అతిపెద్ద ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచిపారిపోవడానికీ, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలే కారణమని ఈ దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. తీవ్రవాదులు, దేశద్రోహులూ కలిసి తమకు తాము ' దేశభక్తులు'గా ప్రకటించుకుంటూ ఉంటే అసహ్యంగానూ, వికారంగానూ ఉంది. పైగా దేశభక్తులెవరన్నది వాళ్లే నిర్ణయిస్తూ ఉండడం వికృతాలలో కెల్లా వికృతం, వీళ్లు దేశభక్తి అనే పదానికే అర్థం మార్చేశారు. వారి కుట్రలను ఛేదించడం ఈ దేశప్రజల తక్షణ కర్తవ్యం! భిన్నత్వంలో ఏకత్వం సాధించుకున్న ఈ దేశం, తన అస్థిత్వాన్ని కోల్పోకముందే దేశ ప్రజలు అప్రమత్తులై సమాయత్తమవ్వాలి. ఈ దేశాన్ని సర్వహిత, సమభావంతో సమున్నతంగా నిలుపుకోవాలి! తప్పదు..

*సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.*



## సూర్య కేంద్రక సిద్ధాంత సృష్టికర్త నికోలస్ కోపర్నికస్

సైన్సు చరిత్రలో ఫిబ్రవరి నెలకు చాలా ప్రాముఖ్యత వుంది. జాతీయ సైన్స్ దినోత్సవం ఈ నెలలో జరుపుతారు. ఎడిసన్, డార్విన్, గెలీలియో, కోపర్నికస్ వంటి గొప్ప శాస్త్రవేత్తలు ఈ నెలలోనే జన్మించారు. సివి రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్నది ఈ నెలలోనే. జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు కూడా ఈ నెలలోనే ఏర్పడ్డాయి. ఫిబ్రవరి 19, 1473లో థార్న్ అనే పట్టణంలో కోపర్నికస్ జన్మించాడు. 1492లో ఆయన క్రాకోవ్ విశ్వ విద్యాలయంలో చేరాడు. ఆల్బెర్ట్ బ్రుడ్జ్ విస్కీ దగ్గర శిష్యరికం నెరిపాడు. ఇటలీలో బొలోగ్నా విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రం, గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రం అభ్యసించాడు. గ్రీకు భాష నేర్చుకుని ఎన్నో గ్రంథాలను కంఠస్థం చేశాడు.

రోమ్ విశ్వవిద్యాలయంలో 29 ఏళ్ళ వయస్సులో 1502 లో ఖగోళ శాస్త్ర నిపుణుడిగా చేరాడు. విశ్వానికి కేంద్రం భూమి, సూర్యుడు, ఈ రెంటిలో ఏది? అనే అనుమానం పట్టుకుంది. అరిస్టాటిల్, టోలెమీలు భూ కేంద్రక సిద్ధాంతాన్ని బలపరిచారు. పైథాగరస్ సూర్య కేంద్రక సిద్ధాంతమే సరి అయిందని నమ్మాడు. ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో కోపర్నికస్‌కు అర్థం కాలేదు. ఈ విషయంపై ఆలోచిస్తూ రాజీనామా చేసి ప్రోవెన్ బర్గ్‌లో కానన్ అనే మతాధికారిగా చేరాడు. వైద్యునిగా ఎంతో ప్రతిష్ఠ నార్జించాడు. న్యాయమూర్తిగా రాణించాడు. క్లిష్ట సమయాలలో సలహాలనిచ్చి పోలెండ్ ఆర్థిక దుస్థితిని తొలగించాడు.

క్రీ.శ.1520 లో అల్లెన్ స్టెయిన్ కాసిల్ కు గవర్నర్‌గా కూడా పనిచేసి ట్యూటానిక్ వీరులను ఎదుర్కొన్నాడు. ఈ విధంగా ప్రజాసేవ, మతసేవ చేస్తున్నప్పటికీ శాస్త్ర సేవమాత్రం మానలేదు. సూర్యకేంద్ర సిద్ధాంతాల నమూనాలను, సిద్ధాంతాలను, ఇతనికంటే ఎన్నో వందల ఏండ్లకు మునుపే ఆర్యభట్టు, ఒమర్ ఖయ్యాంలు, ప్రతిపాదించారు, కాని, గ్రహాల కదలికలు ఆధారంగా గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయని మొట్టమొదట నిరూపించింది ఇతనే.

భూమి తన అక్షంపైనే తిరుగుతుందని,అందువల్లే రాత్రి పగలూ ఏర్పడుతున్నాయని తెలిపాడు. భూభ్రమణ, పరిభ్రమ ణాల వల్లే శీతోష్ణ స్థితులు, ఋతువులు మారుతున్నాయని గ్రహించాడు. అయితే అప్పట్లో ఎవరూ ఇతన్ని నమ్మలేదు. ప్రారంభంలో ఆయన వీటిని ప్రచారంచేసే క్రమంలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నారు. కానీ చివరికి ఆయన ధైర్యంగా సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. వీటిని ఆయన ఓ పుస్తక రూపంలోకి తీసుకుని వచ్చాడు. ఈ పుస్తకంలోని అంశాలు సంఘ విద్రోహాన్ని సూచిస్తాయేమోనన్న భయంతో ప్రచురణ కర్తలు 'దీనిని విజ్ఞాన గ్రంథంగా పరిగణించగూడదు' అని ముందుగానే చెప్పుకున్నారు. కాని ఈ విషయం తెలియకుండానే 1543 మే 21లో కోపర్నికస్ కన్నుమూశాడు.

కోపర్నికస్ కంటే కొన్ని శతాబ్దాల ముందు ఎంతోమంది భారతీయ, గ్రీకు మరియు ముస్లిం శాస్త్రవేత్తలు సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని గురించి ప్రస్తావించినా ఇతని రచనల్లో సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని సైద్ధాంతికంగా నిరూపించడంతో ప్రాధాన్యం సంతరించుకున్నాడు. దీంతో ఆధునిక సైన్సులో కోపర్నికస్ విప్లవం ఆరంభమైంది. కోపర్నికస్ అందించిన ఈ వివరాలే తరువాత రంగంలోకి దిగిన టైకో బ్రాహి, కెప్లర్, గెలీలియో, న్యూటన్, ఐన్ స్టీన్ వంటి మహామహులకు పునాది రాళ్ళుగా నిలిచాయి. చరిత్ర గమనాన్ని మార్చాయి. తర్వాత జరిగిన పరిశోధనల్లో సూర్యుడు విశ్వానికి కేంద్రం కాదని, మన సౌర కుటుంబానికి కేంద్రం అని తేలింది. సూర్యుడు కూడా ఒక నక్షత్రమేనని, ఇటువంటి నక్షత్రాలు మన విశ్వంలో చాలా ఉంటాయని శాస్త్రవేత్తలు తేల్చారు.

*(ఫిబ్రవరి 19, జయంతి సందర్భంగా)*

ఎం.రాం ప్రదీప్

# గ్రంథాలయాలను విస్మరిస్తే విజ్ఞాన సంక్షోభం

అమెరికాలోని 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్' 17 కోట్ల పుస్తక నిధితో ప్రపంచ మేధో గనిగా విరాజిల్లుతుంటే, చైనా, రష్యా, జపాన్ వంటి అగ్రరాజ్యాలు తమ గ్రంథాలయాలను కృత్రిమ మేధస్సుతో అనుసంధానించి అజేయమైన విజ్ఞాన కోటలుగా మలుచుకున్నాయి. ఫిన్లాండ్ తన పౌరుల మేధో వికాసమే దేశ సంపదగా భావించి అత్యుత్తమ గ్రంథాలయాలను నిర్మిస్తుంటే, ఆస్ట్రేలియా, ఇరాన్, తుర్కియే వంటి దేశాలు చారిత్రక వారసత్వాన్ని అత్యాధునిక సౌకర్యాలతో మేళవించి పాఠకులకు అక్షర నీరాజనాలు పలుకుతున్నాయి. కానీ, మన దేశంలో ప్రతి మూడు వేలమందికి ఒక గ్రంథాలయం ఉండాలన్న అంతర్జాతీయ ప్రమాణం అటకెక్కింది. 1960 చట్టం నిర్దేశించిన 8 శాతం సుంకం నిధులు అందక, అక్షర దేవాలయాలు వెలవెలబోతున్నాయి.

మున్సిపాలిటీల నుండి రావాల్సిన వందలకోట్ల బకాయిలపై జిఒ సంఖ్య 202 ఉన్నా, గూగుల్, సోషల్ మీడియా మత్తులో పాలకుల నిర్లక్ష్యం వల్ల పల్లెల్లోని విజ్ఞాన కేంద్రాలు శిథిలావస్థకు చేరి మౌనంగా రోదిస్తున్నాయి.


2014 జాతీయ గ్రంథాలయ మిషన్ నిధులు అందని ద్రాక్షగానే మిగిలిపోవడం భావితరం మేధో దారిద్ర్యానికి సంకేతం.

**నిధుల బందీలో విజ్ఞాన క్షేత్రాలు:** తెలుగు నేలపై గ్రంథాలయాల నిర్వహణకు 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీ చట్టం' ఒక రాజ్యాంగం వంటిది. ఈ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం, స్థానిక సంస్థలు వసూలు చేసే ఆస్తి పన్నులో ఎనిమిది శాతం మొత్తాన్ని తప్పనిసరిగా గ్రంథాలయ సుంకంగా చెల్లించాలి. అయితే, దశాబ్దకాలంగా వందల కోట్ల రూపాయల బకాయిలు పురపాలక సంఘాల ఖజానాల్లోనే బందీ అయ్యాయి. 2011 నాటి జీవో సంఖ్య 202 ద్వారా ఈ బకాయిలను నేరుగా జమ చేయాలన్న ఆదేశాలు ఉన్నా, అమలు లో పాలకుల చిత్తశుద్ధి లోపించింది. ఫలితంగా విజ్ఞాన క్షేత్రాలు కనీసం దినపత్రికలు కొనడానికి, విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కూడా అల్లాడుతున్నాయి.

**గణాంకాల సాక్షిగా విజ్ఞాన సంక్షోభం:**

ప్రస్తుతం భారతదేశంలో దాదాపు 54,856 ప్రభుత్వ గ్రంథాలయాలు ఉన్నాయని జాతీయ గ్రంథాలయ మిషన్ నివేదిక చెబుతున్నా, జనాభా ప్రాతిపదికన ఇవి ఏమాత్రం సరిపోవు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ప్రతి మూడు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాల్సి ఉండగా, మన దేశంలో పరిస్థితి దీనికి భిన్నంగా ప్రతి 80 వేలమందికి ఒక కేంద్రం మాత్రమే అందుబాటులో ఉంది.

తెలుగు రాష్ట్రాల్లోని 1,100 పైచిలుకు గ్రంథాలయాలలో 40 శాతం పైగా సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. జిఒ సంఖ్య 110వంటి నిబంధనలు గ్రంథాలయాల బలోపేతానికి ఉద్దేశించినా, అవి నిధుల లేమితో నీరుగారిపోయాయి. కొత్త పుస్తకాల కొనుగోలు లేక, ఉన్న పుస్తకాలు చెదలు పడుతుండటంతో పాఠకులు ఆలయ కేంద్రాల వైపు చూడటమే మానేశారు.



అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రంథాలయాలను కేవలం పుస్తకాల నిలయాలుగా కాకుండా సామాజిక విజ్ఞాన కేంద్రాలుగా చూస్తారు. ఫిన్లాండ్ తన బడ్జెట్‌లో గ్రంథాలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండగా, చైనా, బ్రిటన్ జాతీయ గ్రంథాలయాలు డిజిటలీకరణలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తున్నాయి. అక్కడ గ్రంథాలయాలను ఉచిత అంతర్జాల సదుపాయం, 3డి ప్రింటింగ్‌తో కూడిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. మన దేశంలో 2014లో ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ ద్వారా రూ.400 కోట్లు కేటాయించినా, ఆశించిన స్థాయిలో ఆధునికీకరణ జరగలేదు. విదేశాల్లో లైబ్రరీ అంటే అది ఒక గౌరవప్రదమైన విజ్ఞాన వేదికగా పరిగణిస్తున్నారు.

**గూగుల్‌లో దొరకని అసలైన జ్ఞానం:**

నేడు స్మార్ట్‌ఫోన్లు లైబ్రరీలను మింగేస్తున్నాయన్నది కఠిన వాస్తవం. సగటు భారతీయుడు రోజుకు 6–7 గంటలు మొబైల్ తెరలపైనే గడుపుతున్నాడు. కానీ గూగుల్ వంటి సెర్చ్ ఇంజన్లు సమాచారాన్ని మాత్రమే ఇవ్వగలవు కానీ గ్రంథాలయాలు ఇచ్చే ప్రామాణికమైన జ్ఞానాన్ని, అనుభూతిని ఏ యంత్రం కూడా భర్తీ చేయలేదు.

సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం అంతా ధృవీకరించబడినది కాదు, పైగా కృత్రిమ మేధస్సు కాలంలో సమాచార విశ్వసనీయత మరింత అస్పష్టంగా మారుతోంది. గ్రంథాలయాల్లో ఉండే మూల గ్రంథాలు, గెజిట్లు, చారిత్రక ఆధారాలకు ఉండే విశ్వసనీయత ఏ అంతర్జాల వేదిక కూడా అందించలేదు. దృశ్య మాధ్యమాల పట్ల ఆకర్షితులవుతున్న నేటి తరం లోతైన అధ్యయనం, విశ్లేషణను విస్మరిస్తూ మేధోపరమైనపరిణతిని కోల్పోతోంది.

**రేపటి తరానికి అక్షర నిధి:**

గ్రంథాలయాలకు పూర్వ వైభవం రావాలంటే నిధులు ఇవ్వటంతోపాటు వాటి నిర్వహణలో సమూల మైన విప్లవం రావాలి; అందుకోసం యుద్ధ ప్రాతిపదికన గ్రంథపాలకుల పోస్టులను భర్తీ చేస్తూనే, ప్రతి విజ్ఞాన కేంద్రాన్ని ఉచిత అంతర్జాల సదుపాయం, 'రీడింగ్ కేఫ్' వసతులు, మేధో చర్చా వేదికలతో 'వీన జ్ఞాన హబ్'లుగా తీర్చిదిద్దాలి. నెలకోసారైనా విద్యార్థుల కోసం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ, స్థానిక రచయితల సమ్మేళనాలకు వీటిని వేదికలుగా మలచాలి. యువత నేతృత్వంలో 'రీడర్స్ క్లబ్'లు ఏర్పాటు చేసి పుస్తక సమీక్షలు నిర్వహించాలి.అక్షరాస్యత అంటే కేవలం సంతకం చేసే నేర్పు కాదు, నిరంతరం విజ్ఞానాన్ని అన్వేషించే తపన అని గుర్తించినప్పుడే అక్షర దేవాలయాలకు పరమార్థం సిద్ధిస్తుంది. అక్షరం జీవించి ఉంటేనే ప్రజాస్వామ్యం పరిమళిస్తుంది, పుస్తకం చేతిలో ఉంటేనే సామాన్యుడి ఆలోచనలకు పదును దక్కుతుంది.

**ఫిరోజ్ ఖాన్, 9640466464**



## మేళ్ళచెర్వు శివాలయాన్ని సందర్శించిన మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు) :** రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం మేళ్ళచెరువు శివాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు, చైర్మన్, ఇఓలు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతీయ స్థాయి ఎడ్ల పందాల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేళ్ళచెరువు జాతరకు ప్రభుత్వం తరపున కోటి రూపాయలు మంజూరు చేయించానని చెప్పారు. ఇక్కడికి రావడం ఎడ్ల పందెలా పోటీని తిలకించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేయించి సస్యశ్యామలంగా మార్చి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పెళ్ళి లచ్చయ్య, ఇఓ రాంచందర్ రావు, దొంతగాని శ్రీనివాస్, నర్సిరెడ్డి, వీరారెడ్డి, భాస్కర్ రెడ్డి, అరుణ్‌దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

## ప్రజల మధ్య ఉంటేనే వారి కష్టాలు తెలుస్తాయ్

### సామాన్యుడిలా టీ దుకాణంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్థానిక ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పట్టణంలోని ఓ సాధారణ టీ దుకాణంలో టీ తాగుతూ కనిపించారు. ఎటువంటి ఆడంబరాలు లేకుండా, హంగులు లేకుండా సామాన్యుడిలా కూర్చొని టీ తాగుతూ స్థానికులతో చర్చించడం అక్కడివారిని ఆకట్టుకుంది. ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పటికీ ప్రజల మధ్య ఉండాలని తన ఉద్దేశమని ఈ సందర్భంగా సత్యం పేర్కొన్నారు. టీ తాగుతూ స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పట్టణంలో నీ నిరుద్యోగ యువత సమస్య, పరిశ్రమల కాలుష్యంవల్ల అనారోగ్య పాలవుతున్నారని , రోడ్ల దుస్థితి సమస్య ఇబ్బందులపై పలువురు నివేదించగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పదవి ప్రజల సేవ కోసం మాత్రమే నని ప్రజల మధ్యన ఉంటేనే వారి కష్టాలు తెలుస్తాయని సత్యం వాఖ్యానించారు. టీ దుకాణం వద్ద సాధారణంగా కూర్చొని ఉండటం చూసిన స్థానికులు ఆయన సరళతను ప్రశంసించారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, తీర్పారి వెంకటేశ్వర్లు, బదుల సుధాకర్, రెహమాన్ సాయిలు ఉన్నారు.

## ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల లబ్ధిని పొందేందుకు జిల్లాలో ఉన్న రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకునేలా అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5,54,347 మంది పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు ఉన్నారని,ఇప్పటివరకు 2లక్షల41వేల 39 మంది రైతులు మాత్రమే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని,తక్కిన రైతులందరూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.ఇందుకుగాను రైతులకు అవగాహన కల్పించాలని, మీసేవ లేదా వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర లాగిన్ చేసుకోవాలని చెప్పారు. దీనివలన కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల కింద రైతులు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.రానున్న కాలంలో వ్యవసాయ రంగం మొత్తం డిజిటలైజేషన్ చేయనున్న దృష్ట్యా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని,దీనిని దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి అందరూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని ఆదేశించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,మండల వ్యవసాయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాల ప్రారంభం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** శ్రీ మత్స్యయోనిధి నికేతనుడు, భక్త కోటి కల్ప వృక్షం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని, ఆలయ అర్చక బృందం పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా వేడుకలకు అంకురార్పణ చేశారు. నేటి నుండి ఈ నెల 28వ తేదీ (ఫాల్గుణ శుద్ధ ద్వాదశి) వరకు 11 రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహించబడనున్నాయి. బ్రహ్మోత్సవాల తొలిరోజు ఉదయం స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సహస్రనామార్చనలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధానార్చకులు, వేద పండితుల బృందం శ్రీ విష్వక్సేనారాధన, స్వస్తీవాచనము, రక్షాబంధన కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) జె.భవాని శంకర్ (ఐఏఎస్), అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ యమ్.హనుమంతరావు (ఐఏఎస్), అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు (ఐఏఎస్), ఆలయ అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# రౌడీయిజం,గంజాయిపై ఉక్కుపాదం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. కోటి 30 లక్షల వ్యయంతో పార్కుల పనులకు శంకుస్థాపన

### పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం అభినందనీయం : బీర్ల




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణం ప్రశాంతతకు మారుపేరుగా ఉండేలా రౌడీయిజం,గంజాయిలపై ఉక్కు పాదం మోపుతామని ,పేదవాడి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటా అని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.బుధవారం ఆయన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్,41వ డివిజన్‌లలో సుమారు కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయనున్న పార్కుల పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో మంత్రి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని పార్కులన్నీటిని మోడల్ పార్కులుగా తీర్చిదిద్దుతామని,రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ఉన్నట్లుగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్, తాగునీటికి అత్యంత ప్రాధన్యత ఇవ్వడం జరుగుతుందని,పట్టణానికి 24 గంటలు మంచినీటి సరఫరా ఉండేలా లతీఫ్ షాబ్ గుట్ట వద్ద ఇదివరకే తాగునీటి సరఫరాకు శంకుస్థాపన చేయడం జరిగిందని,శానిటేషన్ విషయమైఇక పై పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,మేయర్, డిప్యూటీ మేయర్ తో సహా కార్పొరేటర్లు కూడా ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇకపై ప్రభుత్వ విప్,శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. పార్కుల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆహ్లాదంతో పాటు, వాకింగ్ ట్రాక్లు ఏర్పాటు చేయడం సంతోషమని, దీనిని ఆదర్శంగా తీసుకొని ఇతర మున్సిపాలిటీలో సైతం అభివృద్ధి కార్యక్రమాలను చేయాలని ,అలాగే నల్గొండలో తాగునీరు, శానిటేషన్ ,డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం బాగున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర ,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ మహమ్మద్,కార్పొరేటర్లు వేదశ్రీ,సాయి, కేసాని వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.

# గంధమల్ల నిర్వాసితులకు పరిహారం పంపిణీ

### 412 మంది రైతులకు రూ.22.80 కోట్ల చెక్కుల అందజేత

### ఎకరానికి రూ.24.50 లక్షల చెల్లింపు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి ఆయన రైతులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. గంధమల్ల బండ్ పోర్షన్ కింద భూములు కోల్పోయిన 412 మంది రైతులకు, 87 ఎకరాలకు గాను మొత్తం రూ.22,80,58,000 విలువైన చెక్కులను అందజేశారు. రైతులకు ఎకరానికి రూ.24.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గంధమల్ల రిజర్వాయర్ పూర్తి కావడంతో ఎనిమిది మండలాల్లోని దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు అధైర్యపడొద్దని, రిజర్వాయర్ నిర్మాణం తర్వాత ఆయా కుటుంబాలకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గరిష్ట స్థాయిలో పరిహారం అందేలా కృషి చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్వాసితులకు సకాలంలో పరిహారం అందించడం ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. భూసేకరణ ప్రక్రియలో సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, ఈఈ రఘునాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, తుర్కపల్లి తహసీల్దార్ జలకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.


# వేగవంతంగా మాతా, శిశు కేంద్రం భవన నిర్మాణాలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మాతు శిశు కేంద్ర భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖ అధికారులను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మాతా శిశు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోదాడలో నవజాత శిశువును వదిలేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆడ శిశువులను పుట్టగానే వదిలేయడం భాదాకరమని విచారం వ్యక్తం చేశారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉయ్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైతే పిల్లలను వద్దనుకుంటారో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉయ్యాలలో శిశువును ఉంచాలని సూచించారు. కోదాడలో నవజాత శిశువును కాపాడిన ఏఎన్ఎంను కలెక్టర్ అభినందించారు. వచ్చే నెలలోపు మాతా శిశు కేంద్రం పైన నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం మరోసారి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాతా శిశు కేంద్రంలో కావల్సిన సామాగ్రి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని నిత్యం హాస్పటల్‌లో రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, సిఎస్ ఆర్ఎంఓ జనార్థన్ రెడ్డి, డిడబ్ల్యుఓ నరసింహారావు, వైద్యులు పాల్గొన్నారు.

# నిండా మునిగిన బిఆర్ఎస్!



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత కూడా సూర్యాపేట పట్టణంలో ఆ పార్టీకి మంచి పట్టే ఉంది. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గత పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులే ఇందుకు కారణం. ఆ పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు కొదవలేదు. ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించిన తరువాత ఆ పార్టీలో చైర్మన్ పదవి కోసం దాదాపు డజన్‌కు పైగా పోటీపడ్డారు. తమని చైర్మన్ అభ్యర్థిగా ముందే ప్రకటిస్తే ఎన్నికల్లో అన్నీ తామై పార్టీ నుండి పోటీచేసిన అభ్యర్థులను గెలిపించుకొని మరోమారు మున్సిపాలిటీపై పార్టీ జెండా ఎగురవేస్తామని పార్టీ పెద్ద దిక్కు అయిన జగదీష్ రెడ్డికి అనేక మంది ఆశావాహులు చెప్పడం జరిగింది. ఫలానా వ్యక్తి చైర్మన్ అభ్యర్థి అంటూ ప్రకటించలేదు. పార్టీశ్రేణుల్లో మాత్రం మొదట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ అని ప్రచారం సాగింది. ప్రవళిక, ప్రకాష్‌లు ఇద్దరు వేరు వేరు వార్డుల్లో కౌన్సిలర్ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. ఇక మున్సిపల్ పోరు కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య హోరా హోరీగా ఉంటుందని అనుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువుకు కేవలం ఒక గంట వ్యవధిలోనే ఆ ఇరువురు ఒక్కసారిగా తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమైంది. అనంతరం దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ మాతృమూర్తి బిక్కుమళ్ళ మంజుల తమ చైర్మన్ అభ్యర్థి అంటూ పార్టీ వర్గాల్లో మరో ప్రచారం సాగింది. ఈమె పోటీచేసిన 44వ వార్డులో ఘోరంగా ఓటమి చవిచూసింది.

**చెప్పుడు మాటలే చేటు చేసిందా...?**

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్‌లపై సొంత పార్టీలోని కొంత మంది నేతలు మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్‌రెడ్డికి తప్పుడు సమాచారం ఇవ్వడంతో వారు చెప్పిన మాటలు విని ఎన్నికల నుండి పక్కకు తప్పుకోమని చెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఇదే విషయం ప్రకాష్ కూడా వాస్తవమేనని చెప్పడం గమనార్హం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో జరిగిన సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలు జరుగగా మొత్తం 34 వార్డుల్లో కాంగ్రెస్ 9, టిడిపి 12, టిఆర్ఎస్ 4, బిజెపి 4, సిపిఎం 2, సిపిఐ 1, స్వతంత్ర ఇద్దరు గెలుపొందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడుతారని అనుకున్నా ఓటమి పాలైంది. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా కేవలం 9 స్థానాలకే పరిమితం కావడంతో చైర్మన్ స్థానం దక్కలేదు. పార్టీలో 11వ వార్డు నుండి కౌన్సిలర్‌గా గెలిచిన గండూరి ప్రవళిక ప్రకాష్ తమకు చైర్మన్ పీఠం ఇస్తే ఇతర పార్టీల నుండి గెలుపొందిన వారిని తమవైపుకు తిప్పుకొని పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పినా పార్టీ పెద్దలు మాత్రం అందుకు సమ్మతించలేదు. దీంతో ఆయన అధికార టిఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. నలుగురు కౌన్సిలర్ అభ్యర్థుల బలం మాత్రమే ఉన్న ఆ పార్టీలోకి వెళ్ళి కాంగ్రెస్, టిడిపి నుండి గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులను తమవైపుకు తిప్పుకొని ప్రవళిక ప్రకాష్ చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించింది. మరోమారు జరిగిన ఎన్నికల్లో తిరిగి ఆమె చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశించినా జనరల్ స్థానంలో దళిత మహిళ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్‌ను జగదీష్ రెడ్డి చైర్‌పర్సన్‌గా చేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన శాసనసభ్యునిగా ఎన్నికైన ఆయన సూర్యాపేట మున్సిపల్ పీఠాన్ని తిరిగి దక్కించుకోవాలని వ్యూహ రచన చేశారు. దీనిలో భాగంగా ప్రవళిక ప్రకాష్‌కు చైర్మన్ పీఠం ఇస్తామని మొదట మాట ఇచ్చినట్లు సమాచారం. ప్రవళిక ప్రకాష్‌ను తిరిగి చైర్‌పర్సన్‌ను చేస్తామని ప్రకటిస్తే 2014 మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన సంఘటనలే పునరావృతం అవుతాయని తానంటే గిట్టని బిఆర్ఎస్‌లోని కొందరు నేతలు జగదీష్‌రెడ్డికి చెప్పినట్లు చర్చ సాగుతుంది. పార్టీకి పూర్తి మెజార్టీ వచ్చినా కూడా అధికార కాంగ్రెస్‌లోకి వెళ్ళి పార్టీకి వెన్నుపోటు పొడుస్తాడని ఇప్పటికే పలుమార్లు అధికార పార్టీలో కీలకనేతగా వ్యవహరిస్తున్న ఆయన దగ్గరి బంధువుతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. ఇదంతా నిజమేనని నమ్మిన ఆయన ప్రవళిక, ప్రకాష్‌లను నామినేషన్ ఉపసంహరించుకోవాలని ఆదేశించినట్లు అదే పార్టీకి చెందిన పలువురు నేతలు బహిరంగంగా చెబుతున్నారు. ఈ చెప్పుడు మాటలు వినడం వల్లే పార్టీకి చేటు జరిగిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఎన్నికలకు ముందే అభ్యర్థిని ప్రకటిస్తే ఫలితం మరోలా...**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి చైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన విధంగా బిఆర్ఎస్ ముందు ప్రకటిస్తే ఎన్నికల ఫలితాలు మరోలా ఉండేవని ఆ పార్టీకి చెందిన కీలక నేతలు చెబుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో పొరపాట్లు జరగడం, గండూరి ప్రవళిక ప్రకాష్‌లు ఎన్నికల నుండి పక్కకు తప్పుకోవడంతో ఫలితాలు తారుమారు అయ్యాయని పార్టీ లో చర్చ సాగుతుంది. అంగ బలం, ఆర్థిక బలం ఉన్న ప్రవళిక ప్రకాష్‌ను చైర్మన్ అభ్యర్థిగా ప్రకటిస్తే పార్టీకి ఇంత న ష్టం వాటిళ్ళకపోవునని పలువురు పార్టీశ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ మున్సిపాలిటీలో అ త్యధిక స్థానాలు గెలుపొందడానికి ప్రధాన కారణం డబ్బులేనని, ఆర్థికంగా బలంగా లేకపోవడం వల్లే కేవలం 11 స్థానాలకే పరిమితం కావల్సి వచ్చిందని చెబుతున్నారు.



## బడిలో 'కలెక్టర్' మాస్టారు!

### పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించిన హనుమంతరావు

### పెద్ద కందుకూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టర్ అనగానే ఫైళ్లు, సమీక్షలు మాత్రమే కాదు.. అవసరమైతే విద్యార్థుల భవిష్యత్తు కోసం చాక్ పీస్ పట్టి పాఠాలు కూడా చెబుతారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నిరూపించారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాసేపు గణితం ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.పదో తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో ముచ్చటించారు. గణితంలో వారికి ఉన్న పట్టును పరీక్షించేందుకు నేరుగా ప్రశ్నలు సంధించారు. అనంతరం స్వయంగా బ్లాక్ బోర్డుపై లెక్కలు వేసి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభమైన పద్ధతులను బోధించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న తరుణంలో భయం వీడి, ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. 'పదో తరగతి అనేది మీ జీవిత ప్రయాణంలో అత్యంత కీలకమైన మొదటి మెట్టు. దీన్ని అధిగమిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.' అని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. సిలబస్ పురోగతిపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకే విద్యార్థులకు 'వేకప్ కాల్' చేసి నిద్రలేపుతున్నారా? అని ఆడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రతి విద్యార్థి బడిబాట పట్టేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోతరాజు కుంటను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో నీటి వనరుగా ఉన్న పోతరాజు కుంటను పునరుద్ధరించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రోజున పట్టణంలో జరిగిన పట్టణ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పోతరాజు కుంటను డంపింగ్ కేంద్రంగా ఉపయోగించిన కారణంగా కుంట పూర్తిగా చెత్తతో నిండిపోయి నీటి నిల్వ ఉండకుండా పోయిందన్నారు. వర్షాల కారణంగా కుంటలో చేరాల్సిన నీరు కుంటను ఆనుకుని ఉన్న జాతీయ రహదారి పైకి చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుందన్నారు. పట్టణంలో నత్తనడకన నడుస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిలా సత్యం, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, పి దేవేందర్, ఏళ్ళ రవి, కృష్ణ, మెండె నర్సింహ్మా, కన్నెబోయిన సాయిలు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

**ప్రజాపక్షం/దేవరకొండ :** వ్యవసాయ శాఖ వ్యవసాయ యాంత్రికరణ (ఎస్ఎంఏఎం)పథకం ద్వారా బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో దేవరకొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడిపై స్ట్రాబాలర్, రోటవేటర్స్, క్నాప్సక్, స్ప్రేయర్స్‌ను దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా అందజేశారు. వ్యవసాయ యాంత్రికరణ ద్వారా దేవరకొండ డివిజన్‌కు 1759 పనిముట్లు రూ. 1.16కోట్ల సబ్సిడిపై మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 100 పనిముట్లకు 22 రోటావేటర్స్, 7 స్ట్రా బ్యాలెర్, 61 క్నాప్సక్ స్ప్రేయర్స్ 27.27లక్షల సబ్సిడి బుక్ చేయడం జరిగిందని, 50శాతం సబ్సిడి ద్వారా 10 రోటావేటర్స్, 5 స్ట్రా బ్యాలెర్, 10క్నాప్సక్ స్ప్రేయర్స్ ఎంఎల్ఏ ద్వారా అందజేయడం జరిగిందని ఏడిఏ శ్రీలక్ష్మి తెలిపారు. ఈకార్యక్రమానికి మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, మునిసిపల్ చైర్మన్ శైలజ, వైస్ చైర్మన్ జువేరియా తబుసుమ్ పాల్గొన్నారు.

## నేరెళ్లపల్లిలో యువతి అనుమానాస్పద మృతి

### ఉరివేసుకున్న ఘటనపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని నేరెళ్లపల్లి గ్రామంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన గోదాసు ధనలక్ష్మి (21) బుధవారం సాయంత్రం ఇంటి మరుగుదొడ్డిలో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధనలక్ష్మికి అదే గ్రామానికి చెందిన గోదాసు రవితో ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది.సాయంత్రం బాత్రూంకు వెళ్లిన ఆమె ఎక్కువసేపు బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానించి తలుపు పగులగొట్టి చూడగా,ఆమె ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువతి మృతికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. కుటుంబ కలహాలేనా లేదా ఇతర కారణాలున్నాయా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి ఈ సమావేశంలో ఇండ్ల నిర్మాణ పురోగతి గ్రౌండ్ లెవెల్‌లో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని మార్గదర్శకాలు అధికారులకు అందజేశారు. ఈ సమావేశానికి మండల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్యాబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ ప్రకటించాలి

ఆర్‌టిసి మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ ప్రకటించాలని ఆ సంస్థ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విస్తృత ప్రచారంతో పాటు 100 శాతం ఓటింగుతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఆర్‌టిసి కార్మికులకు 59 నెలల జాప్యం తరువాత కూడా చట్టబద్ధమైన వేతన సవరణ చేయకపోవడం అన్యాయమన్నారు. 23న జరిగే క్యాబినెట్‌లో 30 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు ఏప్రిల్, 2021 నుంచి వేతన సవరణ ప్రకటించి, ఆర్‌టిసి కార్మికుల ఋణం తీర్చుకోవాలని ఎం నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నేడు ఎంబిసి కులాల ప్రతినిధులతో సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ బ్యూరో:** జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 19న అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబిసి) కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం మూడు గంటలకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎంబిసి కులాల జీవన స్థితిగతులు, విద్య, ఇతర సౌకర్యముల వివరాలపై అధ్యయనం చేయుటకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈసమావేశానికి హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యాలయం నుండి సీనియర్ మేనేజర్ డాక్టర్.జానకిరాం, సీనియర్ నాలెడ్జ్ మేనేజర్ ఆశీష్ లాల్ హాజరవుతారని చెప్పారు. వీరితో ఎంబిసి కులాల ప్రతినిధుల సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎంబిసి కులాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

## వదినపై మరిది కత్తితో దాడి

**ప్రజాపక్షం/చాదర్‌ఘాట్:** ఇంటిని ఖాళీ చేయాలని వదినపై మరిది కత్తితో దాడి చేసిన ఘటన చాదర్ ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, పల్టాన్ ప్రాంతానికి చెందిన వల్లభోజు సరిత తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఆమె భర్త వెంకటేశ్వరరావు 2023లో మరణించారు. భర్త మరణించిన తరువాత నుంచి మరిది గోవిందరాజు, ఇతర కుటుంబ సభ్యుల నరితను వేధింపులకు గురిచేస్తూ, ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం సరిత తన పోర్షన్ వద్ద శుభ్రం చేసుకుంటుండగా గోవిందరాజు అక్కడికి వచ్చి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సరితకు గాయాలయ్యాయి. అంతేకాకుండా, ఆమెను నీటి డ్రమ్ము ముంచేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో సరిత కుమార్తె అడ్డుకోవడంతో, ఆమెపై కూడా దాడి చేసినట్లు సమాచారం. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు గోవిందరాజును అరెస్ట్ చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కమిషనర్‌ను కలిసిన బిఆర్‌ఎస్ నేతలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నేతలు రామ చందర్, నరసింహ, శంకర్, నిశాంత్, శశిరాజ్ తదితరులున్నారు.

## సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ఐఎన్‌టియూసీ జాతీయ నేత డా.జి.సంజీవ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ కార్యాలయానికి ఐఎన్‌టియూసీ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఉత్సవాల్లో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నేతలే కాకుండా జాతీయ స్థాయిలో పేరొందిన నేతలు కూడా వేడుకల్లో పాల్గొనడం జరిగింది.

## మూడు షిఫ్టుల్లో చెత్త తరలింపు

చార్మినార్ జెడ్‌సి సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/చార్మినార్:** పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మూడు షిఫ్టుల్లో చెత్తను తొలగిస్తున్నామని.. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో బల్దియా కమిషనర్ కర్ణన్‌తో కలిసి చార్మినార్, మక్కా మసీద్, గుల్జార్ హౌస్, పత్తర్ గట్టి, మదీనా తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో ఆరా తీశారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ కర్ణన్ ఆదేశించినట్లు జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కమిషనర్ పర్యటనలో చార్మినార్ డీసీ సరిత, ఎస్‌ఇవ్యూఎం డీఈ శ్రీరాములు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## భర్తను చంపిన భార్య

**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** మద్యం సేవించి వేధిస్తున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వృత్తుడు మహమ్మద్ ఇషాక్ (35) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. మద్యానికి బానిసైన ఇషాక్ తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య నూర్జహాన్ బేగం ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## పోకిరీకి మూడు రోజుల జైలు



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** కళాశాల విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీకి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. చార్మినార్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ అఖిల్ (56) కళాశాల విద్యార్థినుల పట్ల వెకిలిగా ప్రవర్తిస్తూ.. సీసీటీవీలకు దొరికిపోయాడని.. తప్పుగా ప్రవర్తించినందుకు శిక్ష విధించడం జరిగిందని సీఐ సైదులు వివరించారు. మహిళల పట్ల ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వారికి శిక్ష తప్పదని సీఐ సైదులు హెచ్చరించారు.

# బిసి రిజర్వేషన్ల విషయంలో బండి సంజయ్ రాజకీయం చేయొద్దు

రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల విషయంలో బండి సంజయ్ రాజకీయాలు ఆపాలని, సావర్కర్ ,శ్యాం ప్రసాద్ ముఖర్జీ హిందూ ద్రోహులు అని, ముస్లిం లీగ్‌తో పొత్తు పెట్టుకుని, స్వాతంత్ర్య ఉద్యమంకు నష్టం చేశారని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేశామని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టి గవర్నర్‌కు పంపించామని, కానీ కేంద్రం అడ్డుకుందని వివరించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి వారు బిసి రిజర్వేషన్ వ్యతిరేకులని, ఓ వైపు బిసి రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే, మరో వైపు కోర్టులో కేసులు వేశారని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ అడ్డుకున్నా, బిసిలకు మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని, డిసిసి అధ్యక్షుల పదవులలో కూడా బిసిలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం లో 13 కార్పొరేషన్‌లలో 4 మేయర్ పదవులు మాత్రమే బిసిలకు ఇచ్చారని, కానీ, ప్రజా ప్రభుత్వంలో 7 కార్పొరేషన్‌లలో 4 బిసిలకు ఇచ్చామని తెలిపారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేసు వేసిన వారికి బిఆర్‌ఎస్ బీ ఫారం ఇచ్చిందని గుర్తు చేశారు.
ముస్లింలను బిసి రిజర్వేషన్లలో ఎలా చేర్చుతారని ప్రశ్నించిన బిజెపి, కరీంనగర్ కార్పొరేషన్‌లో బిసికి కేటాయించిన వార్డులో బిజెపి అభ్యర్థిగా ముస్లింకి ఎలా టిక్కెట్ ఇచ్చారని ఈరవత్రి అనిల్ ప్రశ్నించారు.

## నర్సింగ్ సిబ్బందిని 'క్రెడిట్ పాయింట్ల' పేరుతో వేధించొద్దు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నర్సింగ్ సిబ్బంది మనోవేదనను అర్థం చేసుకుని, క్రెడిట్ పాయింట్ల పేరుతో వారిని వేధింపులకు గురి చేయవద్దని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. క్వాలిఫైడ్ నర్స్‌ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్‌కు ఐదేళ్ల కాలంలో 150 క్రెడిట్ పాయింట్లు సాధించాలనే నిబంధనలు విధించడం సరికాదని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన ఈ నిబంధనలపైన తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ కనీస అవగాహన కల్పించే ప్రయత్నాలు చేయలేదని, దీంతో 80 వేల మంది నర్సింగ్ సిబ్బంది తమ రిజిస్ట్రేషన్ల రెన్యూవల్‌కు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్వాలిఫైడ్ నర్స్‌లు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ఐదేళ్లలో 150 గంటల కంటిన్యూయింగ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ క్రెడిట్ అవర్స్ ఉండాలనే నిబంధనలపైన చాలా మందికి అవగాహన లేదన్నారు. 150 క్రెడిట్ పాయింట్స్ ఉండాలని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేయడం పూర్తిగా ఏకపక్షమేనని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు సేవలందించే నర్సింగ్ సిబ్బందిని రిజిస్ట్రేషన్‌ల రెన్యూవల్ విషయంలో కఠిన నిబంధనలు సరికాదన్నారు. 150 క్రెడిట్ పాయింట్ల విధానంపై పునరాలోచన చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



## భూసార పెంపునకు 'నాక్రో బయోటెక్' ఉత్పత్తులు

**ప్రజాపక్షం / సోమాజిగూడ :** భూసారం, చీడపీడల నివారణ, దిగుబడుల పెంపే లక్ష్యంతో నాక్రో బయోటెక్ 'మిస్టర్ క్రాప్', 'కార్బన్ ప్రో' ఉత్పత్తులను తీసుకొచ్చినట్టు నాక్రో బయోటెక్ ఎండి బి.సుధాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన కంపెనీ ప్రతినిధులతో కలిసి 'మిస్టర్ క్రాప్, కార్బన్ ప్రో' ఉత్పత్తులను ఆవిష్కరించి, మాట్లాడారు. 1950లో మన దేశ నేలల్లో సుమారు 1శాతం ఉన్న సేంద్రీయ కర్బనం ప్రస్తుతం 0.3–0.4శాతం పడిపోయిందని, ఈ కారణంగా పంటల దిగుబడుగులు పతనమవుతున్నాయన్నారు. ప్రస్తుతం 58శాతం నేలల్లో కర్బనం 0.5శాతం కూడా లేనిపరిస్థితుల్లో సమస్యకు పరిష్కారం గా 'మిస్టర్ క్రాప్', 'కార్బన్ ప్రో' అనే రెండు విశిష్ట ద్రవ ఎరువులని దేశంలోనే తొలిసారిగా రూపొందించామని వివరించారు. ఏడేళ్ల ఫీల్డ్ ట్రయల్స్ తర్వాత గత ఏడాది ఈ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెచ్చామని పేర్కొన్నారు.

## క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలన చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికారాబాద్ జిల్లా దామగుండంలో ఏర్పాటు చేస్తున్న ఫ్రీక్వెన్సీ రాడార్ ప్రాజెక్టు నిమిత్తం అటవీ భూముల కేటాయింపునకు ప్రత్యామ్నాయంగా చేపట్టిన అటవీ ప్రాంత అభివృద్ధికి తీసుకున్న చర్యలను నివేదించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. క్షేత్ర స్థాయిలో ప్రత్యామ్నాయంగా ఎన్ని మొక్కలను నాటారో పరిశీలన చేసి వాస్తవ నివేదిక అందజేయాలంది. కోర్టుకు సహాయకారిగా ఉన్న అమికస్‌క్యూరీ కూడా క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలనపై నివేదిక ఇవ్వాలంది. వికారాబాద్ జిల్లా దామగుండంలో 2900 ఎకరాల అటవీ భూములను రాడార్ కేంద్రానికి కేటాయించడాన్ని సవాలు చేస్తూ దామగుండం ఫారెస్ట్ ప్రొటెక్షన్ జేఏసీ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ బుధవారం విచారించింది. విచారణను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసింది.

## విద్యార్థులు పతకాలు సాధించడం గర్వకారణం

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన జల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/గద్వాలరూరల్ :** రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ప్రత్యేక అవసరాల గల విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అభినందించారు. బుధవారం ఐడిఒసి కలెక్టర్ ఛాంబర్ నందు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిని జిల్లాకు చెందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్ లోని దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 17న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అసవరాలు గల పిల్లలు కోసం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన విష్ణు లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, షాట్‌పూట్‌లో రెండో స్థానం సాధించి విశేష ప్రతిభ చూపించారు. నిఖిత క్యారమ్స్‌లో షాట్‌పూట్‌లో రెండో స్థాణం సాధించింది. వినయ్‌కుమార్, విజయేంద్ర రన్నింగ్ విభాగంలో రెండో స్థానం సాధించిన జిల్లాకు పేరు తెచ్చారు. విద్యార్థులు తమ శారీరక పరిమితులను అధిగమిస్తూ ధ్యైరంగా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడం ప్రతి ఒక్కరికి ఆదర్శకంగా నిలుస్తుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడల ఎంతో దోహదపడతాయని, ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహన్ని ఇస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయలక్ష్మి, సెక్టోరియల్, అధికారులు, కర్రెప్ప, మైఖేల్ శ్రీనివాసులు, శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్టుల భద్రత చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా అపార్ట్‌మెంట్‌లు, ఇతర బహుళ అంతస్తుల భవనాల్లోని లిఫ్టుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఇందుకు అవసరమైన చట్ట రూపకల్పనకు బిల్లు తయారీకి 4 వారాల గడువు ఇచ్చింది. బిల్లు ప్రతిపాదన ఏ దశలో ఉందో 4 వారాల్లో చెప్పాలంది. లిఫ్ట్ భద్రతకు చట్టం లేదంటూ అందిన లేఖను హైకోర్టు పిల్‌గా స్వీకరించింది. చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ బుధవారం విచారించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## 52 మందికి రైల్ సేవా పురస్కారాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌లో 70వ రైల్వే వీక్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.రైల్ కళారంగ్‌లో జరిగిన ఈ కార్యక్రమం దేశానికి దశాబ్దాలుగా అందిస్తున్న విశిష్ట సేవలకు ప్రతీకగా నిలిచింది. ఈ వేడుకలకు డివిజనల్ రైల్వే మేనేజర్ డా. ఆర్.గోపాలకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా సంధ్యా గోపాలక్రిష్ణణ్ , సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జి.ఆర్. సుధీర్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రత, ఆపరేషనల్ ప్రతిభ, ప్రయాణికులకు సేవలు, విధి పట్ల నిబద్ధతలో విశేష ప్రతిభ కనబరిచిన 52 మంది ఉద్యోగులకు డిఆర్ఎం రైల్ సేవా పురస్కారాలు అందజేశారు. డివిజన్ గర్వకారణంగా జోనల్ స్థాయిలో విశిష్ట రైల్ సేవా పురస్కార్ కింద ఎనిమిది షీల్డులను కూడా సాధించింది. సమయపాలన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సరుకు రవాణా పెంపు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల వంటి రంగాల్లో డివిజన్ సాధించిన పురోగతిని డా. గోపాలకృష్ణన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

## ట్రంప్ యుద్ధ సన్నాహాల మధ్య ఇరాన్ మంత్రి సానుకూల ప్రకటన

**టెహ్రాన్:** అమెరికాతో జెనీవాలో జరుగుతున్న రెండో విడత అణు చర్చల్లో మంచి పురోగతి సాధించామని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. జెనీవాలో మంగళవారం అమెరికాతో జరిపిన చర్చల్లో మంచి పురోగతి సాధించామని ఆయన చెప్పినట్లు ఇరాన్ అధికారిక పత్రిక 'ఇర్నా' బుధవారం డేట్‌లైన్‌తో వార్త వెలువరించింది. ఒకవైపు ట్రంప్ యుద్ధ సన్నాహాలు ముమ్మరం చేస్తుండగా ఇరాన్ మంత్రి మాత్రం సానుకూల ప్రకటన చేశారు. చర్చలు జరుగుతున్న సమయంలోనే అమెరికా పశ్చిమాసియా జలాల్లోకి 50కి పైగా యుద్ధ విమానాలను, వాటిని మోసుకెళ్ళే నౌకలను తరలించిందన్న వార్తలు ఆందోళన రేకెత్తిస్తున్న తరుణంలో అబ్బాస్ ఆరాఘ్చీ ప్రకటన వెలువడింది. అణు కార్యక్రమాన్ని వదులుకోవాలని ఇరాన్ ప్రభుత్వాన్ని అమెరికా డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా పశ్చిమ ఆసియా ప్రాంతానికి మరిన్ని యుద్ధ విమానాలను ట్రంప్ తరలించడంపట్ల ఇరాన్ సర్వాధినేత అయెతొల్లా అలీ ఖమేనీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ నౌకలు సురక్షితంగా ఉంటాయన్న హామీ లేదని, ఆ నౌకలు మునిగిపోయే ప్రమాదం కూడా పొంచి ఉందని సంచలన ప్రకటన చేశారు. చర్చలు విఫలమైతే యుద్ధం కొనసాగించే ప్రత్యామ్నాయం కూడా తమ వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు గుప్పిస్తూ ఇప్పటికే ఆరేబియా జలాల్లో తిష్టవేసి ఉన్న విమాన వాహక నౌకలకు మద్దతుగా కొత్త నౌకలను తరలించడం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. ఐతే ఈసారి తాము ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనేది లేదని, ఇజ్రాయెల్ చేసే దాడులకు తాము మద్దతు ఇస్తామని ట్రంప్ ఇంతకుముందే ప్రకటించారు. ఒకవైపు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ మరోవైపు ట్రంప్ ఉద్ధృతంగా యుద్ధ సన్నాహాలు చేయడం అందరిలో ఉత్కంఠ రేపుతోంది.

# ఎఐ సదస్సులో భారత్‌కు అవమానం!

చైనా డాగ్ రోబోను ప్రదర్శించిన యుపి యూనివర్సిటీ

తెలియక చేసిన తప్పు : క్షమాపణ చెప్పిన స్టాల్ నిర్వాహకులు



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మకంగా భారత్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ కృత్రిమ మేధ సదస్సులో మేధోహక్కుల గందరగోళం చోటుచేసుకుంది. కృత్రిమ మేధను ఉపయోగించి చైనా తయారు చేసిన 'డాగ్ రోబో'ను ప్రదర్శించి అది తమ ప్రతిభాపాటవాల ఆవిష్కరణ ఫలితమేనని ప్రకటించుకున్న గలోషియస్ యూనివర్శిటీ అంతర్జాతీయస్థాయిలో భారత్ పరువు తీసింది. ఐతే ఈ విష్కరణకు సంబంధించిన సమాచారాన్ని తప్పుగా ప్రపంచానికి తెలియజేశారని ఆ తర్వాత నిర్వాహకులు దిద్దుబాటు ప్రకటన చేశారు. ఈ డాగ్ రోబోను ప్రదర్శించిన సంబంధిత యూనివర్శిటీ కమ్యూనికేషన్స్ విభాగం ప్రొఫెసర్ నేహా సింగ్ చేసిన అభివర్ణనలవల్ల గందరగోళం ఏర్పడటంతో యూనివర్శిటీ స్టాల్ నిర్వాహకులను తక్షణం సదస్సు ప్రదర్శనశాల స్టాల్‌ను ఖాళీచేసి వెళ్ళిపోవాలని ఆదేశించారు. దీనిపై ఐ.టి కార్యదర్శి ఎస్.కృష్ణన్ మాట్లాడుతూ, వారి స్వీయ నవీన ఆవిష్కరణలు కానప్పుడు వాటిని ప్రదర్శించడానికి ప్రభుత్వం అనుమతించదని అన్నారు. ''ఈ విధమైన వాటిని తమ స్వీయ ఆవిష్కరణలుగా చెప్పుకునే ప్రదర్శనలను ఈ సదస్సులో తాము కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఆ తర్వాత గలోషియస్ యూనివర్శిటీ క్షమాపణలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎ ఐ సదస్సులో గందరగోళం తలెత్తిందని, స్టాల్ వద్ద పెవిలియన్‌లో ఈ రోబోను ప్రదర్శించిన వ్యక్తి ఈ ఆవిష్కరణ గురించి తప్పుగా అభివర్ణనలు చెప్పారని, తప్పుడు సమాచారం, తప్పుడు సందేశం ప్రపంచానికి ఆమెవల్ల వెళ్ళిందని యూనివర్శిటీ తన ప్రకటనలో తెలిపింది. ''ఆమెకు ఆ ఉత్పత్తికి సంబంధించిన సాంకేతికత మూలాల సమాచారం తెలియదు, ఆమె తప్పుడు సమాచారాన్ని అందరికీ తెలియజేశారు, ఆమెకు మీడియా ముందు మాట్లాడటానికి ఎలాంటి అధికారం లేదు, కానీ ఆమె మాట్లాడారు'' అని వివరణ ఇచ్చింది. ''ఈ నవీన ఆవిష్కరణకు తప్పుడు వివరణ ఇవ్వడంవల్ల అపార్థాలు వచ్చాయి'' అని యూనివర్శిటీ పేర్కొంది. ప్రదేశ్ డాంకౌర్‌లో ఎక్స్‌ప్రెస్ వే పై ఉన్న ప్రైవేటు విశ్వవిద్యాలయం ''గాలోషియస్ యూనివర్శిటీ''. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపుతో 2011లో దీనిని స్థాపించారు. సునీల్ గాల్గోషియా దీని ఛైర్మన్ కాగా డా.మల్లికార్జునబాబు వైస్–ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ డాగ్ రోబోను ప్రదర్శించిన నేహాసింగ్ ఆ ప్రాంగణంలో వివరణ ఇస్తూ, దూదర్శన్ న్యూస్‌లో చూపించిన రోబోటిక్ డాగ్ మూలాలను ఉటంకించారు. ఈ రోబోటిక్ డాగ్‌ను గలోషియస్ యూనివర్శిటీ అభివృద్ధి చేసిందని ఆమె చెప్పడంతో కలకలం చెలరేగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వాస్తవానికి యూనిట్రీ జిఓ–2ను చైనా యూనిట్రీ రోబోటిక్స్ తయారు చేసింది. ఐతే దీనిని సర్వసాధారణంగా ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలు పరిశోధనల నిమిత్తం ఉపయోగించుకుంటున్నాయి. ఈ డాగ్ రోబోను వారు ప్రదర్శించిన వెంటనే ఎ ఐ సదస్సు ప్రాంగణంలో కలకలం రేగింది. ''ఇది చైనా తయారు చేసిన డాగ్ రోబోకు నకలు'' అంటూ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నిర్వాహకులు ఈ డాగ్ రోబోను ప్రదర్శించిన గలోషియస్ యూనివర్శిటీ ప్రతినిధులను సదస్సునుండి పంపేశారు. ఇది పరోక్షంగా భారత్‌కు అంతర్జాతీయస్థాయిలో ఒక అవమానకర ఘటనగా మిగిలిపోయింది. ఇది ఒక రకమైన మేధోహక్కుల అపహరణ కేటగిరీలో చేరే అవకాశం ఉంది. సదస్సు ప్రారంభరోజు ఇంటర్నెట్ డేటా సదుపాయం సరిగ్గా అందుబాటులో లేకపోవడం, పరిశుభ్రత లేకపోవడం, కొందరు ప్రతినిధుల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు పోవడం, అవి మారిపోయి మరోచోటకు వెళ్ళిపోవడం, పెద్ద పెద్ద క్యూ లైన్లవల్ల ప్రతినిధులు అవస్థలపాలుకావడం వంటి సమస్యవల్ల ప్రతినిధులలో అసంతృప్తి ఎదురైంది. ఆ తర్వాత దీనిని వార్ రూమ్ ద్వారా పరిష్కరించొ ఒక కొలిక్కి తీసుకువచ్చారు. అంతలోనే ఉత్తర ప్రదేశ్ యూనివర్శిటీ తప్పుడు అభివర్ణనల కారణంగా ఈ ''కాపీ క్యాట్ ఉదంతం''తో భారత్ మరోసారి అందరిముందు నవ్వులపాలైంది.

## మద్యం బాటిళ్ల పట్టివేత



**ప్రజాపక్షం/ధూల్‌పేట్:** ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి తెలంగాణకు విమానాల్లో తీసుకు వచ్చిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను ఎస్‌టిఎఫ్‌డీ బృందం స్వాధీనం చేసుకున్నది. ఈ మేరకు ఎస్‌టీఎఫ్‌డీ టీమ్ సిఐ నాగరాజు మాట్లాడుతూ... పహాడీషరీఫ్ ప్రాంతంలో చేపట్టిన తనిఖీల్లో 35 లిక్కర్ బాటిళ్లను గుర్తించడం జరిగిందని.. నిందితుల నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లిక్కర్ బాటిళ్లను మీర్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని సిఐ వివరించారు.

## 21 నుంచి వీవర్స్ హబ్ ఎగ్జిబిషన్



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ఈనెల 21న ప్రారంభం కానుంది. ఎగ్జిబిషన్ పురస్కరించుకుని మోడల్స్ చేనేత చీరలను కట్టుకుని ఫ్యాషన్ షో పాల్గొన్నారు. నిర్వహకురాలు, సోషలైట్ అలేఖ్యరెడ్డి ఎవ్వాహ్ వీవర్స్ హబ్ ను ప్రకటిస్తూ.. ప్రదర్శన పోస్టర్‌ను మోడల్స్‌తో కలిసి ఆవిష్కరించారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమని అలేఖ్యరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ప్రదర్శనలో బనారసి, కంజీవరం, గద్వాల్, పోచం పల్లి, మంగళగిరి వంటి విభిన్న రకాల హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బిజెపి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బిజెపి ఆధ్వర్యంలో జరిగిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ధరఖాస్తు చేసుకున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు వెంటనే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, బిజెపి రాష్ట్ర బిసి మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, రాష్ట్ర ఎస్‌సి మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్, నాయకులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అజేయంగా సూపర్–8కు టీమిండియా



హ్యాట్రిక్ విజయాలతో సూపర్–8కు దూసుకెళ్లిన భారత్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ జయభేరి మోగించింది. టాప్ ఆర్డర్ రాణించకున్నా శివం దూబే(66) అర్ధ శతకంతో కదం తొక్కి భారీ స్కోర్ అందించగా.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3–14) బంతితో నెదర్లాండ్స్ బ్యాటర్లను హడలెత్తించాడు. లీడే(33), అకెర్మన్(23)లు పోరాడినా.. 176కే కట్టడి చేసింది. 17 పరుగుల తేడాతో విజయం సాధించి.. అజేయంగా నాకౌట్ దశకు చేరుకుంది.

మూడోసారి పొట్టి ప్రపంచకప్‌పై గురి పెట్టిన భారత్.. లీగ్ దశను అజేయంగా ముగించింది. గత మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు చేరుకున్న టీమిండియా.. చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్‌ను ఓడించింది. శివం దూబే(66) మెరుపులతో 193 రన్స్ కొట్టిన భారత జట్టు.. అనంతరం వరుణ్ చక్రవర్తి(3 14), దూబే(235)లు రాణించగా కట్టడి చేసింది. భారత్ నిర్దేశించిన లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ ఓపెనర్లు దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. అయితే.. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వారి వ్యూహం ఫలించలేదు. వరుణ్ చక్రవర్తి తొలి బ్రేకిస్తూ మ్యాక్స్ డీ డౌడ్(20)ను ఔట్ చేశాడు. అనంతరం.. పాండ్యా ఓవర్లో మైఖేల్ లెవిట్(24)ను పెవిలియన్ చేర్చగా.. బాస్ డీ లీడే(33), కొలిన్ అకెర్మన్(23)లు ధాటిగా ఆడారు. కానీ. దూబే ఓవర్లో లీడే ఔట్ కాగా.. అకెర్మన్ను చక్రవర్తి డౌగట్ పంపాడు. దాంతో.. 94కే నాలుగు వికెట్లు కోల్పోయిన డచ్ జట్టు.. ఇన్నింగ్స్ 120లోపే ముగిస్తుందనిపించింది. కానీ.. ఆఖర్లో జాజ్ లయన్ (26), నోహ్ క్రొయెస్(25 నాటౌట్) బౌండరీలతో చెలరేగి ఓటమి అంతరాన్ని తగ్గించారు.

**దూబే, పాండ్యా ధనాధన్...** అహ్మదాబాద్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటైనా.. శివం దూబే(66) శివాలూగిపోయాడు. టాప్ ఆర్డర్ విఫలమైనా నేనున్నాను అంటూ అర్ధ శతకంతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు భారీ స్కోర్ అందించాడు. తిలక్ వర్మ(31), సూర్యకుమార్ యాదవ్(34) మెరుపులను కొనసాగించిన దూబే.. నెదర్లాండ్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. హార్దిక్ పాండ్యా(30)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన దూబే.. ఈ టోర్నీలో రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. డెత్ ఓవర్లలో దూబే, పాండ్యా మరింత చెలరేగడంతో ప్రత్యర్థికి టీమిండియా 194 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## యుఎఇపై దక్షిణాఫ్రికా విజయం



**న్యూఢిల్లీ:** టి–20 వరల్డ్‌కప్ గ్రూప్ డిలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో యుఎఇపై దక్షిణాఫ్రికా విజయం సాధించింది. దీంతో తమ గ్రూపులోని అన్ని మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విక్టరీ నమోదు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన యుఎఇ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్‌లో అలీషాన్ షారఫూ అత్యధికంగా 45 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను కేవలం 13.2 ఓవర్లలో సఫారీలు అందుకున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ రికల్టన్ 16 బంతుల్లో 30 రన్స్ చేయగా, బ్రెవిస్ 25 బంతుల్లో 36 రన్స్ స్కోరు చేశారు. మరో 40 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా విజయ కేతనం ఎగురవేసింది. సఫారీ బౌలర్ కార్బిన్ బాష్ ఈ మ్యాచ్లో మూడు వికెట్లు తీసుకున్నాడు. గ్రూపు డి నుంచి ఇప్పటికే దక్షిణాఫ్రికాతో పాటు న్యూజిలాండ్ .. సూపర్8 స్టేజ్‌కు క్వాలిఫై అయ్యాయి.

## సూపర్– 8లో పాకిస్థాన్



పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు చేతిలో కంగుతిన్న పాకిస్థాన్ నాకౌట్ ఆశలను నిలబెట్టుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై భారీ స్కోర్ చేసిన పాక్ సునాయస విజయంతో సూపర్ 8కు దూసుకెళ్లింది. ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(100) సెంచరీతో కదం తొక్కగా.. ఉస్మాన్ తారీఖ్(4 16), షాదాబ్ ఖాన్(319)లు వికెట్ల వేటతో చెలరేగాడు. 200 పరుగుల ఛేదనలో పసికూనను పడగొట్టింది. నాకౌట్ దశలో ఆతిథ్య శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్‌లతో అమీతుమీకి సిద్ధమైంది. తొమ్మిదో సీజన్‌లో గ్రూప్ దశలోనే వెనుదిరిగిన పాకిస్థాన్ ఈసారి బతికిపోయింది. గ్రూప్ ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాను ఓడించి సూపర్ 8కు అర్హత సాధించింది. ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(100) మెరుపు సెంచరీకి.. మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీఖ్(416) మ్యాజిక్ తోడవ్వగా 102 పరుగుల తేడాతో నమీబియాను మట్టి కరిపించింది పాక్. దాంతో, గ్రూప్ ఎ నుంచి సూపర్ 8 బెర్తు పట్టేసింది. పాక్ గెలుపొందడంతో రెండోసారి నాకౌట్‌లో ఆడాలనుకున్న యుఎస్ఏ ఆశలు ఆవిరయ్యాయి.

**స్పిన్నర్లు పడగొట్టారు...** పాక్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న నమీబియా భారీ ఛేదనలో ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్లు లౌరెన్ స్టీన్కాంప్(23), జన్ ఫ్రైలింక్(9)లు దూకుడుగా ఆడారు. కానీ, సల్మాన్ మిర్జా ఈ జోడీని బ్రేకిచ్చాడు. ఆ తర్వాత బంతి అందుకున్న ఉస్మాన్ తారీఖ్(416), షాదాబ్ ఖాన్(319)లు వికెట్ల వేటతో ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించారు. వీరి ద్దరి విజృంభణతో అలెగ్జాండర్ వొల్స్చెంక్(20) మినహా మిడిలార్డర్లో ఏ ఒక్కరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివరి బ్యాటర్ను తారీఖ్ ఔట్ చేయగా నమీబియా 97 పరుగులకే ఆలౌటయ్యింది. దాంతో.. 102 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన పాక్ సూపర్ 8కు క్వాలిఫై అయింది.

చరిత్ర

# నెపుల్స్‌లో 'విల్లా సోరా'



ఇటలీలోని నెపుల్స్ సముద్ర తీరంలో ఉన్న ప్రాచీన పట్టణం హెర్క్యులేనియానికి సమీపంగా, ఒర్రే డెల్ గ్రేకో ప్రాంతంలో ఉన్న విల్లా సోరా వద్ద పురావస్తు శాస్త్రవేత్తలు తాజా పరిశోధనలను పూర్తి చేశారు. హెర్క్యులేనియం ఆర్కియాలజికల్ పార్క్‌కు చెందిన నిపుణులు, దాదాపు 30 సంవత్సరాల తరువాత ఈ ప్రదేశంలో మళ్లీ వ్యవస్థబద్ధమైన తవ్వకాలు చేపట్టారు. ఈ విల్లా క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దం మధ్య కాలంలో నిర్మించినదిగా గుర్తించారు. అప్పట్లో ఇది సముద్ర తీరాన్ని ఆనుకుని సుమారు 500 అడుగుల పొడవున విస్తరించి ఉండేది. ఇది హెర్క్యులేనియం పట్టణానికి ఆగ్నేయంగా కొన్ని మైళ్ల దూరంలో ఉంది. ఈ విల్లా నిర్మాణం జరిగిన తరువాత, వెసూవియస్ అగ్నిపర్వతం క్రీ.శ. 79లో విస్ఫోటనం చెందే వరకు, అనేక సార్లు మరమ్మతులు, మార్పులు జరిగినట్లు ఆధారాలు సూచిస్తున్నాయి. తాజా తవ్వకాల్లో, భవనం ముందు భాగంలో సుమారు 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఒక గదిని పరిశోధకులు వెలికి తీశారు. ఆ గది గోడలు నలుపు, ఎరుపు రంగులతో చిత్రించి ఉండగా, వాటిపై కొంగలు, దీప స్తంభాల చిత్రణలు కనిపించాయి. గది పైకప్పు లేత రంగులో ఉండి, దానిపై గ్రిఫిన్‌లు, సెంటార్ వంటి పురాణ పాత్రల ఫ్రెస్కో చిత్రాలు ఒకప్పుడు ఉండినట్లు గుర్తించారు. ఈ గదిలో అలంకరించిన సీసపు పెట్టెలు, మార్బుల్‌తో చేసిన నిర్మాణ భాగాలు, సున్నితంగా చెక్కిన స్తంభాల తలభాగాలు లభించాయి. ఇవి ఈ గది నిల్వల కోసం లేదా పనిశాలగా ఉపయోగించబడినదై ఉండవచ్చని సూచిస్తున్నాయి. అదే సమయంలో విల్లాలో మరోసారి మరమ్మతులు జరుగుతున్నాయని కూడా ఈ అవశేషాలు తెలియజేస్తున్నాయి. గదిలోని మట్టిపొరల నిర్మాణం, వెసూవియస్ విస్ఫోటనం సమయంలో వచ్చిన తీవ్రమైన పైరోక్లాస్టిక్ ప్రవాహాలు ఎలా పైకప్పును, గోడల భాగాలను కూల్చేశాయో స్పష్టంగా చూపిస్తోంది. ఈ కనుగొనడాలు, హెర్క్యులేనియం ప్రాంతంలోని ప్రాచీన జీవన శైలిని మరియు ఆ విపత్తు తీవ్రతను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలకు సహాయపడుతున్నాయి.




## పురాతన సహజ నీటి ఊటలు..

ఇటలీలోని రోమ్‌కు ఈశాన్యంగా ఉన్న సబినా ప్రాంతంలో, 'మాంటోపోలీ డి సబినా' ప్రాంతంలో పురావస్తు శాస్త్రవేత్తలు, గుహల అధ్యయన నిపుణులు (స్పీలియాలజిస్టులు) ఒక కీలకమైన గుహను కనుగొన్నారు. 'లా బ్రూజులా వెర్దే' నివేదిక ప్రకారం, వారు ప్రాచీన రోమన్ కాలానికి చెందిన కాసోనీ విల్లాకు నీటిని సరఫరా చేసిన భూగర్భ జలవాహినులు (అక్వెడక్ట్ టన్నెల్స్), సహజ నీటి ఊటలను గుర్తించారు. ఈ విల్లా రోమన్ రిపబ్లికన్ కాలంలో నిర్మించబడింది. ఇది రెండు మెట్లుగా (టెర్రేస్‌లుగా) విస్తరించి ఉంది. దిగువ భాగంలో తోట, ఫౌంటెన్, వృత్తాకార కొలను ఉండగా, పైభాగంలో నివాస గదులు ఉన్నాయి. ఇప్పటికే 18వ శతాబ్దం చివర్లో స్పెరాండియో అనే పండితుడు ఈ ప్రాంతంలో పురాతన అక్వెడక్ట్‌లు ఉన్నాయని తన రచనల్లో ప్రస్తావించాడు. అయితే అవి కాలక్రమేణా కనుమరుగయ్యాయి. ఇటీవల నిర్వహించిన క్షేత్ర పరిశీలనలో, పరిశోధకులు ఈ భూగర్భ సొరంగ వ్యవస్థను విల్లాకు సుమారు 980 అడుగుల దూరంలో తిరిగి గుర్తించారు. సహజంగా ఏర్పడిన కాంగ్లోమరేట్ రాతిలో తవ్వబడిన ఈ సొరంగాలు, నీటిని సేకరించి, కాలువల ద్వారా మళ్లించే సంక్లిష్టమైన వ్యవస్థగా పనిచేశాయి. ఈ నెట్‌వర్క్ ఒక పెద్ద నీటి తొట్టితో అనుసంధానమై ఉంది. అక్కడ నీటిలోని మలినాలను వడపోసి, శుద్ధి చేసిన నీటిని స్నానాల గదులు, ఫౌంటెన్లు, ఇతర గదులకు పంపిణీ చేసేవారు. వెస్పెర్టిలియో గ్రూప్‌కు చెందిన స్పీలియాలజిస్టు క్రిస్టియానో రానియేరి అభిప్రాయం ప్రకారం, ఈ ఆవిష్కరణ, రోమన్ జల ఇంజినీరింగ్ ఎంత అభివృద్ధి చెందినదో మాత్రమే కాకుండా, ఆ ప్రాంతపు ప్రాచీన చరిత్రను కొత్త కోణంలో అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తోంది.



## అరుదైన లోహ బొమ్మ..

ఇంగ్లాండ్‌లోని లండన్ సమీప ప్రాంతమైన ఎస్సెక్స్‌లో ఒక అరుదైన రోమన్ కాలపు లోహ బొమ్మను గుర్తించారు. 'జెడ్ఎంఇ సైన్స్' నివేదిక ప్రకారం, ఒక మెటల్ డిటెక్టర్ ఉపయోగిస్తున్న వ్యక్తికి సుమారు నాలుగు అంగుళాల పొడవు గల తామ్ర మిశ్రమంతో తయారైన రథ అలంకరణ లభించింది. కాలక్రమంలో ఇది ఆకుపచ్చ రంగులోకి మారిపోయింది, ఇది లోహ ఆక్సీకరణకు సహజ లక్షణం. ఈ వస్తువుపై చెక్కిన చిత్రాలు విశిష్టమైనవని అంటున్నారు. అందులో ఒక పాంథర్ (చిరుతపులి) తన ముందరి పంజాతో ఒక మానవ తలపై పాదం మోపినట్లు కనిపిస్తుంది. రోమన్ సంస్కృతిలో పాంథర్‌ను శక్తి, నాగరికత, మద్యం దేవుడు బాక్కస్‌కు ప్రతీకగా భావించేవారు. అదే సమయంలో, తెగిపోయిన మానవ తల స్థానిక ఇనుపయుగ బ్రిటన్ గిరిజనులపై రోమన్ల విజయం, ఆధిపత్యాన్ని సూచిస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు. కింగ్' కాలేజ్ లండన్‌కు చెందిన పురావస్తు శాస్త్రవేత్త జాన్ పియర్స్ మాట్లాడుతూ, రోమన్–బ్రిటన్ కాలానికి చెందిన వస్తువుల్లో ఇది పూర్తిగా భిన్నమైనది. ఇలాంటి రూపం మరెక్కడా కనిపించలేదు అని వ్యాఖ్యానించారు. ఈ అలంకరణ ఒక ధనవంతుడైన రైతు లేదా వ్యాపారి రథానికి అమర్చబడి ఉండి, గడ్డిపైన లేదా రాళ్లతో నిండిన మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో విడిపోయి పడిపోయి ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.



# ఆర్‌టిసిని విలీనం చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆర్‌టిసి రక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం ఈనెల 24న నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆసిఫాబాద్ డిపోలో ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను ప్రతినెల కోత విధించకుండా ఇవ్వాలని, పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బెడ్ విన్నర్ స్కీంలో పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని సంస్థకు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. రిటైరైన ఉద్యోగుల బకాయిలు చెల్లించడంతో పాటు హయ్యర్ పెన్షన్ పొందేందుకు మరో అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి దివాకర్, నాయకులు విలాస్, ప్రవీణ్, ప్రేమ్ సింగ్, కెజిరావు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేస్తున్న పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా అమలు చేయాలని తదితర డిమాండ్‌లపై యాజమాన్యంతో చర్చించడం జరిగిందని, యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేస్తుందన్నారు. సమావేశంలో బి గెస్ట్ హౌస్ ఇంచార్జీగా కనుకుంట్ల లక్ష్మణ్‌ను నియమించారు. సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీవన్ అధ్యక్షుడు ఎం.ఎ.గౌస్, నాయకులు భూమయ్య, సూరిబాబు, అభిబ్, సురేష్ రవీందర్, రాజేష్, జయమ్మ, మల్లీశ్వరి తిరుపతమ్మ, లత, తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదోపిడీకి గురవుతున్న ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ కార్మికులు

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలోని వైద్య ఆరోగ్యశాఖ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వారిని తక్షణమే రెగ్యులర్ చేయాలని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. కార్మిక హక్కుల సాధనకు ఈనెల 28న వరంగల్ జిల్లా కేంద్రంలో జరగనున్న మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గవ మహాసభల విజయవంతానికి ప్రచార సామాగ్రిని బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సన్నాహక సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకున్నా అరకొర వేతనాలతో ఆరోగ్యశాఖ కాంట్రాక్టు కార్మికులు ప్రజలకు సేవలందించడమే కాకుండా ఆసుపత్రి స్వచ్ఛతకు చిహ్నంగా నిలుస్తున్నారన్నారు. ఇలాంటి సిబ్బంది జీవితాలకు భరోసాగా నిలవాల్సిన ప్రభుత్వ వారిని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైద్యరంగంలో ఏజెన్సీల విధానం ద్వారా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు అందిస్తున్నారని, దీంతో ఏజెన్సీల కాంట్రాక్టర్లు లబ్ధి పొందుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో కాంట్రాక్టు సిబ్బంది జీవన విధానం విధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీల విధానం రద్దు చేసి కార్పోరేషన్ ద్వారా నేరుగా కార్మికులకు జీతభత్యాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఈ నెల 28న వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే కార్మిక సభకు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తరలి రావాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆసుపత్రి నేతలు కార్మికులు నరసింహ, నాగరాజు, నవీన్, పేర్మల్, రామకృష్ణ, రాజేష్, శివలీల, పద్మ, స్వాతి, సుక్కమ్మ, నీరజ, అలివేల, అంజమ్మ, మన్నెమ్మ, నరసమ్మ, భార్గవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# గూండా రాజకీయం తగదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ధ్వజం



**ప్రజాపక్షం/మంచిర్యాల :** క్యాతనపల్లి మున్సిపాలిటీ సాక్షిగా సాగుతున్నది ప్రజాస్వామ్య పాలన కాదని, గూండా రాజకీయం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ధ్వజమెత్తారు. బుధవారం మంచిర్యాలలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ ఈ అరాచకాలకు ప్రత్యక్ష సూత్రధారులు కావడం శోచనీయమని విమర్శించారు. కాకా వెంకటస్వామి వారసత్వాన్ని ఆయన కొడుకు, మనవడు అప్రజాస్వామిక చర్యలతో మంటగలుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్ తలుపులు మూయించి, మీడియాను రాకుండా అడ్డుకుని చీకటి రాజకీయం నడపడం వారి దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. కౌన్సిల్ హాల్‌లోనే మహిళా ప్రతినిధులపై భౌతిక దాడులు జరగడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. గిరిజన అభ్యర్థిపై దాడికి తెగబడటం, డాక్టర్ అయిన మహిళా చైర్మన్ అభ్యర్థి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం అమానుషమన్నారు. మహిళా కౌన్సిల్ సభ్యురాలు కన్నీటి పర్యంతమవ్వడం చూస్తుంటే మహిళలకు రక్షణ కరువైందని స్పష్టమవుతోందన్నారు. ఎంపి వంశీకృష్ణ ఈ అరాచకాల్లో ప్రధాన పాత్ర పోషించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అసభ్యంగా ప్రవర్తించిన గుర్రపు శీనుపై కఠిన చర్యలు తీసుకుని, కౌన్సిలర్ పదవి నుంచి తక్షణమే అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం మీడియా పాస్‌లు జారీ చేసినప్పటికీ అధికారులు మీడియాను లోపలికి అనుమతి ఇవ్వకపోవడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. సిసిటివి ఫుటేజ్ అడిగినా ఇవ్వకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని, దీనిపై ఎన్నికల నిర్వహణ అధికారిగా ఉన్న ఎంఆర్ఓ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. క్యాతనపల్లిలో అశాంతిని సృష్టించిన అధికార పక్షానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బుధ వారం సిపిఐ, బిఆర్ఎస్ ఇచ్చిన క్యాతనపల్లి బంద్ కు సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు, వ్యాపారస్తులకు, ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే లక్ష్యం


### సిపిఐ అభినందన సభలో కార్పొరేటర్ సూర్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో 41 వ డివిజన్ సిపిఐ కార్పొరేటర్ మార్కపూరి సూర్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శితాండ్ర సదానందం మాట్లాడుతూ సిపిఐకి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా సూర్యను గెలిపించిన డివిజన్ ప్రజలకు అభినందనలు తెలిపారు. కార్పొరేటర్ సూర్య మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సూర్యను పార్టీ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. తాళ్ళపెల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, నగర కార్యదర్శి కనకరాజ్, ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు వేల్పుల నారాయణ, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో బొల్ల సిద్ధారెడ్డి చిరస్మరణీయుడు

### సంతాపసభలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** స్వాతంత్ర సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, రాజపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన బొల్ల సిద్ధారెడ్డి సంస్మరణ సభ బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరై సిద్ధారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బొల్ల సిద్ధారెడ్డి పేదోళ్ల పెన్నిదని, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఆయన కృషి అనన్యమని పేర్కొన్నారు. మొదటి ఆంధ్ర మహాసభ ప్రభావంతో, ఆరుట్ల రామచంద్రారెడ్డి కమలాదేవిల స్ఫూర్తితో ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో సిద్ధారెడ్డి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఇక్కడి భూ పోరాటాలకు నాయకత్వం వహించి పేదల పక్షాన నిలిచిన ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలని పల్లా వెంకట్‌రెడి పిలుపునిచ్చారు. సంతాప సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిపిలు బుచ్చిరెడ్డి, వంచ వీరారెడ్డి, జిట్టా మధుసూదన్ రెడ్డి, సింగరేణి మాజీ చైర్మన్ చింతలపూడి భాస్కర్ రెడ్డి, సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తదితరులు మాటాడుతూ సిద్ధారెడ్డి ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, చిగుళ్ల లింగం, కొల్లూరి రాజయ్య, మండల సహాయ కార్యదర్శులు ఇంజయ్ హేమలత, మూల పోచయ్య తదితరులు పాల్గొని సిద్ధారెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సేంద్రీయ వ్యవసాయంపై అన్నదాతలు అవగాహన పెంచుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బూర్గుల రైతు వేదికలో రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం, ప్రాధాన్యత, లాభాలు, అమలు విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాంబాబు, తేజ్‌కుమార్. రిసోర్స్ పర్సన్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సంక్షేమం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలోని శివాలయంలో బుధవారం శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి వీరేశం, శివానందం, కరుణాకర్, మల్లిఖార్జున్ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమం, శాంతి సౌభాగ్యాలను అందాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటమ్మగూడ సర్పంచ్ గొర్లపల్లి అశోక్, వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, మొదళ్ళగూడ సర్పంచ్ పెంద్యాల అరుణ రాజు, బిఆర్‌ఎస్ నేతలు జంగిలి కుమార్, శ్రీశైలం, వార్డు సభ్యులు గుండాల శ్రీనివాస్, ఎర్రమోళ్ల జగన్, గుండాల రవి, వెంకటేష్, భగవాన్ రాజు, శ్రావణ్, కుమ్మరి సురేష్, భరత్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమం సాధ్యమవుతుందని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామం మొళ్లగడ్డ తండాలో పాత్లావత్ మోతికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను సర్పంచ్ పూజారి లక్ష్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాత్లావత్ శివ, తాళ్ల నర్సింలు, యాదయ్య, కనుగంటి శేఖర్ యాదవ్, సత్యం, కూరగాయల చిన్నయ్య, కానుగుల సత్యం, భద్రునాయక్, ఠాకూర్‌నాయక్ పాల్గొన్నారు.

## పాపకంటి శేఖర్ వర్ధంతి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు దివంగత పాపకంటి శేఖర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పట్టణంలో షాద్‌నగర్ జెఏసి ఆధ్వర్యంలో పాపకంటి శేఖర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో తాలుకా చైర్మెన్ జనార్ధన్, వైస్ చైర్మెన్ మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, కొందుర్గు మాజీ వైస్ ఎంపిపి మంగులాల్ నాయక్, సిఐటియు రాజునాయక్, పాపకంటి కృష్ణ, మాణిక్యం, సీతారాములు, భీష్వ రామకృష్ణ, మందారం నర్సింలు, ఏఐఎస్‌ఎఫ్ నేత పవన్ చౌహాన్, రవీంద్రనాథ్, అర్జున్‌కుమార్, కేశంపేట మండల అధ్యక్షుడు వీరేశంలే పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కలతో పొంచిఉన్న ప్రమాదం



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల పరిధిలోని లేమామిడి గ్రామం నుండి నిర్ధవెళ్ళి వెళ్ళె ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను బుధవారం సర్పంచ్ సులోచన శ్రీను వాటిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కను ఎక్కువగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, గ్రామస్తులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, బి.రమేష్, ఎండి బాసిద్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, ఆంజనేయులు, రఘు, ఖైండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఇందిరమ్మ లబ్దిదారులకు ప్రొసిడింగ్స్‌ను ఎంపిడిఓ లక్ష్మీఅనురాధ అందజేశారు. బుధవారం కొందుర్గు గ్రామ పంచాయతీలో ప్రజాపాలనలో భాగంగా 20మంది ఇందిరమ్మ లబ్దిదారులకు మంజూరైన ప్రొసిండిగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లక్ష్మీ అనురాధ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్దిదారులకు ఇండ్లు మంజురయ్యాయని, వాటిని త్వరగా నిర్మించుకునేందుకు కృషి చేయాలని,ఇంటి నిర్మాణాలను బట్టి బిల్లులు వస్తాయని, లబ్దిదారులు ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేఖ, కాంగ్రెస్ నాయకులు దామోదర్ రెడ్డి, చైర్మెన్ కృష్ణయ్య, షిర్ప మల్లయ్య, కాడిగళ్ల మహేంద్రనాథ్, రాములు గౌడ్, కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### మైనారిటీల ఆర్థిక సాధికారతకు

# ప్రభుత్వం కట్టుబడి ఉంది



రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న పలు పథకాల కింద అర్హులపైన లబ్ధిదారులకు సామగ్రి అందజేశారు. ఆర్థిక సహాయ పథకాలను, శిక్షణఉద్యోగ ప్లేస్మెంట్ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమానికి రూ.3,500 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబడి ఉందనడానికి ఇది నిదర్శనమని తెలిపారు. మైనారిటీలలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా సబ్సిడీ ఆధారిత పథకాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని స్థిరమైన జీవనోపాధిని సాధించాలని మంత్రి తెలిపారు. లబ్దిదారులకు మంజూరైన మోపెడ్లు, ఈబైక్‌లను హరిత జెండా ఊపి అందచేశారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. దరఖాస్తులు ఈనెల 19 నుండి 28వ తేది వరకు అధికారిక వెబ్సైట్ లో స్వీకరించబడతాయని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్‌ఇఐఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రియాజ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి ఇలియాస్ అహ్మద్, మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు, రాపిడో, ఉబెర్, టీవీఎస్ సంస్థల ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### రాజేంద్రనగర్ లక్ష్మిగూడలో

## చదరపు గజం రూ.51వేలు

బహిరంగ వేలం ద్వారా 14 ప్లాట్ల విక్రయం.

హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజేంద్రనగర్ మండలం, లక్ష్మిగూడలోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్లకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలానికి మంచి స్పందన లభించింది. చదరపు గజం అత్యధికంగా రూ.51వేల ధర, అతి తక్కువగా రూ.36వేల ధర పలికింది. మొత్తం 14 ప్లాట్లను రూ.14.75 కోట్లకు విక్రయించారు. ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు హౌసింగ్ బోర్డు ఈ నెల 2వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. బుధవారం నాడు నిర్వహించిన వేలం పాటలో 49 మంది కొను గోలుదారులు పాల్గొన్నారు. ఈ భూములకు చదరపు గజానికి రూ. 32 వేలను అప్ సెట్ ప్రైజ్ గా (కనీస ధరగా) నిర్ధారించగా, వేలం పాటలో గరిష్టంగా చదరపు గజంరూ.51 వేలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 14 ప్లాట్ల విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించిన భూముల విక్రయాల్లో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికిందని, సగటున చదరపు గజం భూమి రూ. 44,285 ధర పలికిందని ఆయన వివరించారు.

**మొత్తం విక్రయించిన ప్లాట్లు** : 14
**అప్సెట్ ధర** : చదరపు గజానికి రూ 32వేలు.
**అత్యధిక బిడ్** : చదరపు గజానికి రూ 51వేలు.
**కనిష్ట బిడ్** : చదరపు గజానికి రూ 36వేలు.
**సగటు బిడ్** : చదరపు గజానికి రూ.44,285 .

### బాల్క సుమన్ అరెస్టు..

## ప్రజాస్వామ్య హక్కులపై దాడి

బిఆర్‌ఎస్ శాసనసభ పక్ష ఉపనేత సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, బాల్క సుమన్ అరెస్టు, ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ శాసనసభ పక్ష ఉపనేత సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలలో బిఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నా, చైర్మన్ పదవి దూరం చేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకులను అణచివేయడానికి పోలీసులను ఉపయోగించడం సరైంది కాదని గుర్తు చేశారు. ఘటనల్లో బాధితులైన బిఆర్‌ఎస్ నాయకులపైనే కేసులు పెట్టడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కౌన్సిలర్లపై జరిగిన దౌర్జన్యంపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మెజారిటీ మాదే అయినప్పటికీ అడ్డంకులు సృష్టించడం రాజకీయ అసహనానికి సూచిక అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారం శాశ్వతం కాదన్నారు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారన్నారు. బాల్క సుమన్‌తోపాటు అరెస్టయిన బిఆర్‌ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ సెక్యులరిస్టు



సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్



**ప్రజాపక్షం/యాకుత్‌పురా :** మనువాద శక్తులు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను హిందూ సామ్రాట్‌గా అభివర్ణిస్తూ ... ఆయన ముస్లింలకు వ్యతిరేకంగా నిలిచారని తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు చరిత్రను తిప్పికొడుతూ సిపిఐ నాలుగు భాషలలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేయడం జరిగిందని స్టాలిన్ వివరించారు. ఈ మేరకు చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి ఉత్సవాల సందర్భంగా చత్రినాక లేబర్ చౌరస్తాలో ఆయన చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ సెక్యూలరిస్టు అని, ఆయన సైన్యంలో 30 శాతం ముస్లింలు ఉన్నారని.. వారు అంగరక్షకులుగా, సర్వ సైన్యాధ్యక్షులుగా, విదేశాంగ వ్యవహారాలు చూసే వారని పేర్కొన్నారు. శివాజీ చరిత్రను వక్రీకరిస్తూ, హిందూ, ముస్లింల మధ్య మతవిద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్న మతవాదుల ఆటలిక సాగవని స్టాలిన్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ గౌలిపుర డివిజన్ కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్, అరుణ్, నాగరాజు, సాయి, కాశీనాథ్, మహేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఛత్రపతి మహారాజ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**హైదరాబాద్ :** ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ చరిత్రను ముద్రించిన కరపత్రాలను బుధవారం మైలార్‌గడ్డ ఆటోస్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కరపత్రాలను పంచుతూ జయంతి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. రాజ్యాల మధ్య అధికారం కోసం జరిగిన యుద్ధాన్ని హిందూ, ముస్లిం యుద్ధంగా చిత్రీకరించి దశాబ్దాలుగా రాజకీయ లబ్ధి పొందుతున్న మతోన్మాదుల చరిత్ర వక్రీకరణను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, యాకయ్య,రవి, శంకర్, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### పోరాడి సాధించుకున్న తెలంగాణలోనూ

# ఉమ్మడి పాలమూరు జిల్లాకు అన్యాయమే

ప్రొఫెసర్ హరగోపాల్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయమే జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పాలమూరు జిల్లా మీదుగా కృష్ణానది జలాలు ప్రవహిస్తున్నా తాగునీరు, సాగునీటి కోసం అనేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రతి ఎన్నికల్లో లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా, ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల హామీగానే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ మిగులుతుందే తప్పా, అడుగు ముందుకు పడటం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సైతం పాదయాత్ర చేసిన సమయంలో లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని పరిశీలించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పి నేటికి రెండేళ్లు అవుతున్నా పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు విషయంలో పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ నేతృత్వంలో అనేక పోరాటాలు చేయడంతోపాటు ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ డిజైన్లు మార్చారే తప్పా పనులు చేపట్టలేదని వివరించారు. షాద్‌నగర్ ఎత్తైన ప్రాంతంలో ఉందని, వర్షాదార పంటలు తప్పా మరో పంటలు సాగుచేసుకునేందుకు అవకాశం లేదని, దాంతో ఈ ప్రాంతంలోని ప్రజలు వలసలు వెళ్తున్నారని వివరించారు. జీవనోపాధికోసం వలసలు వెళ్ళి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా రాజకీయ నాయకుల్లో మాత్రం చలనం రావడం లేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికి ప్రాజెక్టుల విషయంలో పురోగతి లేదన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ కోసం అన్ని వర్గాల ప్రజలు ఏకమై పోరాడితేనే సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల ద్వారా నల్లగొండకు నీళ్ళు తరలించే ప్రయత్నం జరుగుతుందని, దీనిపై ప్రజలు పోరాడితేనే సాధించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తేనే వలసలు అగుతాయనే విషయాన్ని నాయకులు గుర్తించే వరకు పోరాటాలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సదస్సులో ఆర్థిక శాస్త్రవేత్త డి.నరసింహారెడ్డి, పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహకార కార్యదర్శి తిరుమలయ్య, రవీంధ్రనాథ్, అర్జునప్ప, టిజి శ్రీనివాస్, మదారం నరసింహులు పాల్గొన్నారు.

## పార్కు స్థలం కబ్జాకు యత్నం

ముస్సిపల్ సిబ్బంది రంగం ప్రవేశంతో నిలిపివేసిన వైనం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇది ప్రభుత్వ స్థలం..పార్కు కోసం కేటాయించడం జరిగింది.. అంటూ మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి యంత్రాలతో చదును చేయిస్తూ పార్కు స్థలం కబ్జాకు యత్నించిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ శివారులోని సర్వే నంబర్ 28లో 21ఎకరాల 20గుంటల భూమి విస్తీర్ణంలో వెంకటేశ్వర వెంచర్ పేరుతో సుమారు 23ఏళ్ళ క్రితం చేశారు. అప్పట్లో గ్రామ పంచాయతీ లే ఔట్ చేసి ప్లాట్లను వివిధ రంగాల వారికి విక్రయించారు. వెంచర్‌లోని ప్లాట్లను విక్రయించి దాదాపు 23ఏళ్లు గడుస్తునప్పటికి కొంతమంది ప్రభుత్వానికి కేటాయించిన స్థలంపై కన్నేశారు. ఎలాగైనా ఈ స్థలాన్ని కాజేయాలని నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి ఈ స్థలం మాదే అంటూ డోజర్‌తో చదును చేయించారు. ఈ విషయాన్ని గమనించిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన యాజమానులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమీషనర్ సునీతారెడ్డి తమ సిబ్బందిని హుటాహుటిన ఘటన స్థలానికి పంపించి డోజర్‌తోపాటు పనులు చేయిస్తున్న వ్యక్తులను కార్యాలయానికి తీసుకువెళ్ళారు.

**ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తే ఉపేక్షించేది లేదు....** ప్రభుత్వా స్థలాలలను అక్రమిస్తే ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ మున్సిపల్ కమీషనర్ సునీతారెడ్డి హెచ్చరించారు. పార్కు స్థలాన్ని చదును చేస్తున్న డోజన్‌ను అక్కడి నుండి పంపించామని, స్థలానికి సంబంధించిన పత్రాలు ఏమైన ఉంటే మున్సిపల్ కార్యాలయంలో చూసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# కుష్టు వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు

ఎన్‌హెచ్‌ఆర్‌సి
లెప్రసీ స్పెషల్ మానిటర్
ప్రదీప్తాకుమార్ నాయక్








**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కుష్టు వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించటమే లక్ష్యమని ఎన్‌హెచ్‌ఆర్‌సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్ అన్నారు. బుధవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనానికి చేరుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్‌కు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ కె.లలితాదేవి, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ప్రదీప్తా కుమార్ నాయక్, అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ కలిసి పాల్గొన్నారు. కుష్టు వ్యాధి నియంత్రణ చర్యలు అమలు, అలాగే వ్యాధి బారిన పడిన వ్యక్తుల మానవ హక్కుల పరిరక్షణ అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తుల హక్కులు, సామాజిక సమానత్వాన్ని రక్షించడం ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రధాన బాధ్యతని అన్నారు. కుష్టు వ్యాధి అనేది పూర్తిగా నయం చేయగలిగిన వ్యాధి అని, సమయానికి మెరుగైన ఔషధ చికిత్స అందిస్తే పూర్తిస్థాయిలో నివారణ సాధ్యమని ఆయన వివరించారు. ఆలస్యంగా గుర్తించబడితే శాశ్వత వికలాంగతకు దారితీయవచ్చని ఆయన హెచ్చరించారు. కుష్టు వ్యాధిని కేవలం వైద్య సమస్యగా కాకుండా, అపోహలు, సామాజిక వివక్షతో ముడిపడిన సామాజిక సమస్యగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో అవగాహన పెంపు, తొందరగా గుర్తింపు, ఆరోగ్య సేవలకు సులభ ప్రాప్తి, సామాజిక భద్రతా పథకాలు అలాగే విభాగాల మధ్య సమన్వయం తో హక్కుల ఆధారిత సమగ్ర దృక్పథం అవలంబించాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా లెప్రసీ బాధితులకు అందుతున్న వసతులపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ కె లలితాదేవి జిల్లాలో కుష్టు నియంత్రణ కార్యక్రమంకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కుష్టు వ్యాధి గ్రస్తుల వివరాలు, వారికి అందుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, మానవ హక్కుల ప్రతినిధి డాక్టర్ నాయక్ శాఖల వారీగా సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని, కుష్టు వ్యాధిగ్రస్థులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా, అందరు అధికారులు మానవత్వంతో పని చేయాలని సూచించారు. కుష్టు వ్యాధి కార్యక్రమం జాయింట్ డైరెక్టర్, డాక్టర్ జాన్ బాబు కుష్టు వ్యాధి వ్యాప్తి జరిగే విధానం, లక్షణాలు, చికిత్స, కుష్టు వ్యాధి నియంత్రణలో అందరి పాత్రను పూర్తిగా విశదీకరించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబికా, ఇబ్రహీంపట్నం ఉప జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి డాక్టర్ లక్ష్మి ప్రసన్న, జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన, డెమో కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన మున్సిపల్ చైర్పర్సన్ అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌తో చైర్మన్ అభివృద్ధి విషయంపై చర్చించారు. అభివృద్ధిక తన వంతు సహకారం ఉంటుందని, స్పీకర్ సహాయంతో నిధులు తీసుకువచ్చి వికారాబాద్ మున్సిపల్‌ను అదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దాలని తెలిపారు. కలెక్టర్ కలిసిన వారిలో కౌన్సిలర్ రాకేష్, శ్రీకాంత్ ఉన్నారు.

## రంజాన్ ఉపవాసాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అధ్యక్షతన బుధవారం రంజాన్ పవిత్ర మాస ఉపవాస దీక్షల ఏర్పాట్లపై అధికారులు, మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం శాంతి, సహనం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా పండుగను జరుపుకునేలా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం, వీధి దీపాల ఏర్పాటు, రహదారి శుభ్రత, చెత్త తరలింపు, వీధి కుక్కల బెడద వంటి సమస్యలను



త్వరితగతిన పరిష్కరించి ఉపవాస దీక్షలు చేసే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం మసీదుల వద్ద నెలకొన్న పలు సమస్యలు, ఏర్పాట్లపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు శంకర్ సింగ్, శ్రీపాదరావు, లావణ్య, సాబేర్ అలీ, క్రిష్ణారెడ్డి, ఎమ్మార్వోలు అశోక్, రాజేశ్వర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ డీజీఎం రవి నాయక్, వికాస్, విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీకాంత్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, మసీదు కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** జీడిమెట్ల గ్రామానికి చెందిన కుమ్మరి లలిత అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకులు కాలే గణేష్, బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష రూపాయలు మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని బుధవారం చింతల్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజల ఆపద్బాంధవులు ఎమ్మెల్యే వివేకానంద అని కొనియాడారు. ఆర్థికంగా సతమతమవుతూ మెరుగైన వైద్యంకోసం ఎదురుచూసే ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంట సిద్ధి రాములు, నరేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్లకంటి కుమార్, ఆటో బలరాం, బాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌లో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా తెలుస్తుందన్నారు. ప్రజల సమస్యలను కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కారించడం తన ముందున్న కర్తవ్యం అన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. తనవంతు పరిష్కరించడం జరుగుతుందన్నారు. గాంధీకాలనీలోని పార్కులో ఉన్న ప్లాస్టిక్, పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో వాహనాల రాకపోకలు ఎక్కువైనందున స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరడంతో ఏర్పాటు చేయడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రామయ్యగూడ ఆటోస్టాండ్ దగ్గర మురుగు రోడ్డుపైన పారుతోందని సోషల్ మీడియాలో వస్తున్నదని పరిశీలించి త్వరలో పనులు పూర్తిచేయడం జరుగుతుందన్నారు. బిజెఆర్ చౌరస్తాలో అండర్ డ్రైనేజ్ పొంగి పోర్లుతున్న దానిని పరిశీలించి పరిష్కారమార్గం చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏసుదాస్, వినోద్, వార్డు ప్రజలు, మధుకర్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## జంగమ్మను పరామర్శించిన ఏసురత్నం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి తల్లి వనంపల్లి జంగమ్మ ఫిబ్రవరి 12వ తేదీన ఉదయం 9గంటలకు వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తీవ్ర



గాయాలు పాలవడంతో మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం బుధవారం పరామర్శించారు. జంగమ్మ తొందరగా కోలుకోవాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అధైర్యపడవద్దని తెలిపారు.

# రాంకీ కాంట్రాక్టును రద్దు చేయాలి

### జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్టను దెబ్బతీస్తూ, నగరాన్ని 'చెత్త హైదరాబాద్'గా మార్చిన రాంకీ సంస్థ కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్ డిమాండ్ చేశారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. జిహెచ్ఎంసిలో ఉద్యోగుల సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయని ఆరోపించారు. గత రెండేళ్లుగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ప్రయోజనాలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతక్షణమే స్పందించి వారికి రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న డిఎలను, పిఆర్‌సిలను వెంటనే అమలు చేయాల ని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు ఎన్నో క్లీన్ అండ్ గ్రీన్ అవార్డులు అందుకున్న హైదరాబాద్ నగరం ప్రస్తుతం రాంకీ సంస్థ పుణ్యమా అని చెత్త నగరంగా మారిందని ఆరోపించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలంటే ఆ సంస్థ అప్పగించిన చెత్త బాధ్యతలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ అంశాలపైన ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన బాట పడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. అమరేశ్వర్, నాయకులు బి. కన్నా, వై. కృష్ణ, అశోక్, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌పై మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదు

### ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గాంధీ భవన్ లో బుధవారం సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా కెటిఆర్ వ్యాఖ్యలకు స్పందిస్తూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని సమర్థించారు. సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని ఆయన అన్నారు. గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి చూపిన పోరాట స్వరూపాన్ని మళ్లీ చూడాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అగ్నిపర్వతం లాంటి రేవంత్ రెడ్డి ఎదురైతే మాడి మసి అవుతారు అని వ్యాఖ్యానించారు. బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని దొరల తెలంగాణాగా మార్చారని బిఆర్ఎస్‌పై ఆరోపించారు. కెటిఆర్ మాటలు చూస్తే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ వాదాన్ని, తెలంగాణ పదాన్నే బీఆర్ఎస్ నాయకత్వమే చంపిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ కారులు, అమరులను కూడా బిఆర్ఎస్ నాయకత్వం మోసం చేసిందని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తున్నారని ఆయన కొనియాడారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసింది బిఆర్ఎస్ పార్టీయేనని ఆరోపించారు.

## ఐఎన్‌టియుసి ముఖ్య ఉపాధ్యక్షుడిగా మొగుళ్ళ రాజిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులుగా మొగుళ్ళ రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాజి రెడ్డికి నియామక పత్రాన్ని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ కార్మిక సంఘాలు కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు కోసం, కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం మరింత ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ఐఎన్‌టియుసి అధినాయకత్వం తనపై విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తిస్తానని, యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ప్రకటించారు.

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలపై

## అసత్యప్రచారాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/కొడంగల్:** ముదిరాజ్‌ల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తిరుపతిరెడ్డిపై అసత్యపచారాలు మానుకోవాలి అని రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మద్దూరు మున్సిపల్ ఎన్నికల్లో ముదిరాజులకు మాట ఇచ్చి చైర్మన్ పదవి ఇవ్వలేదు అని కొందరు అసత్య ప్రచారాలు చేయడం చాలా దారుణం. అసలు మద్దూరులో ముందుగా ఎవరిని కూడా చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించలేదు కాని గోవింద్ కు ఇవ్వడం జరిగిందని మాట నిలబెట్టుకోలేదని అసత్య ప్రచారం చేయడం కరెక్టు కాదు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలపై అసత్య ప్రచారాలు చేయడం మంచిది కాదు అని అన్నారు. దీన్ని అసరాగా చేసుకోని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లను మోసం చేస్తుందని అసత్యప్రచారం చేయడం మంచిది కాదు అని అన్నారు. బిఆర్ఎస్ సమయంలోనే ముదిరాజ్‌లు ఎక్కువగా నష్ట పోవడం జరిగిందన్నారు. రాష్ట ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఎక్కువగా అవకాశం కల్పిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మద్దూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహులు వెంకటయ్య, రాజ్‌గోపాల్ ముదిరాజ్, మల్లయ్యముదిరాజ్, మల్లయ్య, రమేష్ , ప్రకాష్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# నిన్న కుత్బుల్లాపూర్, నేడు దుండిగల్ సర్కిల్, రేపు ఎక్కడా?

### సర్కిల్ కార్యాలయాలలో వరుస ఎసిబి దాడులు




**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. డిఎస్‌పి గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దుండిగల్ సర్కిల్ కార్యాలయం ఆఫీస్ మొదలు కాకముందే చేరుకున్న అధికారులు నేరుగా డిప్యూటీ కమీషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ క్యాబిన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆయా శాఖల అధికారులతోపాటు అన్ని శాఖల ఉద్యోగుల సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎసిబి అధికారులు వరుస దాడులు నిర్వహిస్తుండడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.మంగళవారం చింతల్ సర్కిల్ లో తనిఖీలు నిర్వహించి ఓ బిల్ కలెక్టర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు. దుండిగల్ సర్కిల్ కి అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉదయం నుండి తనిఖీలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో పాటు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఆయా శాఖల సిబ్బంది బుధవారం గైరు హాజరయ్యారు. వారి సెల్ ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయా విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించిన అధికారులు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్.పి గంగసాని శ్రీధర్ మాట్లాడుతూ, కంప్లైంట్స్ లో భాగంగా సర్ప్రైజ్ చెకింగ్ చేసినట్లు తెలిపారు. అనాథరైజ్డ్ ఉద్యోగులను గుర్తించామన్నారు. సానిటేషన్‌లో పని చేస్తున్న సిబ్బందికి, రికార్డుల్లో చూపుతున్న సిబ్బందికి పొంతనలేదన్నారు. ఫిర్యాదులో భాగంగా ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపాడు.ప్రతి శాఖలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల మున్సిపాలిటీ నుండి జిహెచ్ఎంసికి మారడం వల్ల రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవన్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎక్కువ అవినీతి జరిగిందన్నారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీచేసి మూడు నెలలు గడుస్తున్నా వాటిపై చర్యలు తీసుకోలేదన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా గైరుహాజరైన ఉద్యోగులపై చర్యలు ఉంటాయన్నారు. మరికొన్ని రోజులు దాడులు తప్పవని హెచ్చరించారు.

## అభివృద్ధికి కట్టుబడి ఉంటా

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి మున్సిపల్‌లోని నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం అనంతరం తమ వార్డుల్లో ఉన్న మౌలి క వసతుల కల్పనపై 14వ వార్డు కౌన్సిలర్ అనం సరిత ఆంజనేయులు దృష్టి పెట్టారు. బుధవారం తమ వార్డులో పారిశుధ్య పనులు, త్రాగునీరు సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. పార్టీల కు అతీతంగా వార్డుల్లో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌కు కమిషనర్, సిబ్బంది శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరజ బాల్‌రెడ్డికి మున్సిపల్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. తాండూరు మున్సిపల్ కమీషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యాన అధికారులు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరజ బాల్‌రెడ్డి దంపతులను, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్‌లను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

## 'హలీం' తయారీలో శుభ్రత పాటించాలి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రంజాన్ పర్వదినాల్లో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా హలీం తయారీదారులు పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి సూచించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో హలీం తయారీదారులతో సమావేశం జరిగింది. రంజాన్ పర్వదినాల సందర్భంగా హలీం తయారీ, విక్రయాల సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, భద్రతా చర్యలపై ఈ సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హలీం తయారీ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, మాంసం సక్రమంగా హ్యాండ్లింగ్ చేయాలని, నిర్దిష్ట ఉష్ణోగ్రతల్లోనే వంట చేయాలని సూచించారు. వండిన హలీంను సురక్షితంగా చల్లబరచి నిల్వ చేయడం, సరైన విధంగా సర్వ్ చేయడం వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా, వ్యర్థాలను సక్రమంగా పారవేయాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు




తీసుకోవాలని, వీధి కుక్కలు చేరకుండా జాగ్రత్త లు తీసుకోవాలని స్పష్టం చేశారు. రంజాన్ నెలలో ప్రజల ఆరోగ్యం, భద్రత కు ఎలాంటి భంగం కలగకుండా అన్ని మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని హలీం వ్యాపారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ (పారిశుధ్యం) సి.ఎన్.రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, హేమంత కేశవ్ పాటిల్, రాధికా గుప్తా, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, ఫుడ్ సేఫ్టీ, వెటర్నరీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి 'మైక్యూర్' యాప్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాంకేతికత దన్నుగా నగర పాలనను మరింత బలోపేతం చేస్తూ, పౌర కేంద్రిత సేవలకు ప్రాధాన్యం ఇస్తూ జిహెచ్ఎంసి 'మైక్యూర్' యాప్‌ను ప్రారంభించింది. అప్లికేషన్ ప్రత్యేకతలను జిహెచ్ఎంసి తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. నగరంలోని పౌర సేవలను సులభతరం చేసి, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే ఈ యాప్ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 'మై జిహెచ్ఎంసి' యాప్‌కు బదులుగా రూపొందించిన 'మైక్యూర్' యాప్ ద్వారా అన్ని పౌర ఫిర్యాదు సేవలను ఒకే వేదికపై




అందుబాటులోకి తీసుకొచ్చారు. వినియోగదారులకు అనుకూలంగా రూపొందించిన ఇంటర్‌ఫేస్, ఫిర్యాదులపై తక్షణ స్థితిగతుల సమాచారం, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం వంటి సదుపాయాలతో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పడమే లక్ష్యమని వెల్లడించారు. సానిటేషన్, వీధి దీపాలు, రహదారులు, కాల్వలు, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై పౌరులు నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు. వాటి పరిష్కార స్థితిని యాప్ ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంటుంది. పౌర సేవలన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపై సమీకరించే 'వన్ స్టాప్ సొల్యూషన్'గా ఈ యాప్ పనిచేస్తుందని, కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు వివరించారు.



## గవర్నర్ చేతుల మీదుగా సెరినిటీ విద్యార్థులకు విశిష్ట ప్రతిభా రత్న అవార్డులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** హిందీ సేవా సదన్ మహావిద్యాలయ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హారిక, ఆరాధ్య గవర్నర్ చేతుల మీదుగా విశిష్ట ప్రతిభా రత్న పురస్కారం అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం సాధించి 2 వేల 500 రూపాయల నగదు పురస్కారం, బంగారు పతకం, ప్రశంసా పత్రం గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ. పుండ్లిక్

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమవుతాయని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవాబుపేట ఎస్సై జీ.పుండ్లిక్ అన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నవాబుపేట మండలంలోని ఆర్కాతల గ్రామంలో పోలీస్ కళాకారుల బృందంతో ఎస్సై జీ. పుండ్లిక్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. మాదక ద్రవ్యాలు వల్ల జరిగే అనర్థాలపై యువతకు చెడు వ్యసనాల వలన జీవితాలు ఛిన్నాభిన్నం



అవుతున్నాయి. చిన్న వయసులోనే మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టాలి. మత్తు పదార్థాల వినియోగం జీవితాలను చిత్తుచేసి నాశనం చేస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యువత సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపిటిసి దేవయ్య, ఉపసర్పంచ్ బాబయ్య, నాయకులు గంజాయి రాములు, వెంకటరమణ, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సంతు సేవాలాల్ జయంతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్రీశ్రీశ్రీ సద్గురు సంతు సేవాలాల్ మహరాజ్ 287వ జయంతిని పురస్కరించుకుని కుషాయిగూడ చక్రీపురంలో వేడుకలను శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తిభావంతో ఘనంగా నిర్వహించారు.సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బంజారా సభ్యులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అన్నంరాజు శ్రీనివాస్,ఉమాశంకర్‌గౌడ్, డి. నాథం, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## లింగోళ్ల సాయిబాబుగౌడ్‌కు ఘన నివాళి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటి యాడారం గ్రామానికి చెందిన గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి లింగోళ్ల సాయిబాబుగౌడ్ ఈ నెల 8న అకస్మాత్తుగా మృతి చెందారు. బుధవారం యాడారంలో నిర్వహించిన లింగోళ్ల సాయిబాబుగౌడ్ దశదిన కార్యక్రమానికి గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, ఇతర నాయకులు విచ్చేసి కీర్తి శేషులు లింగోళ్ల సాయిబాబుగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ లింగోళ్ల సాయిబాబుగౌడ్ గీత పనివారల సంఘంలో చురుకుగా పనిచేస్తు గీత పనివారల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేశాడని తెలిపారు. గీత పనివారల డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు చొరవ చూపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లింగోళ్ల హనుమాన్‌దాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
19-02-2026
www.prajapaksham.in

'ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' పేరుతో కొత్త సినిమాను అందించేందుకు ధీరజ్ మొగిలినేని సిద్ధమవుతున్నారు. చిల్డ్రన్ మూవీగా నిర్మించిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా టైటిల్ ప్రకటించారు.'

రీల్

# కథను నమ్మి సినిమాలు చేయాలి



సుహాస్ హీరోగా నటించిన 'హే బల్వంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో శివానీ నాగారం హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంకు సంబంధించి టైటిల్ మార్పు ఈవెంట్ను హైదరాబాద్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో సందీప్ కిషన్ హాజరైయ్యారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ సుహాస్ నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాలు అన్నీ చూశాను. కథను నమ్మి సినిమాలు చేసే హీరో. నిజయితీగా కష్టపడతాడు. ఈ సినిమాకు టైటిల్ మారిన అందరూ సుహాస్ సినిమా అంటారు. ఈ సినిమాతో సుహాస్ ఆడియన్స్ మనసులు మరోసారి గెలుచుకుంటాడు. ఈ సినిమా టీజర్ చూడగానే నాకు ఆసక్తికరంగా అనిపించింది. సినిమాను ప్రమోట్ చేసిన విధానం బాగుంది. తప్పకుండా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. కథానాయకుడు సుహాస్ మాట్లాడుతూ ఎంతో కష్టపెట్టి ఓ మంచి సినిమా తీశాడు. శివానీ, సుదర్శన్లు ఇద్దరూ సూపర్గా యాక్ట్ చేశారు. నా కెరీర్లో మజిలీ సినిమాతో బ్రేక్ వచ్చింది. మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఆ సమయంలోనే పెద్ద హీరోయిన్తో ఓ సినిమాలో ఆఫర్ వచ్చింది. సినిమాలో హీరోయిన్తో క్లోజ్గా ఉండే పాత్ర అది. నా ముందే ఒకాయన సెట్లో ఇంతనెందుకు పిలిచారు? కానీ కట్ చేస్తే కీర్తిసురేష్తో కలిసి ఉప్పు కప్పురంబు అనే సినిమా చేశాను. నేను గ్రేట్గా ఫీలయిన మూమెంట్ అది. ఎవరైనా మిమ్మలను తక్కువ చేసి మాట్లాడితే మీరు నవ్వి ఊరుకోండి.. ఎవరైనా ఏదైనా సాధించవచ్చు. ఇక 'హే బల్వంత్'తో నాకు పెద్ద హిట్ వస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.శివానీ నాగారం మాట్లాడుతూ '' ఈ సినిమా టైటిల్ మారగానే అందరం టెన్షన్ పడ్డాం. కానీ ఆ భగవాన్ బల్వంత్గా మార్చాడు. సుహాస్తో నాకు స్పెషల్ సినిమా. అంబాజీ పేట సినిమాలో మనం చాలా సినిమాలు చేయాలి. నీ ప్రతి బ్లాక్బస్టర్లో నేనుండాలి అని అన్నారు. కార్యక్రమంలో నిర్మాత వంశీ నందిపాటి, నిర్మాత బి.నరేంద్ర రెడ్డి, దర్శకుడు గోపీ అచ్చర తదితరులు పాల్గొన్నారు.

## 27న వస్తున్న ''ఉత్తుత్త హీరోలు''

'ఉత్తుత్త హీరోలు' సినిమాను ఎంవిఎం పిక్చర్స్ బ్యానర్పై మహేష్ విట్ట నిర్మించారు. మహేష్ విట్ట తొలిసారిగా నిర్మాణంలోకి అడుగుపెట్టారు, రాయలసీమ నేపథ్యంలో సాగే కథనాన్ని ఎంచుకున్నారు. మహేష్ విట్ట ఈ ప్రాజెక్ట్లో నిర్మాతే హీరోగా రాబోతున్నాడు. ఉత్తుత్త హీరోలు రాయలసీమ ప్రాంతం నేపథ్యంలో హాస్యం, ఉత్కంఠ భరితమైన అంశాలను మిళితం చేస్తూ ఆకర్షణీయమైన కథనాన్ని అందిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు, అలాగే 'రాయలసీమ నుండి వచ్చిన మొదటి కల్ట్ ఫిల్మ్' చిత్ర షూటింగ్ మొత్తం కడప జిల్లాలో చేసినట్లు, కడప జిల్లా నుండి ఎంచుకున్న 75 మంది నూతన నటీనటులను పరిచయం చేస్తున్నట్లు మహేష్ విట్ట తెలిపారు. ప్రామాణికమైన రాయలసీమ భాష యాసతో 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మహేష్ విట్టాతోపాటు ప్రవీణా సోని, తారక్ సతీష్, వాల్తేర్ వినయ్, రాహుల్ రాజ్ వనం, హర శ్రీనివాస్, భరత్ బెహరా తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## 'బుకీ' తమిళంలో సక్సెస్ అయింది

విజయ్ ఆంటోనీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బుకీ'. విజయ్ ఆం టోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్పై రామాంజేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్ లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది. తెలుగులో ఈ సినిమా ఫిబ్రవరి 20న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ నటుడు విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ ఈ వేడుకకు మంచు లక్ష్మి రావడం చాలా ఆనందంగా ఉంది. వారితో కలిసి మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను. గణేష్ అద్భుతమైన డిఓపీ, దర్శకుడు. ఈ సినిమా మ్యాసీవ్ హైబడ్జెట్ మూవీలా కనిపించడానికి కారణం కూడా తన విజన్. ఈ సినిమా తర్వాత కచ్చితంగా మీరందరూ ఆయన్ని సపోర్ట్ చేస్తారు. భాష్యశ్రీ తో బిచ్చగాడు నుంచి జర్నీ కొనసాగుతోంది. ఈ సినిమాకి అద్భుతమైన మాటలు రాశారు. అజయ్ మార్గన్ తో చాలా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. బుకీ కూడా తన నటన మీ అందరినీ అలరిస్తుంది. తెలుగు ఆడియన్స్ ఒక మంచి టాలెంట్ ని సపోర్ట్ చేస్తారు. తనని కూడా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ధనుషా స్క్రీన్ పై చాలా క్యూట్ గా ఉంటుంది. ఈ సినిమాలో లక్ష్మి , సునీల్ పెర్ఫార్మెన్స్ అదిరిపోతుంది. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తున్నప్పుడు ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి. అంతా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. నిర్మాత రామ్తో మార్గన్ నుంచి అసోసియేషన్ ఉంది. సురేష్ ప్రొడక్షన్స్ కి కృతజ్ఞతలు. వారితో మా అసోసియేషన్ కొనసాగుతుంది. ఫిబ్రవరి 20న థియేటర్స్ లకి వస్తున్నామని చెప్పారు. నటి మంచు లక్ష్మి మాట్లాడుతూ గత శుక్రవారం ఈ సినిమా తమిళ్లో రిలీజ్ అయ్యి అద్భుతమైన రెస్పాన్స్ ని అందుకుంది. ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన క్యారెక్టర్ చేశాను. ఈ కార్యక్రమంలో హీరో అజయ్ దిషన్, హీరోయిన్ ధనుషా, డైరెక్టర్ గణేష్ చంద్ర, రచయిత భాష్యశ్రీ పాల్గొన్నారు.

## అనిల్ రావిపూడి క్లాప్‌తో సత్యదేవ్, ఫరియా చిత్రం షురూ



హీరో సత్యదేవ్ తన కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. సత్యదేవ్ నటిస్తున్న 15వ చిత్రమిది. ఈ చిత్రాన్ని త్రిశూల్ విజినరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నాయికగా నటిస్తోంది. బుధవారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ పూజా కార్యక్రమాల తో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టారు. ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విచ్ఆన్ చేశారు. లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి ఫస్ట్‌షాట్‌కు డైరెక్షన్ చేశారు. డైరెక్టర్ లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ మా సినిమా జానర్ ఏంటి అని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమి ది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తున్నాం. రామ్ మిరియాల అన్న మా సినిమాకు మంచి మ్యూ జిక్ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ ఒక కంప్లీట్ మూవీకి ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల మాట్లాడుతూ మా అందరికీ ఇదొక బ్యూటిఫుల్ ప్రాజెక్ట్. సత్య అన్నతో వర్క్ చేయడం సంతోషంగా ఉంది. రెండు పాటలు ఇప్పటికే కంప్లీట్ చేశాం. ఈ చిత్రంలో మ్యూజిక్ ను మాతో పాటు మీరంతా ఎంజాయ్ చేస్తారు.

## ఇళయరాజా చెప్పిన ఒక్క మాటతోనే సక్సెస్

### ఏ బ్యూటీఫుల్ బ్రేకప్' సక్సెస్ మీట్‌లో హీరో తక్ష్



తక్ష్, మటిల్డా హీరోహీరోయిన్లుగా నటించిన ఇంగ్లీష్ ఫీచర్ ఫిల్మ్ 'ఏ బ్యూటీఫుల్ బ్రేకప్'. అజిత్ వాసన్ ఉగ్గిన రచన, దర్శకత్వంలో ఒక ట్రెండ్ సెట్టింగ్ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్గా రూపొంది, ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రాన్ని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. మాస్ట్రో ఇళయరాజా సంగీతంలో ముద్రగడ రంగారావు, ఉగ్గిన సత్యనారాయణరావు సమర్పించిన ఈ చిత్రం, విడుదలైన అన్ని చోట్ల ట్రెమండస్ రెస్పాన్స్ను సొంతం చేసుకుని, సక్సెస్ఫుల్గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో సక్సెస్ మీట్ను నిర్వహించారు. ఇంగ్లీష్ భాషలో విడుదలైన ఈ చిత్రాన్ని త్వరలోనే హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన మాట్లాడుతూ. మా చిత్రాన్ని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ప్రేమ అనేది యూనివర్సల్. దీనికి ఎటువంటి కల్చర్ ఉండదు. పెయిన్ ఉంటుంది. మరి అలాంటి ప్రేమ కథా చిత్రాన్ని ఒక్క భాషలోనే ఎందుకు చేయాలి? ముందు ఇంగ్లీష్ భాషలో చేద్దామని ఫిక్సయ్యాం. రెండు పాత్రలతోనే చేద్దామని అన్నప్పుడు తక్ష్ ముందు భయపడ్డారు. ఎంతోమందిని పెట్టి, ఫైట్స్, డ్యాన్స్లు ఉన్నా సినిమాలు సక్సెస్ కావడం లేదు, రెండు పాత్రలతో అంటే.. అని డౌట్ వ్యక్తం చేశాడు. నీకెందుకు నేను చూసుకుంటాను అని.. ఇంగ్లీష్లో మొదట స్టార్ట్ చేశాం. ఇంగ్లీష్లో సినిమా చేయడమే కాదు, ఇళయరాజా గారి హిస్టరీలో కూడా నేను భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. హీరోహీరోయిన్లు తక్ష్, మటిల్డా సినిమా మొత్తాన్ని ఎంతో బాధ్యతగా తమ భుజాలపై మోశారు. ఇద్దరూ కొత్తవాళ్లే కానీ, హాలీవుడ్ రేంజ్లో వారు నటించి, వారి ప్రతిభను చాటుకున్నారు అని అన్నారు.

## 'క్రేజీ కల్యాణం' పోస్టర్ రిలీజ్

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'క్రేజీ కల్యాణం' స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో పెళ్లి కూతురిగా సంతోషంగా డ్యాన్స్ చేస్తున్న అనుపమ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆమె ఈ చిత్రంలో కీర్తి అనే క్యారెక్టర్ లో ప్రేక్షకులను అలరించనుంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి 'క్రేజీ కల్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉద్దెమారి, తదితరులు నటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి,యాక్షన్ డ్రాగన్ ప్రకాష్, సాహిత్యం గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రావణ్ కటికనేని, డీవోపీ శ్యామ్ దూపాటి, సంగీతం సురేష్ బొబ్బిలి అందిస్తున్నారు.



# బుద్ధుడు, అంబేద్కర్‌ల ఆలోచనలే సమస్యలకు పరిష్కారం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గౌతమ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ దార్శనిక మార్గంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పరిపాలన కొనసాగుతున్నదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బుద్ధుడు, అంబేద్కర్‌లు ఆలోచనల విధానమే సకల సమస్యలకు పరిష్కార మార్గమన్నారు. నెక్లెస్ రోడ్ సర్కిల్ వద్దనున్న అబేద్కర్ స్మృతివనం వద్ద విశ్వశాంతిని కాంక్షిస్తూ పాదయాత్ర చేస్తున్న థాయిలాండ్, భారతీయ బౌద్ధ సన్యాసులతో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కార్మిక శాఖమంత్రి జి.వివేక్ వెంకట స్వామి, బుద్ధవనం ప్రాజెక్ట్ ఓఎస్‌డి మల్లేపల్లి లక్ష్మ య్య, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావ్ తదితరులు పాల్లొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ బుద్ధవనం గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, అందులో భాగంగా నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ వద్దనున్న బుద్ధవనం చాలా అద్భుతంగా ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం బుద్ధవనం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. . అక్కడకు వెళితే మానసిక ప్రశాంతత ఏర్పడుంది. బౌద్ధులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. బుద్ధవనం ఒక అద్భుతమైన పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రమని ఆయన చెప్పారు. ఇక్కడ వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. బౌద్ధ భిక్షువులకు, పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రంలో బాబా సాహెబ్ అబేద్కర్ జీవిత చరిత్రను, ఆయన సందేశాలను, చూపించిన మార్గాన్ని రేపటి తరాలకు తెలియజేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం, సామాజిక న్యాయం పట్ల ఆయన ఉన్న నిబద్ధతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. థాయిలాండ్ నుంచి 70మంది, మరో 30మంది భారతీయ బౌద్ధ బిక్షువులు ఫిబ్రవరి 2న కర్నాటకలోని కలబురిగి నుంచి పాదయాత్రను మొదలు పెట్టారు. మార్చి 1 నాటికి నాగార్జున సాగర్ లోని బుద్ధవనం వరకూ వారి పాదయాత్ర కొనసాగునుందని నిర్వాహకులు తెలిపారు.










# అందరికీ ఉచిత విద్య

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఎఐఎస్‌ఎఫ్ జెండాలు పట్టుకుని తలకు రిబ్బన్లు కట్టుకుని విద్యార్థులు భారీ ఎత్తున నిర్వహించిన ఈ ర్యాలీ పూలాంగ్ చౌరస్తా మీదుగా టిటిడి కళ్యాణ మండపానికి చేరుకుంది. మండపంలో జరిగిన సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూనంనేని సాంబశివరావు, విశిష్ట అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శివ లింగరాజన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాణోత్ రఘురాం, ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థుల సమస్యలకై అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. అన్ని విద్యార్థి సంఘాలకు మూలం ఎఐఎస్‌ఎఫ్ అని, ఇది అన్ని సంఘాలకు తల్లిలాంటిదని మాతృసంఘం అన్నారు. ఎందరో నాయకులు ఈ విద్యార్థి సంఘం ద్వారా ఎదిగారని తాను కూడా ఈ సంఘం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నానని గుర్తు చేశారు. క్రమశిక్షణ గల వాడే సరైన నాయకుడని, ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఓర్పు సహనం ఎంతో అవసరమని నాయకుడికి క్రమశిక్షణతో పాటు దేహదారుడ్యం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు దేశభక్తితో పాటు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో ఉండాలన్నారు. భవిష్యత్తులో మంచి స్థానంలో నిలవాలంటే తల్లిదండ్రుల కలలను నిజం చేయాలంటే లక్ష్యం నిర్ధేశించుకుని అందుకు తగ్గట్లు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో చదివి, సమాజానికి కుటుంబానికి తోడ్పాటునందించాలన్నారు. జిల్లాలో 4 రాష్ట్ర మహాసభలు ఇంత గొప్పగా నిర్వహించటం సంతోషకరమైన విషయమని, అందుకు పని చేసిన ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ఆ లక్ష్యం కోసం పని చేయాలన్నారు. కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకరావలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఉచితంగా నాణ్యమైన విద్యనందించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్య కోసం ఎఐఎస్‌ఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తుందని, మా పోరాటాలతోనే విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం యుజిసి ద్వారా ఉన్నత విద్యాసంస్థలకు నిధులు రాకుండా చేస్తుందన్నారు. విద్యార్థులు భగత్‌సింగ్, చేగువేరా హీరోలుగా గుర్తించాలని, సినిమా హీరోలని కాదని సందర్భంగా సూచించారు. జిల్లాలో నాల్గవ రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ ఆఫీస్ బేరర్స్ ఇటికెల రామకృష్ణ, గ్యార నరేష్, రహమాన్, నాగజ్యోతి, వెంకటేష్, రాజారెడ్డి, రాజేశ్వర్, రాజన్న, స్వరూపరాణి, విఠల్‌గౌడ్, దశరథ్ పాల్గొన్నారు.

## 2 స్థానాలు ఖాళీ (మొదటి పేజీ తరువాయి)

నాలుగు, తెలంగాణలో రెండు, తమిళనాడులో ఆరు, ఛత్తీసగఢ్‌లో రెండు, పశ్చిమ బెంగాల్‌లో ఐదు, అసోంలో మూడు, హర్యానాలో రెండు, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకటి, బిహార్‌లో ఐదు స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటికి సంబంధించి ఈనెల 26వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. మార్చి 5 నామినేషన్లకు చివరి తేదీ కాగా, 6న పరిశీలన, 9న ఉపసంహారణకు తుది గడువుగా ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు జరగనుంది. అదే రోజు ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఇక మార్చి 20న ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది. పదవీ విరమణ చేస్తున్న ప్రముఖ ఎంపిలలో శరద్ పవార్ (ఎన్‌సిపి ఎస్‌పి), అభిషేక్ సింఘ్వి (కాంగ్రెస్), సాకేత్ గోఖలే (టిఎంసి), రాందాస్ అథవాలే (ఆర్‌పిఐఎ), ఎం. తంబిదురై (ఎఐఎడిఎంకె), తిరుచ్చి శివ (డిఎంకె) ఉన్నారు.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు చేపట్టారు. అధికారుల సమాచారం మేరకు, బెదిరింపు అందిన వెంటనే కోర్టు భవనాన్ని ఖాళీ చేయించి న్యాయమూర్తులు, సిబ్బంది, న్యాయవాదులు, కేసులకు వచ్చిన ప్రజలను బయటకు పంపించారు. అనంతరం బాంబు నిర్వీర్య దళం, స్నిఫర్ డాగ్ బృందాలు కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా తనిఖీ చేశాయి. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఇది నకిలీ (హోక్స్) బెదిరింపు అని పోలీసులు నిర్ధారించారు. భద్రతా కారణాల వల్ల తనిఖీలు పూర్తయ్యే వరకు కోర్టు ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించలేదు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలోని ఇతర కోర్టు సముదాయాల్లో కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. బెదిరింపు పంపిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టుతో పాటు తెలుగు రాష్ట్రాలలో పలు న్యాయస్థానాలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. కరీంనగర్, రాజమండ్రి జైళ్లకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో ఆయా కోర్టులలో ఉన్న సిబ్బందిని బయటకు పంపించి బాంబు సాక్వడ్ తనిఖీలు చేపట్టింది. అయితే ఇప్పటి వరకు ఎక్కడా అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదు. అయితే వీటిని ఫేక్ బెదిరింపులుగా భావిస్తున్నారు.

## పరువు తీసింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం, గల్గోటియాస్ యూనివర్సిటీని వెంటనే ఎక్స్‌పో నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వారి స్టాల్‌ను తక్షణమే ఖాళీ చేయించారు. చైనా రోబోను తమదిగా చెప్పుకోవడంపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'భారతదేశ ప్రతిభను, డేటాను వాడుకోవాల్సింది పోయి, ఎఐ సమ్మిట్‌ను ఒక పబ్లిసిటీ స్టంట్‌గా మార్చేశారు. ఇక్కడ భారతీయ డేటా అమ్మకానికి ఉంది. చైనా ఉత్పత్తులేమో ప్రదర్శనకు ఉన్నాయి' అని ఆయన ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ఎఐ విషయంలో భారత్‌ను ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు చేసిందని మండిపడ్డారు.

**కాంగ్రెస్ విమర్శల వర్షం**

కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై అధికారికంగా స్పందించింది. 'ఎఐ సమ్మిట్‌లో చైనా రోబోలను మనవిగా ప్రదర్శిస్తున్నారు. చైనా మీడియా మనల్ని చూసి ఎగతాళి చేస్తోంది. ఇది భారతదేశానికి నిజంగా అవమానకరం. ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఈ అబద్ధంలో భాగమయ్యారు. భారతీయ సదస్సులో చైనా రోబోలను ప్రమోట్ చేస్తున్నారు. దేశం ఇమేజ్‌కు మోదీ ప్రభుత్వం పూడ్చలేని నష్టం చేసింది. ఏఐ రంగాన్ని ఒక జోక్‌గా మార్చేశారు. మనకున్న డేటా శక్తితో మనం ప్రపంచానికి నాయకత్వం వహించాల్సింది పోయి, ఇలా దిగజారడం సిగ్గుచేటు' అని కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

## రంజాన్ ఉపవాసాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమవుతాయని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం మతస్థులు పవిత్ర ఉపవాస దినాలు పాటించేందుకు, ప్రార్థనలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రమదాన్ పవిత్ర దినాలు 18 లేదా 19 తేదీలలో ప్రారంభమవుతాయని మతాధికారులు తొలుత ప్రకటించారు. ప్రతిదేశంలోనూ నెలవంక కనిపించిన మరునాటి నుండి ముస్లింలు పవిత్ర ఉపవాసాలు ప్రారంభిస్తారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాలలో బుధవారం ప్రారంభం కాగా, భారత్, బంగ్లాదేశ్, లిబియా, ఇరాక్ దేశాలలో గురువారం ప్రారంభమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా మసీదులను శుభ్రం చేసి ప్రార్థనలకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్ (హిజ్రి) ప్రకారం తొమ్మిదో నెలలో రంజాన్ లేదా రమజాన్ పవిత్ర దినాలు ప్రారంభమవుతాయి.

**శాంతి మధ్య గాజాలో తొలి రంజాన్**

గాజాలో గత ఏడాది అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత మొదటిసారి శిథిలమైన ఇళ్ళ ప్రాంతాలమధ్య ప్రజలు బుధవారంనాడు రంజాన్ పవిత్రమాస దీక్షలకు ఉపక్రమించారు. ఒమరీ మసీదులో పెద్దసంఖ్యలో పాలస్తీనియన్లు ఉదయం ప్రార్థనలు చేశారు. విపరీతమైన చలివాతావరణంలో చెప్పులు లేకుండా ఒట్టి కాళ్ళతో ప్రజలు తెల్లారుజామునే మసీదు వద్దకు చేరుకున్నారు. ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్ష ప్రారంభించారు. కాగా గాజా తూర్పు ప్రాంతంలో కాల్పుల ఘటనలు సంభవించాయి. మరోవైపు వెస్ట్‌బ్యాంక్‌లో అక్రమ ఆక్రమణలు, భూమి రిజిస్ట్రేషన్లకు పూనుకుంటున్న ఇజ్రాయెల్ చర్యలను ఐక్యరాజ్యసమితిలోని 80 సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి.

## అత్యాచార యత్నమే..

(మొదటి పేజీ తరువాయి)

తర్కంతో పాటు సానుభూతి కూడా అవసరమని పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదముందని, వెంటనే జోక్యం చేసుకోవాలని వచ్చిన అభ్యర్థనల నేపథ్యంలో సుప్రీం కోర్టు విచారణ జరిపింది. హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని గత విచారణ సమయంలో విచారం వ్యక్తం చేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టేవిధించింది. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తాజాగా తుది తీర్పు వెలువరించింది. మహిళ వక్షోజాలను తాకడం, ఆమె పైజామా విప్పడానికి ప్రయత్నించడం అత్యాచార యత్నం కిందకు రాదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన 11 ఏళ్ల (ఘటన జరిగిన సమయానికి) కూతురితో కలిసి 2021 నవంబర్‌లో బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తోంది. ఆ సమయంలో వారికి తెలిసిన ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి బాలికను ఇంటి దగ్గర దింపుతామని చెప్పి తీసుకెళ్లారు. మార్గమధ్యంలో ఆ బాలికను ఓ కల్వర్టు కిందకు తీసుకెళ్లి అసభ్యంగా తాకడం మొదలుపెట్టారు. ఆమె వేసుకున్న దుస్తులను విప్పేందుకు ప్రయత్నించారు. బాలిక గట్టిగా అరవడంతో అటుగా వెళ్తున్నవారు అక్కడకు వచ్చారు. దీంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు జడ్జి.. బాలిక వక్షోజాలను తాకడం, దుస్తులను విప్పడానికి ప్రయత్నించడం అత్యాచారం కిందకు రాదని పేర్కొన్నారు. ఆ కేసును కొట్టేశారు. న్యాయమూర్తి వ్యాఖ్యలపై అప్పట్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో సుప్రీం కోర్టు ఆ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ ప్రారంభించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com